

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 28-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 120

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 7.28 తదుపరి నవమి; నక్షత్రం: అశ్విని ఉ. 11.48 తదుపరి భరణి; వర్జ్యం: ఉ.8.00-9.31, రా.9.02-10.35; దుర్ముహూర్తం: సా.5.03-5.54; అమృతఘడియలు: శేషం ఉ.6.28; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.46

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫార్మాసిటీ ఇక నెట్ జీరో సిటీ

- కర్బన ఉద్గార రహిత నగరంగా అభివృద్ధి
- ఫార్మాసిటీ భూముల్లో నిర్మాణానికి ప్రణాళిక
- 1న అక్కడే స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన?
- నేడు స్థల పరిశీలనకు సీఎం రేవంత్

12

మీటర్లపై మోసం!



- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు పెడతామన్నారు
- త్రైపాక్షిక ఒప్పందంలో కేంద్రం, రాష్ట్రం, డిస్కంలు
- మోదీ సమక్షంలో 2017 జనవరి 4న సంతకాలు
- ఒప్పందం విషయాన్ని దాచి గొప్పలు చెబుతున్నారు
- దీంతో వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టే పరిస్థితి
- లేకపోతే డిస్కంలపై కేంద్రం చర్యలు తీసుకుంటుంది
- ఉదయ్ ఒప్పందాన్ని అమలు చేయక తప్పని పరిస్థితి
- బీఆర్ఎస్ నాయకులు క్షమాపణ చెప్పాలి
- గొర్రెలు, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలపైనా విచారణకు సిద్ధమా?.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సవాల్

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): "వ్యవసాయానికి విద్యుత్తును సరఫరా చేసే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు పెడతామంటూ కేంద్రంతో బీఆర్ఎస్ ప్రభుత్వం త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. దానిపై అప్పట్లో అధికారులు సంతకాలు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలివిగో" అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. సంబంధిత ఫైళ్లను అసెంబ్లీలోనే ఉన్న హరీశ్ రావుకు పంపించారు. మోటార్లకు మీటర్లు పెడితే కేంద్రం అదనంగా ఇప్పిస్తానన్న రూ.30 వేల కోట్ల అప్పును తాము తిరస్కరించామంటూ బీఆర్ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకొంటున్నారని, కానీ.. ఒప్పందం చేసుకున్న విషయాన్ని దాచిపెడుతున్నారని ఆరోపించారు. బడ్జెట్‌పై శనివారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. మోటార్లకు మీటర్లు పెడితే అదనంగా రూ.30 వేల కోట్ల అప్పునకు అనుమతి ఇస్తామని కేంద్రం చెప్పిందని, అయినా.. దానిని తాము తిరస్కరించామని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా మాత్రమే కాకుండా వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మాట్లాడారు. గతంలో చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి

మిగతా 13వ పేజీలో...

మోటార్లకు మీటర్లు పెట్టే కుట్ర



- విద్యుత్తు సంస్కరణలకు మేం ఒప్పుకోలేదు
- సభను తప్పుదోవ పట్టించే యత్నం
- వ్యవసాయేతరానికే స్మార్ట్ మీటర్లు
- ఉదయ్ ఒప్పందంలో ఉన్నది ఇదే
- బీఆర్ఎస్ నేత హరీశ్ కౌంటర్

13

మరో ఐదేళ్లుంటే.. హైటెక్ సిటీనీ అమ్మేసేవారు

- ఎన్నికల్లో ఓడతారని తెలిసే.. ఓఆర్ఆర్ ప్రైవేటుకు
- అసెంబ్లీ సమావేశాల తరువాత ఇందిరమ్మ ఇళ్ల జాబితా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల పంపిణీ
- వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం: డిప్యూటీ సీఎం భట్టి

12



రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్రపతి భవన్
- ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్రకు..
- జిష్ణు దేవ్.. త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి
- బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగానూ సేవలు
- రాజకుటుంబ నేపథ్యం.. అయోధ్య ఉద్యమంలో పాత్ర
- దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

న్యూఢిల్లీ, జూలై 27: తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి అయిన ఈయన.. ప్రస్తుత ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ స్థానంలో రానున్నారు. రాజ కుటుంబానికి చెందిన జిష్ణుదేవ్ 1957 ఆగస్టు 15న జన్మించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. 1990ల ప్రారంభంలో బీజేపీలో చేరారు. అయోధ్య రామ జన్మభూమి ఉద్యమంలో పాల్గొన్నారు. 2018-23 మధ్య ఉప ముఖ్యమంత్రిగా, త్రిపుర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగానూ బాధ్యతలు

మిగతా 14వ పేజీలో...

రాష్ట్రాల స్థాయిలో నదుల గ్రిడ్

- జల వనరుల సమర్థ వినియోగానికి ఏర్పాటు చేయాలి
- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీ పడండి!
- రాష్ట్రాల సహకారంతోనే 2047 నాటికి వికసిత్ భారత్
- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

సమావేశం నుంచి మమత వాకౌట్

- నిధులపై మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారని ఆరోపణ
- భవిష్యత్తులో ఇంకెప్పుడూ హాజరు కాబోనంటూ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): జల వనరుల సమర్థ వినియోగానికి నీతి ఆయోగ్ వేదికగా ప్రధాని మోదీ అత్యంత కీలక సూచన చేశారు. ప్రతి రాష్ట్రం వారి స్థాయిలో నదుల గ్రిడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. నదీ జలాలపై దేశంలోని పలు రాష్ట్రాల మధ్య తీవ్ర స్థాయి వివాదాలున్న నేపథ్యంలో ప్రధాని ఈ సూచన చేయడం గమనార్హం. శనివారం రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన 9వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రతి భారతీయుడూ కలలు కంటున్నాడని, ఇందులో రాష్ట్రాలు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని.. సహకార సమాఖ్య

మిగతా 11వ పేజీలో...

జలదిగ్బంధంలో భద్రాద్రి ఏజెన్సీ

- 34 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- 53.4 అడుగుల ఎత్తులో గోదారి

14

జగన్ ధ్వంస రచన.. అబద్ధాలే ఆలంబన!



కొత్త పలుకు!

ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి ఆలోచనలు, ఎత్తుగడలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. వీటికి అలవాటు పడినవారు అతడిని అర్థం చేసుకోవడం కష్టం. అతడి అంతరంగం అంతుబట్టదు. అన్నీ తెలిసేసరికి ప్రత్యర్థులకు జరగాల్సిన నష్టం జరుగుతుంది.

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేయడమెలా? అన్న దానిపైనే ఇప్పుడు ఆయన ఫోకస్ ఉంటోంది. ఇందుకోసం అతను ఎటువంటి విధ్వంస రచన చేస్తారో వేచిచూడాలి. తాను పది ఎన్నికలు చూశానని సీఎం చంద్రబాబు చెప్పుకొంటున్నారు కానీ, జగన్ రెడ్డి వంటి వారిని ఇప్పుడే చూస్తున్నానని అనుక్షణం గుర్తు చేసుకోవాలన్నది మరచిపోతున్నారు. రాష్ట్రాభివృద్ధి ఎంత ముఖ్యమో, జగన్ వంటి వారిని రాజకీయంగా మళ్లీ కోలుకోకుండా దెబ్బ తీయడం కూడా అంతే ముఖ్యమని చంద్రబాబు తక్షణం గ్రహించాలి. అతగాడికి రాజకీయ భవిష్యత్తు లేదన్న నమ్మకం కుదిరితేనే ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా ముందుకొస్తారు.

4

జగన్ విధ్వంసాన్నే నమ్ముకున్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా విధ్వంసాన్నే నమ్ముకుంటున్నారు. జగన్ వద్ద అంతులేని ధన బలం ఉంది. 'అధికారం కోసం ధనం - ధనం కోసం అధికారం' అన్న సూత్రాన్ని జగన్ బలంగా నమ్ముతారు. ప్రజా సమస్యలపై గొంతు విప్పడానికే ప్రతిపక్షం ఉంటుందన్న పాత చింతకాయ పచ్చడి సిద్ధాంతాలను జగన్ నమ్మరు.

ఎన్నికల్లో ప్రజలు పాతాళానికి తొక్కినా రాజకీయంగా మళ్లీ ఊపిరి పోసుకోవడానికే జగన్ ప్రయత్నం చేస్తారు. అందుకోసం శవాల వేట కొనసాగుతూనే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర కాకముందే రాష్ట్రపతి పాలన కోరడం మనకు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. ఈ డిమాండ్ చేయడం వెనుక ఎటువంటి వికృత ఆలోచనలు, వ్యూహాలు ఉన్నాయో గుర్తించే ప్రయత్నం చేయకపోతే చంద్రబాబు ప్రభుత్వం ఆత్మరక్షణలో పడుతుంది.

మోదీ సర్కార్ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చంద్రబాబు సంకల్పం వాంఛనీయమే కానీ, రాజకీయం కూడా అంతే ముఖ్యం. జగన్ విషయంలో ఏమాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా రాజకీయ భూతం మళ్లీ జూలు విదిలిస్తుంది.

కారణాలు ఏమైనా శిథిలమైన రాష్ట్రాన్ని ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వం ఇప్పుడు సంసిద్ధంగా ఉంది. ప్రత్యేక హోదా వంటి కాలం చెల్లిన నినాదాలను ఎవరు చేసినా పట్టించుకోకూడదు. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం నిలదొక్కుకోలేదు. ప్రజలు ఈ వాస్తవాన్ని గుర్తించలేని పక్షంలో ఏపీకి మోక్షం ఉండదు.

తన గారాల పట్టి కవితను విడిపించుకోవడం కోసం కేసీఆర్ మనుషులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడాన్ని చూస్తున్నాం. కవితకు బెయిల్ వచ్చేలా సహకరిస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి కేసీఆర్ సిద్ధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ మోదీని ధిక్కరించి ఇండియా కూటమిలో చేరతారా? చేరితే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా?







ఓవైపు సహచర షూటర్లు వరుస బెట్టి నిరాశపరుస్తున్నా.. యువ షూటర్ మను భాకర్ మాత్రం అంచనాలను నిలబెట్టుకుంది. తొలిరోజు పోటీల్లో ఆఖరున బరిలోకి దిగిన భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సూపర్ ప్రదర్శనతో పతక ఆశలను రేపింది. టోక్యో గేమ్స్‌లో చేదు అనుభవాన్ని అధిగమిస్తూనే.. 20 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డుకెక్కింది. మరో రెండు విభాగాల్లో మాత్రం ఇతర షూటర్ల ప్రదర్శన అర్హత రౌండ్లలోనే ముగిసింది.

మను అదరహో

10 మీ. ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు

నిరాశపర్చిన ఇతర షూటర్లు ● భాకర్ స్వర్ణ పోరు నేడు

పారిస్: ఒలింపిక్స్ తొలి రోజు షూటింగ్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మను భాకర్ మినహా తొలి రోజు శనివారం బరిలోకి దిగిన మిగతా షూటర్లంతా గురి తప్పారు. మొదట 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో, ఆ తర్వాత 10మీ. పురుషుల ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లోనూ అంతా విఫలమయ్యారు. అయితే 22 ఏళ్ల భాకర్ మాత్రం కెరీర్‌లో తొలిసారి ఒలింపిక్ ఫైనల్‌కు చేరగలిగింది. సాయంత్రం ఆరంభమైన 10 మీ. మహిళల ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్స్‌లో 580.27 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. మేజర్ వెరోనికా (582.22, హంగేరీ), ఒహ్ యే జిన్ (580.20కొరియా) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. దీంతో 20 ఏళ్ల తర్వాత ఒలింపిక్ ఫైనల్‌కు చేరిన భారత మహిళా షూటర్‌గా మను నిలిచింది. 2004 ఏథెన్స్‌లో సుమ శిరూర్ 10మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. ఇక ఆరు సిరీస్‌ల పాటు జరిగిన అర్హత పోటీలో మను మొత్తంగా 60 షాట్లు సంధించగా వరుసగా 97, 97, 98, 96, 96, 96 పాయింట్లు సాధించింది. మరోవైపు మను సహచర షూటర్ రిథమ్ సంగ్వాన్ మాత్రం 15వ స్థానంలో నిలిచింది. టాప్-8 షూటర్లు మాత్రమే ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తారు.



సరబ్‌జోత్ అన్‌లక్కీ..



రమిత

షూటింగ్‌లో ముందుగా జరిగిన 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో రమిత జిందాల్-అర్జున్ బబుత జోడీ 628.70 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. అదే పోటీలో పాల్గొన్న సందీప్ సింగ్-ఎలవేనిల్ వలరివన్ జోడీ 626.30 పాయింట్లతో మరింత నిరాశపరుస్తూ 12వ స్థానంలో నిలిచి నిష్క్రమించక తప్పలేదు. అయితే 10మీ. ఎయిర్ పిస్టల్‌లో మాత్రం 22 ఏళ్ల సరబ్‌జోత్ సింగ్ తొమ్మిదో స్థానంలో నిలిచి కాస్తలో ఫైనల్ చాన్స్ చేజార్చుకున్నాడు. జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్‌తో సరబ్ 577 పాయింట్లతో సమంగా నిలిచాడు. కానీ సరబ్ కన్నా ప్రత్యర్థి కేవలం ఒక్క ఇన్నర్ టెన్స్‌ను సాధించడంతో నిరాశ తప్పలేదు. ఇదే పోటీలో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా 574 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచాడు.

తొలిరోజు భారత్ భళా

సాత్విక్ జోడీ, లక్ష్య ముందంజ



బ్యాడ్మింటన్

పారిస్: ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సాత్విక్ జోడీ శుభారంభం చేసింది. గ్రూప్-సిలో జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్ తొలి మ్యాచ్‌లో మూడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 21-17, 21-14తో ఫ్రాన్స్‌కు చెందిన లూకాస్ కోర్వీ-రోనన్ లబార్‌పై వరుస గేముల్లో సునాయాసంగా గెలిచింది. సోమవారం జరిగే రెండో గ్రూప్ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన మార్క్-మర్విన్‌తో సాత్విక్ జోడీ తలపడనుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగిన ఏస్ షట్లర్ లక్ష్య సేన్ బోణీ చేశాడు. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో జరిగిన మ్యాచ్‌లో సేన్ 21-8, 22-20తో టోక్యో సెమీఫైనలిస్ట్ కెవిన్ కార్డన్ (గ్వాటిమాల)పై వరుస గేముల్లో నెగ్గాడు. సోమవారం జరిగే రెండో గ్రూప్ మ్యాచ్‌లో జూలియన్ క్రెయిగ్ (బెల్జియం)తో సేన్ తలపడనున్నాడు. కాగా, మహిళల డబుల్స్ తొలిరౌండ్లో భారత జంట అశ్విని పొన్నప్ప-తనీషా 18-21, 10-21తో కొరియా ద్వయం కాంగ్-కిమ్ చేతిలో ఓటమిపాలైంది.

టీటీ: హర్మీత్ ముందంజ

టేబుల్ టెన్నిస్‌లో హర్మీత్ దేశాయ్ రెండో రౌండ్‌కు చేరుకొన్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో హర్మీత్ 4-0తో జైద్ అబూ యమన్ (జోర్డాన్)ను చిత్తు చేశాడు. .

బోపన్న పోరు నేటికి వాయిదా

టెన్నిస్

రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ పురుషుల టెన్నిస్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్ వర్షం కారణంగా ఆదివారానికి వాయిదా పడింది. ఫ్రాన్స్‌కు చెందిన మోన్‌ఫిల్స్-రోజర్ వస్సేలి జోడీతో బోపన్న ద్వయం తలపడనుంది.



రోయింగ్

రెపిచేజ్‌కు పన్వర్

రోయింగ్ పురుషుల సింగిల్ స్కల్ హీట్-1లో నాలుగో స్థానంలో నిలిచిన బల్‌రాజ్ పన్వర్ రెపిచేజ్‌కు అర్హత సాధించాడు. థామస్ మకింతోష్ (న్యూజిలాండ్), స్టెఫనోస్ ఎన్‌టొస్‌కోస్ (గ్రీస్), అబ్దుల్‌ఖలేక్ ఎల్బనా (ఈజిప్ట్) తొలి మూడు స్థానాల్లో నిలిచి క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. రెపిచేజ్ ద్వారా పన్వర్.. సెమీస్ లేదా ఫైనల్‌కు చేరుకొనేందుకు రెండో అవకాశం దక్కుతుంది.

హాకీ: గెలుపుతో మొదలెట్టారు


చివరి నిమిషాల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌తో ఒలింపిక్స్‌ను భారత హాకీ జట్టు విజయంతో ఆరంభించింది. గ్రూప్-బిలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో న్యూజిలాండ్‌ను ఓడించింది. 59వ నిమిషంలో కివీస్ జట్టు ఫౌల్ చేయడంతో టీమిండియాకు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని హర్మన్ గోల్‌గా మలచి జట్టును గెలిపించాడు. మన్‌దీప్ సింగ్ (24వ), వివేక్ సాగర్ (34వ) చెరో గోల్ సాధించారు. న్యూజిలాండ్ తరఫున సామ్ లేన్ (8వ), సైమన్ చైల్డ్ (53వ) గోల్స్ చేశారు. గత క్రీడల్లో భారత్ కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.



అంతరిక్ష కేంద్రంలో 'ఒలింపిక్స్'

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనూ ఒలింపిక్ ప్రారంభం సంబరాలు నిర్వహించారు. భారత సంతతికి చెందిన సునితా విలియమ్స్ సహా ఆరుగురు నాసా వ్యోమగాములు ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న సంగతి తెలిసిందే. వీరంతా ఒలింపిక్ టార్చ్‌ను తమ మధ్య అందజేసుకున్నారు. జానెట్ ఎప్ నుంచి ప్రారంభించి బుచ్‌విల్‌మోర్, సునితా విలియమ్స్ ఒకరికొకరు జ్యోతిని అందించుకున్నారు. అంతేకాదు..ఒలింపిక్స్‌ను పురస్కరించుకొని వారు కొన్ని క్రీడాంశాలను ప్రదర్శించారు. సునిత జిమ్నాస్టిక్స్ చేయగా, బరాట్ డిస్క్‌ను విసిరాడు. చివరగా వ్యోమగాములంతా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. రెండు నిమిషాల ఈ వీడియోను నాసా విడుదలజేసింది.

పారిస్‌లో నేటి భారతం



బాక్సింగ్: మహిళల 50 కిలోల ప్రిలిమినరీ రౌండ్ - నిఖత్ జరీన్ x మ్యాక్సీ కరీనా లోట్జెర్ (జర్మనీ) రా. 12.05.
టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ (రెండో రౌండ్) - ఆకుల శ్రీజ x క్రిస్టీనా కాల్‌బెర్గ్ (స్వీడన్) (మ.12.15). సింగిల్స్ (రెండో రౌండ్) - మనికా బాత్రా x అన్నాహర్సే (బ్రిటన్) మ. 12.15. పురుషుల సింగిల్స్ (రెండో రౌండ్) - శరత్ కమల్ x డినీ కోజుల్ (స్లొవేనియా) మ. 3.
షూటింగ్: మహిళల 10 మీ., ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ - ఎలవెనిల్ వలరివాన్ (మ. 12.45). పురుషుల 10 మీ., ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ - సందీప్ x అర్జున్ (మ. 2.45).
రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ (రెపిచేజ్ 2) - బల్‌రాజ్ పన్వర్ (మ. 1.18).
బ్యాడ్మింటన్: మహిళల సింగిల్స్ (గ్రూప్ స్టేజ్) పీవీ సింధు x ఫాతిమా అబ్దుల్ రజాక్ (మాల్దీవులు) మ. 12.50. పురుషుల సింగిల్స్ (గ్రూప్ స్టేజ్) ప్రణయ్ x ఫాబియాన్ రోత్ (జర్మనీ) రా. 8.
స్విమ్మింగ్: పురుషుల 100 మీ., బ్యాక్‌స్ట్రోక్ (హీట్-2) శ్రీహరి నటరాజ్ (మ. 3.16). మహిళల 200 మీ., ఫ్రీస్టయిల్ (హీట్ 1) ధినిధి దేశింగు (మ. 3.30).
ఆర్చరీ: మహిళల టీమ్ క్వార్టర్ ఫైనల్స్ - అంకిత భక్త్, భజన్ కౌర్, దీపిక కుమారి (సా. 5.45). సెమీఫైనల్స్ (రా. 7.17).

పతక ఈవెంట్లు

షూటింగ్: మహిళల 10 మీ., ఎయిర్ పిస్టల్ ఫైనల్ - మనుభాకర్ (మ 3.30).



తొలి స్వర్ణం చైనా ఖాతాలో..

పారిస్ క్రీడల్లో మొదటి స్వర్ణాన్ని చైనా సొంతం చేసుకొంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో చైనా షూటర్లు హువాంగ్ యుటింగ్-షెంగ్ లిహావో విజయం సాధించారు. సౌత్ కొరియాకు చెందిన కియుంగ్ హయున్-పార్క్ హజున్ జంట రెండో స్థానంలో నిలిచింది. ఇక, తొలిరోజు పోటీల్లో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టు రెండు పతకాలు దక్కించుకుంది. జూడో క్రీడాంశంలో ఓ రజతం, కాంస్యం సాధించింది. ఆ దేశానికి చెందిన లుకా మెకర్దీ రజతం, షిరిన్ బౌక్లీ కాంస్య పతకం అందుకున్నారు.

ఆరంభ వేడుకలు అభాసుపాలు!

అభ్యంతరకర ప్రదర్శనలు
- కొన్ని అపశ్రుతులు
- పారిస్ క్రీడల ప్రారంభోత్సవంపై వివాదం



పారిస్: సంప్రదాయానికి భిన్నంగా..సెన్ నదిపై బోట్లమీద అథ్లెట్లు పరేడ్ చేయడం ద్వారా ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. 205 దేశాల క్రీడాకారులతోపాటు, ప్రత్యక్షంగా తిలకించిన లక్షలాది మందికి, విశవ్యాప్తంగా పరోక్షంగా వీక్షించిన కోట్లాదిమందికి ప్రారంభ కార్యక్రమం కొత్త అనుభూతి పంచింది. అయితే ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు వివాదం రేపాయి. అంతేకాకుండా..దక్షిణ కొరియా పేరును తప్పుగా పలకడం, ఒలింపిక్స్ జెండాను తలకిందులుగా ఎగురువేయడం వంటి వివాదాలూ చుట్టుముట్టాయి. సాంస్కృతిక కార్యక్రమాలపై నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆక్షేపణలు వ్యక్తంజేస్తున్నారు. ఇవి క్రైస్తవులను కించపరిచేలా ఉన్నాయని ధ్వజమెత్తుతున్నారు. శిలువకు ముందు ఏసు క్రీస్తు తన శిష్యులతో కలిసి తీసుకున్న చివరి భోజనాన్ని 'ద లాస్ట్ సప్పర్' పేరిట లియోనార్డో డావిన్సి అద్భుతంగా చిత్రించాడు. అయితే ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 'లాస్ట్ సప్పర్' పేరిట నిర్వహించిన ప్రదర్శనలో క్రీస్తు స్థానంలో ఓ మహిళ శిరస్సుపై వెండి శిరస్త్రాణం ధరించింది. ఆమె చుట్టూ ట్రాన్స్‌జెండర్లు ఉండడం వివాదానికి కారణమైంది. అంతేకాదు.. క్రీస్తు ధరించే శిరస్త్రాణం ఆ మహిళ ధరించడాన్నీ ఆక్షేపించారు. అలాగే ఫ్రాన్స్ మాజీ రాణి మేరీ అంటోనెట్ శిరచ్ఛేదన ప్రదర్శనపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్రెంచ్ సింగర్ ఫిలిప్ కేటరిన్ ఇచ్చిన ప్రదర్శనపైనైతే తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీకు వైన్ దేవత 'డియనోసిస్' పేరిట ఇచ్చిన ప్రదర్శనలో..అతడు వంటి నిండా నీలిరంగు వేసుకొని, అక్కడక్కడా పండ్లు ధరించి ఓ పెద్ద పండ్ల పళ్లెంలో దాదాపు నగ్నంగా పడుకొని ఉండడం దుమారం రేపింది. ఇది గ్రీకు దేవతని అవమానించడమేనని నెటిజన్లు మండిపడుతున్నారు. కానీ కొందరు నెటిజన్లు కళాకారుల ప్రదర్శన వెనుక ఉద్దేశం మంచిదే అయినా..దానిని ప్రదర్శించిన విధానంలో లోపముందని అభిప్రాయపడ్డారు. మరోవైపు..మానవుల మధ్య జరిగే హింస ఎంత అసంబద్ధమైనదో హాస్యపూర్వకంగా ప్రదర్శించినట్టు నిర్వాహకులు వివరించారు.

వాళ్లు హైజాక్ చేశారు: కంగన



'లాస్ట్ సప్పర్' పేరిట నిర్వహించిన ప్రదర్శనను బాలీవుడ్ నటి కంగనా రనౌత్ తప్పుబట్టారు. 'నీలి రంగు వేసుకొని నగ్నంగా ఉన్న వ్యక్తి ఒకరు జీసస్‌గా చెప్పుకొని క్రైస్తవాన్ని పరిహసించాడు. ఒలింపిక్స్‌ను వామపక్షవాదులు పూర్తిగా హైజాక్ చేశారు. ఇది సిగ్గుచేటు' అని లోక్‌సభ ఎంపీ కంగన ఎక్స్‌లో దుయ్యబట్టారు.



ఒలింపిక్ టార్చ్‌తో కార్ల్ లూయిస్, నడాల్, సెరెనా



సౌత్ కొరియాకు బదులు నార్త్ కొరియా

అథ్లెట్ల పరేడ్ సందర్భంగా..ఆయా దేశాలను వ్యాఖ్యాతలు పరిచయం చేశారు. 'రిపబ్లిక్ ఆఫ్ కొరియా' పేరిట దక్షిణ కొరియాను పరిచయం చేయాలి. కానీ వ్యాఖ్యాత 'డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా'గా తప్పుగా పరిచయం చేశాడు. ఇది నార్త్ కొరియా పేరు. దాంతో దక్షిణ కొరియా క్రీడా మంత్రిత్వ శాఖ ఆగ్రహం ప్రకటించింది. ఈ విషయాన్ని ఫ్రెంచ్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని తమ దేశ విదేశాంగ శాఖకు దక్షిణ కొరియా క్రీడా శాఖ సూచించింది. కాగా..ఈ పొరపాటుపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ క్షమాపణలు తెలపింది. అలాగే.. ఐదు రింగ్‌లతో కూడిన ఒలింపిక్ జెండాను తలకిందులుగా ఎగుర వేయడం ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో చోటు చేసుకున్న మరో అపశ్రుతి.

వినువీధిలో ఒలింపిక్ జ్యోతి



పారిస్: బోట్లపై అథ్లెట్ల పరేడ్ నిర్వహించి ప్రత్యేకత చాటుకున్న పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు మరో వినూత్న ఆలోచన చేశారు. ఒలింపిక్ జ్యోతిని ఆకాశంలోకి పంపాలని వారు నిర్ణయించారు. ఈమేరకు ఒలింపిక్ జ్యోతిని ఓ గాజు పెట్టెలో ఉంచి దానిని ఓ బెలూన్‌కు అనుసంధానం చేశారు. సూర్యాస్తమయం తర్వాత టుయిలరీ గార్డెన్స్ నుంచి 60 మీ. పైగా ఎత్తులో నింగిలోకి ఒలింపిక్ జ్యోతి శనివారం రాత్రి చేరుకుంది. తెల్లవారుజామున రెండు గంటల వరకు ఇది వీక్షకులకు కనువిందు చేయనుంది. అనంతరం తిరిగి భూమి మీదకు వస్తుంది. ఉదయమంతా టుయిలరీ గార్డెన్స్‌లో జ్యోతిని ప్రేక్షకులు సందర్శించవచ్చు. ప్రతి రోజూ 10వేల మందికి ఉచితంగా ఒలింపిక్ జ్యోతిని దర్శించుకొనే అవకాశం కల్పించారు.



ఫేవరెట్ భారత్

శ్రీలంకతో ఆసియా కప్ ఫైనల్ నేడు

దంబుల్లా: ఆసియా కప్‌లో ఎదురులేని డిఫెండింగ్ చాంపియన్ భారత్ అమ్మాయిలు మరో టైటిల్‌పై గురిపెట్టారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంక జట్టును ఎదుర్కోనున్నారు. ఈసారి టోర్నీలో అద్భుత విజయాలు సాధిస్తూ వచ్చిన హర్మన్‌సేనను టైటిల్ ఫైట్‌లో హాట్ ఫేవరెట్‌గా అంచనా వేస్తున్నారు. టాపార్డర్ బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటుతుండడంతో భారత్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు శక్తికి మించి పని అవుతోంది. కాగా.. రెండేళ్ల కిందట జరిగిన ఫైనల్లోనూ శ్రీలంకను ఓడించి మనోళ్లు టైటిల్ అందుకోవడం విశేషం.

ఆ పోటీలు.. 16వేల కిలో మీటర్ల దూరంలో

పారిస్ ఒలింపిక్స్‌లో ఓ క్రీడా ఈవెంట్ మాత్రం ఆతిథ్య నగరానికి వేల కిలోమీటర్ల దూరంలో నిర్వహిస్తుండడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ఫింగ్ ఈవెంట్‌ను పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న ఫ్రెంచ్ పాలినేషియన్ ద్వీపం తాహితీలోని చిరుప్రాంతమైన టీహూపో తీరంలో నిర్వహిస్తున్నారు. ఇది క్రీడలకు ఆతిథ్యమిస్తున్న పారిస్‌కు ఏకంగా 15,715 కిలోల మీటర్ల దూరంలో ఉంది. ఒలింపిక్స్‌లో ఓ క్రీడను ఆతిథ్య నగరానికి ఇంత దూరంలో నిర్వహించడం 68 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. సాధారణంగా సర్ఫింగ్ ఈవెంట్‌ను సముద్ర తీరంలోని అలలపై నిర్వహిస్తారు. అయితే పారిస్‌కు సమీపంలో సముద్రం లేదు. దీంతో ఫ్రాన్స్‌లోనే భాగమైన టీహూపో తీరంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

'టాప్'షోతో బోణీ

తొలి టీ20లో శ్రీలంకపై భారత్ ఘనవిజయం

1 టీ20ల్లో శ్రీలంకపై పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (74) చేయడం భారతికిదే తొలిసారి.

పల్లెకెలె: కొత్త కోచ్.. కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో బరిలోకి దిగిన టీమిండియా శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించింది. టాపార్డర్‌లో సూర్యకుమార్ (58), పంత్ (49), జైస్వాల్ (40), గిల్ (34) లంక బౌలర్లను చెడుగుడు ఆడేయగా.. ఆ తర్వాత భారత బౌలర్లు కీలక సమయంలో చెలరేగి ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. దీంతో శనివారం జరిగిన తొలి టీ20లో 43 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. పేసర్ పథిరనకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంక 19.2 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు నిస్సాంక (79), కుశాల్ మెండిస్ (45) మెరుపు ఆరంభంతో తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించారు. నిస్సాంక క్రీజులో ఉన్నంత సేపు లంక విజయంపై ధీమాతోనే ఉంది. 14 ఓవర్లలో 140 పరుగులు సాధించిన వేళ.. నిస్సాంకను స్పిన్నర్ అక్షర్ అవుట్ చేయడంతో ఇక కోలుకోలేక పోయింది. భారత బౌలర్లు ఒక్కసారిగా పట్టు బిగించడంతో చివరి 9 వికెట్లు 30 పరుగుల వ్యవధిలోనే నేలకూలాయి. పరాగ్ ఐదు పరుగులకే మూడు వికెట్లు తీయగా.. అర్షదీప్, అక్షర్ రెండేసి వికెట్లు సాధించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

మెరుపు ఆరంభంతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో టాప్-4 బ్యాటర్లు అదుర్స్ అనిపించారు. ఓపెనర్లు జైస్వాల్, గిల్‌తోపాటు కెప్టెన్ సూర్యకుమార్ ఫటాఫట్ ఆటతీరుతో చెలరేగారు. ఇక ఆరంభంలో నెమ్మదిగా ఆడిన పంత్ చివర్లో తడాఖా చూపాడు. దీంతో భారత్ సునాయాసంగా 200 దాటేసింది. అటు లంక పేసర్ పథిరన డెత్ ఓవర్లలో 4 వికెట్లతో కాస్త కట్టడి చేయగలిగాడు. ఇన్నింగ్స్ తొలి బంతినే జైస్వాల్ ఫోర్‌గా మల్చగా.. అదే ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో 13 పరుగులు వచ్చాయి. ఇక మూడో ఓవర్‌లో జైస్వాల్ 6,4.. తర్వాతి ఓవర్‌లో గిల్ 4,4తో నాలుగు ఓవర్లలో స్కోరు 50కి చేరింది. అయితే ఆరో ఓవర్‌లో గిల్ 4,4,6తో పదును చూపినా చివరి బంతికి మధుశంకకు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే ఏడో ఓవర్ తొలి బంతికే జైస్వాల్ కూడా స్టంపౌట్ అయ్యాడు. కానీ సూర్య రాకతో లంక బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. ఎనిమిదో ఓవర్‌లో తను కళ్లుచెదిరే షాట్లతో 6,4,4 బాది 17 రన్స్ అందించాడు. 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన కెప్టెన్ కాసేపటికే పేసర్ పథిరనకు చిక్కాడు. ఇక సూర్య ఉన్నంతసేపు నిదానంగా ఆడిన పంత్ 16వ ఓవర్‌లో 6,4తో జోరు చూపాడు. 19వ ఓవర్‌లోనూ రెండు ఫోర్లు బాదినా.. పథిరన అతడితో పాటు పరాగ్ (7)ను అవుట్ చేశాడు. అప్పటికే 200 రన్స్ దాటిన స్కోరుకు చివరి ఓవర్‌లో అక్షర్ (10 నాటౌట్) 10 రన్స్ అందించాడు.



సూర్యకుమార్ (58)

2 టీ20ల్లో తన రెండో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (22 బంతుల్లో) సాధించిన సూర్యకుమార్. గతంలో దక్షిణాఫ్రికాపై 18 బంతుల్లోనే పూర్తి చేశాడు.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (స్టంప్) కుశాల్ (బి) హసరంగ 40; గిల్ (సి) ఫెర్నాండో (బి) మధుశంక 34; సూర్యకుమార్ (ఎల్బీ) పథిరన 58; పంత్ (బి) పథిరన 49; హార్దిక్ (బి) పథిరన 9; పరాగ్ (ఎల్బీ) పథిరన 7; రింకూ (బి) ఫెర్నాండో 1; అక్షర్ (నాటౌట్) 10; అర్షదీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 213/7. వికెట్ల పతనం:** 1-74, 2-74, 3-150, 4-176, 5-192, 6-201, 7-206. **బౌలింగ్:** మధుశంక 3-0-45-1; ఫెర్నాండో 4-0-47-1; తీక్షణ 4-0-44-0; హసరంగ 4-0-28-1; కమిందు 1-0-9-0; పథిరన 4-0-40-4.

శ్రీలంక: నిస్సాంక (బి) అక్షర్ 79; కుశాల్ (సి) జైస్వాల్ (బి) అర్షదీప్ 45; పెరీరా (సి) బిష్ణోయ్ (బి) అక్షర్ 20; కమిందు (బి) పరాగ్ 12; అసలంక (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 0; షనక (రనౌట్) 0; హసరంగ (సి) పరాగ్ (బి) అర్షదీప్ 2; తీక్షణ (బి) పరాగ్ 2; పథిరన (సి) అక్షర్ (బి) సిరాజ్ 6; ఫెర్నాండో (నాటౌట్) 0; మధుశంక (బి) పరాగ్ 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.2 ఓవర్లలో 170 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-84, 2-140, 3-149, 4-158, 5-160, 6-161, 7-163, 8-170, 9-170, 10-170. **బౌలింగ్:** అర్షదీప్ 3-0-24-2; సిరాజ్ 3-0-23-1; అక్షర్ 4-0-38-2; బిష్ణోయ్ 4-0-37-1; హార్దిక్ 4-0-41-0; పరాగ్ 1.2-0-5-3.

కాంగ్రెస్ ఇచ్చిందీ గాడిద గుడ్డే!

కాంగ్రెస్‌కు నలుగురు ఎమ్మెల్యేలను ఇచ్చిన రంగారెడ్డి జిల్లాకు ఏమిచ్చారంటూ ప్రశ్న

- గాడిద గుడ్డు అంటూ బీజేపీ ఫ్లెక్సీలు
- లోక్‌సభ ఎన్నికల సమయంలో సీఎం నినాదాన్నే ఇప్పుడు అందుకున్న బీజేపీ
- కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటల యుద్ధం




హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందంటూ పార్లమెంటు ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రముఖంగా ప్రస్తావించారు. బీజేపీకి తెలంగాణ 8 ఎంపీ సీట్లిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ తెలంగాణకు ఏమిచ్చింది?.. గాడిద గుడ్డు' అంటూ ఇటీవల ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్యే సీట్లు ఇస్తే.. రాష్ట్ర బడ్జెట్‌లో ఆ 'జిల్లాకు కాంగ్రెస్ ఏమిచ్చింది?.. గాడిద గుడ్డు' అంటూ ఇప్పుడు హైదరాబాద్‌లో బీజేపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. కేంద్ర బడ్జెట్ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం డిమాండ్లు, కేంద్ర మంత్రి ఖండన వారి మాటల్లోనే..

రేవంత్ రెడ్డి: యూపీలో ఏడు, ఏపీలో రెండు సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక సైనిక్ స్కూల్ ఉండాలి. కానీ తెలంగాణలో లేదు. సైనిక్ స్కూల్ ఇవ్వండని ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌కు పదేపదే విజ్ఞప్తి చేశాం. అయినా పట్టించుకోలేదు.

కిషన్ రెడ్డి: 2016లో సైనిక్ స్కూల్ ప్రారంభించాం. కేంద్రం, రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకున్నా.. దాన్ని ఎందుకు అమలు చేయలేదో తెలపాలి. ఆ కాగితాలన్నీ బయటపెట్టాలి.

రేవంత్ రెడ్డి: గిరిజన యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలి. దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని ఒక స్పష్టమైన ప్రకటన చేయాలి.

కిషన్ రెడ్డి: గిరిజన వర్సిటీ మంజూరైంది. నిధులిచ్చాం. ఇంకా వర్సిటీకి రావాల్సిన 150 ఎకరాల భూమి గత ప్రభుత్వం ఇవ్వలేదు... ఈ ప్రభుత్వమూ ఇవ్వలేదు. అయినా నేను గతంలో కేసీఆర్ క్యాబినెట్‌లోని మంత్రులతో కలిసి ములుగు వెళ్లి తాత్కాలిక క్యాంపస్ ప్రారంభించాం.

రేవంత్ రెడ్డి: తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి. దీనిపైనా పార్లమెంట్‌లో ప్రధాని నుంచి ఒక ప్రకటన రావాలని కోరుకుంటున్నాం.

కిషన్ రెడ్డి: ప్రధాని స్వయంగా ఖాజీపేట వచ్చి కోచ్, వ్యాగన్, ఇంజను ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసినా కనీసం అప్పటి సీఎం రాలేదు. ఇంకా కోచ్ ఫ్యాక్టరీ ఎక్కడ అంటే ఏం చెప్పాలో అర్థం కావడం లేదు.

వ్యాగన్ ఫ్యాక్టరీకే శంకుస్థాపన!

ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని 1972 నుంచి డిమాండ్ ఉన్నా.. రెండు పర్యాయాలు కేటాయించినట్లే కేటాయించి ఇతర ప్రాంతాలకు తరలించారని, అలాగే ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నా దానికీ కేంద్రం ఆమోదం తెలపడంలేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ప్రధాని మోదీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఖాజీపేటకు వచ్చి వ్యాగన్ల తయారీ పరిశ్రమ మాత్రమే ప్రారంభించారని, దీనివల్ల పెద్దగా ఉపయోగం లేదని, కోచ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే సుమారు 70 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. బీజేపీ నాయకులు చెబుతున్నట్లు మూడు పరిశ్రమలు ప్రారంభించలేదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య


కోమళ్ల శిరీష(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 27: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక కరీంనగర్ శివారులోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమళ్ల శిరీష(20) శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మరో మూడు రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలున్నాయి. తన వల్ల ఈ చదువుకావడంలేదని శిరీష తల్లిదండ్రులకు చెప్పి తరచూ బాధపడేది. అయితే చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని వారు సర్దిచెప్పేవారు. ఈ క్రమంలో శనివారం తోటి విద్యార్థులతో కలిసి కళాశాలకు వెళ్లిన శిరీష తరగతులు ముగిసిన తర్వాత కరీంనగర్‌లోని తమ ఇంటికి చేరింది. అదే కళాశాలలో ఉద్యోగం చేస్తున్న శిరీష తల్లిదండ్రులు విధులు ముగిశాక ఇంటికి వచ్చి చూసే సరికి శిరీష ఉరి వేసుకుని కనిపించింది. వారు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని శిరీష తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హలో.. అమెరికా డాక్టర్!

- భారత్ నుంచే 'రెండో అభిప్రాయం' సేవలు
- రోగుల కోసం టెలీ మెడిసిన్ సర్వీస్ షురూ
- డబ్బు, సమయం ఆదా.. సేవలు సులువు
- మన దేశంలోని ఏటా కోటిమందికి మేలు
- ఇప్పటిదాక వీరంతా
- అగ్ర రాజ్యానికి పయనం

హైదరాబాద్ సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఒక వైద్యుడు ఏదైనా వ్యాధి నిర్ధారణ చేస్తే రోగులు రెండో అభిప్రాయం (సెకండ్ ఒపీనియన్) కోసం మరో వైద్యుడిని సంప్రదిస్తుంటారు. అయితే, మన దేశంలో కాస్త డబ్బున్న ఇలాంటివారు ఏటా కోటి మంది క్లిష్టమైన జబ్బులపై సలహా కోసం అమెరికాలోని వైద్యుల వద్దకు వెళ్తున్నారు. భారీగా ఖర్చు పెట్టి ప్రయాణం చేయడంతో పాటు అపాయింట్‌మెంట్ కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇకపై మాత్రం ఇంత ప్రయాస అవసరం లేదు. ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఈ మేరకు భారతీయ రోగులు అగ్ర రాజ్య వైద్యులతో సులువుగా అనుసంధానమయ్యేలా 50 మంది స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులతో కూడిన 'మై అమెరికన్ డాక్టర్' పేరుతో టెలీ మెడిసిన్ సర్వీస్ అందుబాటులోకి వచ్చింది. ఈ సేవలను హైదరాబాద్‌లో శనివారం 'మై అమెరికన్ డాక్టర్ ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్' సీఈవో రాజ్ నార్ల ప్రారంభించారు. అమెరికా వెళ్లిన రోగులకు వైద్యుడి అపాయింట్‌మెంట్‌కు కనీసం వారం నుంచి ఆరు నెలలు పడుతుందని, ఫీజు 500 డాలర్ల వరకు ఉంటుందని, అదే టెలీ మెడిసిన్ ద్వారా సంప్రదిస్తే ఒకటి, రెండు రోజుల్లో మాట్లాడే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. సంక్లిష్ట వైద్య పరిస్థితులు, అరుదైన వ్యాధులు, కష్టమైన రోగ నిర్ధారణ, వ్యక్తిగత గోప్యత కారణాలతో ఏటా కోటి మంది రోగులు భారత్ నుంచి విదేశాలకు వెళ్తున్నారని చెప్పారు. 72 గంటలలో నివేదిక రూపొందించి రోగులకు అందిస్తామన్నారు. టెలీ కన్సల్టెంట్‌ను 149 డాలర్లకు, ఫాలో-అప్‌నకు కన్సల్టెంట్ ధరలో సగం ధర నిర్ణయించామని వివరించారు. www.myamericandoctor.com కి లాగిన్ అయి అమెరికన్ వైద్యుడిని సంప్రదించవచ్చన్నారు. డాక్టర్ ఎంపిక, అపాయింట్‌మెంట్, వైద్య నివేదికల అప్‌లోడ్, డబ్బు చెల్లింపులు అన్నీ ఆన్‌లైన్‌లోనే చేయవచ్చన్నారు. వైద్యుడి అభిప్రాయాన్ని పొంది తదుపరి సంప్రదింపులకూ వీలుందని తెలిపారు. ఒకే వేదికపై స్పెషలిస్ట్ వైద్య నిపుణుల సేవలు లభిస్తాయని రాజ్ నార్ల చెప్పారు. మై అమెరికన్ డాక్టర్ బృందంలో సహ వ్యవస్థాపకుడు, ఎండీ, సీఈవో డాక్టర్ రాజేందర్ నార్ల, ఎండీ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీపక్ థామస్, ఎండీ, సీవోవో డాక్టర్ హృషికేష్ జి, ఎండీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌రెడ్డి తదితరులున్నట్లు చెప్పారు.

50 శాతం మంది చికిత్సలో మార్పులు

రెండో అభిప్రాయం తీసుకోవడం వల్ల చికిత్సలో మార్పులు చేసుకున్నట్లు ఓ సంస్థ గతంలో నిర్వహించిన సర్వేలో తేలిందని 'మై అమెరికన్ డాక్టర్' నిర్వాహకులు చెప్పారు. 270 మందిపై జరిపిన అధ్యయనంలో 50 శాతం కంటే ఎక్కువ కేసుల్లో రెండో అభిప్రాయం తర్వాత రోగ నిర్ధారణలో మార్పు ఉన్నట్లు తేలిందన్నారు. జర్నల్ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ అధ్యయనం రెండో అభిప్రాయం రోగుల్లో గణనీయమైన మార్పులకు దారితీసిందని సూచించిందని తెలిపారు. ఈ అధ్యయనంలో 300 నుంచి 600 మంది రోగుల నమూనా ఉందన్నారు. 50 శాతం మంది రోగులు చికిత్సలో మార్పును చూశారన్నారు. మాయో క్లినిక్ చేసిన ఒక అధ్యయనంలో సుమారు 26 శాతం నుంచి 50 శాతం మంది రోగులు రెండో అభిప్రాయం తర్వాత రోగ నిర్ధారణ లోపంలో తగ్గుదల కలిగి ఉన్నారన్నారు. కార్యక్రమంలో మై అమెరికన్ డాక్టర్ అడిక్షన్ మెడిసిన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టు సభ్యుడు డాక్టర్ యోగి గుండంరాజ్, బోర్డు సభ్యులు డాక్టర్ రాజన్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఇదేం క్రమ'శిక్ష'ణ!

- విద్యార్థులు జుట్టు పెంచారని అడ్డదిడ్డంగా కత్తిరించిన ఉపాధ్యాయురాలు
- తల్లిదండ్రుల ఆందోళన.. టీచర్ సస్పెన్షన్
- ఖమ్మం జిల్లా పేరువంచలో ఘటన..

కల్లూరు, జూలై 27: క్రమశిక్షణ పేరుతో ఓ ఉపాధ్యాయురాలు హద్దు మీరి ప్రవర్తించారు. విద్యార్థులు జుట్టు పెంచారని ఆగ్రహించిన ఆమె.. తరగతి గదుల నుంచి వారిని బయటకు తీసుకొచ్చి ఒకరి తర్వాత ఒకరి జుట్టును అడ్డదిడ్డంగా కత్తిరించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగగా.. సదరు ఉపాధ్యాయురాలిని జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేశారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. దిగుమర్తి శిరీష పేరువంచ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. అయితే మొదటి నుంచి కూడా ఆమె క్రమశిక్షణ పేరుతో విద్యార్థుల పట్ల కఠినంగా ప్రవర్తించేవారు.. ఈ నేపథ్యంలోనే శనివారం ప్రార్థనా సమయం ముగిశాక.. విద్యార్థులంతా తరగతి గదుల్లోకి వెళ్లిపోయారు. కాసేపటికే శిరీష 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి గదికి వెళ్లి దాదాపు 15 మంది మగ విద్యార్థులను పిలిచి బయటకు తీసుకొచ్చి.. పాఠశాల వరండాలో వరుసగా కూర్చోబెట్టారు. ఫ్యాషన్ పేరుతో జుట్టును ఇష్టారీతిన పెంచుతారా అంటూ వారిపై మండిపడ్డారు. ఆఫీసు గది నుంచి కత్తెరను తెచ్చి విద్యార్థుల జుట్టును అడ్డదిడ్డంగా కత్తిరించారు. టీచర్ చేసిన పనికి షాక్‌కు గురైన కొందరు విద్యార్థులు.. ఇంటికెళ్లి తమ తల్లిదండ్రులతో చెప్పి బోరున విలపించారు. దీంతో విద్యార్థులతో కలసి తల్లిదండ్రులంతా స్కూలుకు వచ్చి 2 గంటల పాటు ఆందోళన చేశారు. పాఠశాల హెచ్ఎం సుదర్శన్ వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా.. సదరు టీచర్‌పై చర్యలు తీసుకుంటే తప్ప పిల్లలను స్కూలుకు పంపబోమని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆయన డీఈవో సోమశేఖర శర్మ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఘటనపై ఎంఈవో నుంచి ప్రాథమిక నివేదిక తెప్పించుకున్న డీఈవో.. సదరు ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి బాలుడి మృతి

చర్ల, జూలై 27: కూంబింగ్ బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర (ఐఈడీ) పేలి ఛత్తీస్‌గఢ్‌లో ఓ బాలుడు మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ముద్వెండి, పిడియా సరిహద్దు అడవుల్లో శనివారం ఈ ఘటన జరిగింది. గంగలూరు గ్రామానికి చెందిన హిడ్మా కవాసి అనే బాలుడు మేకలను మేపేందుకు సమీప అడవుల్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై కాలు వేశాడు. అది పేలడంతో అతని చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి హిడ్మాను బీజాపూర్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత 5 నెలల్లో బీజాపూర్ జిల్లాలో మందు పాతరల కారణంగా నలుగురు మృతి చెందినట్లు, మరో ఐదుగురు గాయపడినట్లు పోలీసులు చెప్పారు.



శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం:భద్రాచలం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫోన్ నం. 08743-232428

R.C.NO. A2/109/2024 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 25.07.2024

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలంనకు ది. 01.09.2024 నుండి ది. 31.08.2025 వరకు ఔట్ సోర్సింగ్ పద్ధతిపై అవసరమైన (1) మ్యాన్ పవర్ సరఫరా (2) ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సరఫరా చేయుటకుగాను (3) ప్రధాన ఆలయం, పరిసర ప్రాంతములు, ప్రధాన ఆలయం మరియు పర్ణశాల ఆలయం నందు శానిటేషన్ నిర్వహణ (4) ప్రధాన ఆలయం, ... (5) ఈ దేవస్థాన కాటేజీ మరియు సత్రముల యందు హౌస్ కీపింగ్ నందు నిర్వహణ (6) ఈ దేవస్థానమునకు నెయ్యి సప్లయ్ (7) తో దేవస్థానమునకు పూలు, పూల దండలు సప్లయ్ (2వ పిలుపు) చేయుటకు గాను రిజిస్టర్ మరియు అనుభవము కలిగిన సంస్థల నుండి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది.: 29.07.2024 ఉ.11.00 గం.ల నుండి, టెండరు దాఖలు చేయు చివరి తేది: 12.08.2024 ది. 11.00 గం.ల వరకు టెక్నికల్ బిడ్ తెరచు తేది: 12.08.2024న ఉ. 11.30 గం.లకు, ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 12.08.2024న మ. 12.00 గం.లకు ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

DIPR RO.No 2215-PP/CL/ADVT/1/2024-25 తేది.27.07.2024 సం/- ఎల్. రమాదేవి, కార్యనిర్వహణాధికారి

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం కామారెడ్డి
జిల్లా: కామారెడ్డి

Roc.No.E1/Tenders Add/ MCK /2024-25, తేది.27.07.2024

టెండర్ ప్రకటన

మునిసిపల్ జనరల్ ఫండ్ క్రింద కామారెడ్డి పురపాలక సంఘంలో సిసి రోడ్డు వేయుట, వనమహోత్సవం కొరకు కార్మికులు, ట్రైలర్‌తో తో ట్రాక్టర్ అద్దె మరియు వెదురు స్టేకులు, ట్రీ గార్డులు, దారాలు, రెక్ క్యాన్లు మొదలైన వాటి సరఫరా, మోటార్లు మరియు యాక్సెసరీల సరఫరా మరియు బిగ్గింపు అనగా (08) పనుల కొరకు టెండర్లు కోరుచున్నారు.క్ర.సం. 01, పథకం పేరు: మునిసిపల్ జనరల్ ఫండ్ (08 పనులు), అంచనా వ్యయం: 21.60 లక్షలు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29.07.2024న ఉ.10.00 గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 02.08.2024న సా.04.00 గం.లకు, బిడ్ల స్వీకరణకు చివరి తేది: 02.08.2024న సా.04.00 గం.లకు, బిడ్ డాక్యుమెంట్ తెరచు తేది: 02.08.2024న సా.04.30 గం.లకు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో పని దినాల్లో మరియు కార్యాలయ పని వేళల్లో నం.9849907822ను సంప్రదించగలరు మరియు www.tender.telangana.gov.in సం/- కమీషనర్, మునిసిపల్ కౌన్సిల్, కామారెడ్డి

DIPR RO.No.2231-PP/CL/ADVT/1/2024-25, తేది: 27.07.2024

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం కామారెడ్డి
జిల్లా-కామారెడ్డి

Roc.No.EI/Quotation Add/ 1156/2024-25, తేది:27.07.2024

కొటేషన్ ప్రకటన

దిగువ వాటి కొరకు సీల్డు కొటేషన్లు కోరబడుచున్నారు. 1. కామారెడ్డి పురపాలక సంఘంలో రెండు సంవత్సరాలకు కళాభారతి (మునిసిపల్ ఆడిటోరియం 600 మంది కూర్చునే సామర్థ్యం) యొక్క లీజు. క్ర.సం: 1 నుండి 4 - వేదుక/కార్యక్రమం రకం: 1. ప్రభుత్వం, 2.ప్రైవేట్, 3. సెమీ గవర్నమెంట్/కార్పొరేషన్. 4. కామారెడ్డి పురపాలక సంఘం. అన్నింటికీ అద్దె మొత్తం: రూ.లో ______, అన్నింటికీ లీజు మొత్తం/సంవత్సరానికి రూ.లో ______. 2. కామారెడ్డి పురపాలక సంఘంలో మహీంద్రా 415 YUVO TECH+ ఇంజిన్ కెపాసిటీ 31.33KW (42 HP) సరఫరా మరియు బిగ్గింపు, 1700kg 28.7 kW (38.5HP) PTO పవర్ గల హైడ్రాలిక్ లిఫ్టింగ్ కెపాసిటీ, హైడ్రాలిక్ సిలిండర్, 6 సంవత్సరాల వాహనం వారంటీ, పూర్తి సమగ్ర బీమా, , Q పన్ను, TR, మొదలైనవి కలుపుకొని, GST తో సహా తాత్కాలిక రిజిస్ట్రేషన్. 3. కామారెడ్డి పురపాలక సంఘంలో పొడవు 7.5 అడుగులు, వెడల్పు 4.90 అడుగులు మరియు ఎత్తు 2.70 అడుగులు బాడీ యొక్క ఫ్యాబ్రికేషన్‌తో స్వచ్ఛ ఆటో యొక్క సరఫరా మరియు బిగ్గింపు, హైడ్రాలిక్ సిలిండర్, కెపాసిటీ 3.0 క్యూ, ఇంజిన్ కెపాసిటీ 1197 సిసి, గరిష్ఠ పవర్ 80.70 BHP @ 6000 rpm, గరిష్ఠ టార్క్ 104Nm కలుపుకొని సౌండ్ సిస్టం ఏర్పాట్లు, ఒక సంవత్సరం రీఛార్జ్‌తో GPS ట్రాకర్, MRF, గుడ్ ఇయర్, CEAT టైర్లు, 2 సంవత్సరాలు లేదా 72000 కిమీ వాహన వారంటీ, పూర్తి సమగ్ర బీమా, Q పన్ను, HSRP, TR, పైంట్ మరియు స్టిక్కరింగ్, బాడీ ఫ్యాబ్రికేషన్ మొదలైనవి కలుపుకొని, GST తో సహా తాత్కాలిక రిజిస్ట్రేషన్ 4. కామారెడ్డి పురపాలక సంఘంలో పాత వాహనాల స్క్రాప్, విడిభాగాలు, పాడైపోయిన/విరిగిపోయిన మోటార్లు, పంపులు, కేబుల్‌లు, కాపర్ వైర్లు, పాత వస్త్రాల బారోలు, వాల్వులు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ వస్తువులు కేజీల వారీగా లేదా వస్తువుల వారీగా తగిన చర్యలు తీసుకోవాలి. కొటేషన్ స్వీకరణకు ప్రారంభ తేది: 29.07.2024, ఆఖరి తేది:01.08.2024, కొటేషన్ స్వీకరణకు చివరి తేది: (ముగింపు తేదీ): 01.08.2024న సా.04.00 గం.లకు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో పని దినాలలో మరియు కార్యాలయ పని వేళల్లో నం. 9849907822 & 9849907825 ను సంప్రదించగలరు. సం/- కమిషనర్, మునిసిపల్ కౌన్సిల్, కామారెడ్డి

DIPR RO.NO:2209-PP/CL/ADVT/1/2024-25 తేది: 27.07.2024

NATA2024
నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్

CoA కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ఆర్కిటెక్ట్స్ చట్టం 1972, క్రింద భారత ప్రభుత్వం యొక్క చట్టబద్ధ సంస్థ)

ముఖ్యమైన బహిరంగ ప్రకటన

NATA 2024 కొరకు అదనపు పరీక్షల నిర్వహణ

5- సంవత్సరాల B.Arch డిగ్రీ ప్రోగ్రామ్‌లో 1వ సంవత్సరం ప్రవేశం కొరకు అర్హులైన అభ్యర్థులకు మరింత అవకాశం కల్పించేందుకు **10 & 24 ఆగస్టు 2024న (రెండు సెషన్‌లలో)** NATA 2024 కొరకు అదనపు పరీక్షలను నిర్వహించాలని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నిర్ణయించింది.

పైన పేర్కొన్న పరీక్షలలో అర్హత సాధించిన అభ్యర్థులు వివిధ సంస్థలలో అందుబాటులో ఉన్న ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న/పూర్తి చేయని సీట్లలో మాత్రమే ప్రవేశానికి పరిగణించబడతారు. రాష్ట్రాలలో కేంద్రీకృత అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియ వారి వారి షెడ్యూల్ ప్రకారం జరుగుతుంది.

రిజిస్ట్రేషన్ **28.07.2024** నుండి ప్రారంభమవుతుంది.

రిజిస్ట్రేషన్ మరియు NATA 2024 గురించి మరిన్ని వివరాల కొరకు, దయచేసి NATA వెబ్‌సైట్ www.nata.in ని సందర్శించగలరు.

న్యూఢిల్లీ
28 జూలై, 2024 రిజిస్ట్రార్

https://www.facebook.com/COAsocialofficial @coasocial9258 @CouncilofArch1 @council_of_architecture_india WWW.NATA.IN



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

జగన్ ధ్వంస రచన.. అబద్ధాలే ఆలంబన!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఎత్తుగడలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. సంప్రదాయ రాజకీయాలకు అలవాటు పడినవారు అతడిని అర్థం చేసుకోవడం కష్టం. ఇటీవలిదాకా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆపసోపాలు పడటం చూశాం. 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అప్పట్లో జగన్‌రెడ్డిని తేలికగా తీసుకోవడంతో 2019 ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డారు. అబద్ధాలే పునాదిగా జగన్ రాజకీయాలు ఉంటాయి. ఇప్పుడు తాజా ఎన్నికల్లో తమకు అపూర్వ విజయం దక్కడంతో జగన్మోహన్‌రెడ్డి పనై పోయిందని చంద్రబాబు అండ్ కో సంబరపడినంత సేపు పట్ట లేదు... అతగాడు తనలోని మరో కోణం ప్రదర్శించడం మొదలు పెట్టారు. ఎన్నికల ఫలితాలు చూశాక తనకు హిమాలయాలకు వెళ్లిపోవాలనిపించిందని జగన్ వ్యాఖ్యానించడంతో నిజమే కాబోలు అని నమ్మారు. 'తాజా ఫలితాలు చూశాక జగన్‌రెడ్డి కోలుకుంటారని అనుకుంటున్నారా?' అని తెలుగుదేశం ముఖ్యుడొకరు ప్రశ్నించగా, 'చూస్తూ ఉండండి. మీకే తెలుస్తుంది' అని నేను బదులిచ్చాను. 2014 ఎన్నికల తర్వాత తానే ముఖ్యమంత్రినని బలంగా నమ్మిన జగన్‌రెడ్డి, ఆ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా బెదరలేదు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అప్పట్లో అతడిని అర్థం చేసుకోలేకపోయిన చంద్రబాబు అండ్ కో తేలికగా తీసుకున్నారు. ఆ తర్వాత గానీ జగన్మోహన్‌రెడ్డి అనే రాజకీయ భూతం తమనే కాదు... రాష్ట్రాన్ని కూడా వెంటాడుతూనే ఉంటుందని ఊహించలేకపోయారు.

> జగన్‌రెడ్డి ఇండియా కూటమిలో చేరబోతున్నారా? అన్న చర్చలో వాస్తవం నేతి బీరకాయలోని నెయ్యి చందంగా ఉంటుంది. జగన్‌రెడ్డి అనే వ్యక్తి పులి కాదు పిల్లి అని అనేక సందర్భాలలో రుజువైంది. గతంలో బెయిలు కోసం సోనియాగాంధీ వద్ద సాగిలపడిన విషయం మరచిపోవద్దు. ఇప్పుడు ప్రధాని మోదీని ధిక్కరించిన బలమైన నాయకులకు కూడా ఏ గతి పట్టిందో తెలిసి కూడా జగన్‌రెడ్డి వంటి వారు మోదీని ధిక్కరించే సాహసం చేస్తారని అనుకోలేం. సీబీఐ, ఈడీ కేసులలో విచారణ వేగవంతమైతే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? మరోవైపు రాష్ట్రంలో అధికారం వెలగబెట్టినప్పుడు చేసిన అరాచకాలు, అవినీతిపై కేసులు కట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించే సాహసం జగన్‌రెడ్డి చేసే అవకాశం లేదు. ఆయనకు ప్రస్తుతం కేసుల నుంచి రక్షణ కావాలి. లేని పక్షంలో రాష్ట్రంలో రాజకీయంగా ఊపిరి పోసుకొనే విషయం అటుంచితే అతడి రాజకీయ జీవితమే కొడిగట్టే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన రాజకీయ విన్యాసాలను అర్థం చేసుకోవాలి.

నెలనాళ్లకే నానాయాగీ

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందో లేదో... రాష్ట్రంలో అరాచకం ప్రబలిందని, రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెట్టడం జగన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెల రోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం కావొచ్చు. ఇదే జగన్‌రెడ్డి ప్రత్యేకత! క్రిమినాలజీలో ఆరితేరిన జగన్‌రెడ్డి రాజకీయాలు విలక్షణంగానే ఉంటాయి. గతంలో ఫ్యాక్షనిస్టులు తమ ప్రత్యర్థులకు స్పాట్ పెట్టాలనుకున్నప్పుడు ఎలిబీ కోసం ఏదో ఒక ఆస్పత్రిలో చికిత్స పేరిట చేరిపోయేవారు. ఆ తర్వాత ఎవరో ఒకరు హత్యకు గురయ్యేవారు. ఇప్పుడు ఈ ఆధునిక పాలెగాడైన జగన్మోహన్‌రెడ్డి తనపై గతంలోనే నమోదైన కేసులతో పాటు ఇకపై నమోదయ్యే కేసుల నుంచి రక్షణ కోసం ఢిల్లీ స్థాయిలో ధర్నా పేరిట స్కెచ్ వేసుకున్నారు. ఈ నేపథ్యంలో అతగాడు అలవోకగా అబద్ధాలు ప్రచారం చేస్తుంటారు. 30 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐలకు డీఎస్పీలుగా ప్రమోషన్ ఇచ్చి కుల పక్షపాతానికి పాల్పడ్డారని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రచారం చేశారు. సదరు అబద్ధం ప్రజల్లోకి బలంగా వెళ్లడంతో 2019 ఎన్నికలు కమ్మ వ్యతిరేకత ప్రాతిపదికన జరిగాయి. ఇప్పుడు ఢిల్లీ వేదికగా నెల రోజుల చంద్రబాబు పాలనలో 36 మంది హత్యకు గురయ్యారని జగన్ అలవోకగా అబద్ధాలు చెప్పారు. క్షేత్ర స్థాయి వాస్తవాలు తెలియని ఢిల్లీ రాజకీయ నేతలు గానీ, మీడియా ప్రతినిధులు గానీ ఇందులో నిజానిజాల గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయరు కదా! జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్నవారు ఇలాంటి అబద్ధాలు చెప్పకపోయినా నోరు విప్పితే చాలు... కేసులు పెట్టడం చూశాం. నిజాలు ప్రచురించిన పత్రికలపై సీఐడీ ద్వారా కేసులు పెట్టించారు. ఇప్పుడు నెల రోజుల్లో 36 మంది హత్యకు గురయ్యారని, వందల మందిపై హత్యాయత్నం జరిగిందని జగన్‌రెడ్డి అదురూ బెదురూ లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అండ్ కో... శుక్రవారం శాసనసభలో బదులిస్తూ, అదే నిజమైతే ఎఫ్ఐఆర్‌లు బయటపెట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ హత్యలు మాత్రమే కాదు, వ్యక్తిగత కక్షలతో కూడిన హత్యలను కూడా కలుపుకొన్నా 36 హత్యలే జరగలేదు. అలాంటప్పుడు జగన్‌రెడ్డి వేసిన బాటలో చంద్రబాబు ప్రభుత్వం కూడా కేసులు పెట్టవచ్చు కదా? చంద్రబాబులో అంత తెంపరితనం ఉండదన్న నమ్మకం జగన్‌రెడ్డిలో ఉన్నట్టుంది. అందుకే వినుకొండలో ఇద్దరు రౌడీల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారితీయగా... దాన్ని బూచిగా చూపి ఢిల్లీ వరకు వెళ్లారు.

శవం... రాజకీయం...

జగన్‌రెడ్డి రాజకీయాలకు అబద్ధాలు ఒక్కటే ఆలంబన కాదు, శవాలు కూడా కావాలి. 2019 ఎన్నికలకు ముందు జరిగిన వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను రాజకీయ ప్రయోజనాల కోసం గరిష్ఠంగా వాడుకున్నారు. నేరాలు, హత్యలు చేసిన తన వాళ్లను మంచివాళ్లుగా చెప్పుకోవడం ఆయనకు అలవాటు. వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూడా మంచివాడుగానే కితాబు ఇస్తూ వచ్చారు. తనకు గానీ, తన వాళ్లకు గానీ ప్రమేయం ఉన్న సందర్భాలలో అదెలా జరిగిందో దేవుడికే ఎరుక అని చెప్పి తప్పించుకోవడం కూడా జగన్‌రెడ్డికి అలవాటే. వివేకానంద రెడ్డి హత్య జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాత్ర అందులో ఉందని ప్రచారం చేసిన జగన్‌రెడ్డి... తాను ముఖ్యమంత్రి అయ్యాక హత్య చేసింది ఎవరో దేవుడికే తెలియాలని సింపుల్‌గా తేల్చేశారు. తాజా ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కూడా ఓటమికి కారణం దేవుడికే తెలియాలని తేల్చిపారేశారు. నిన్నగాక మొన్న మదనపల్లెలో సబ్ కలెక్టర్ కార్యాలయం దహనం కేసులో కూడా అదెలా జరిగిందో దేవుడికే తెలియాలని చెబుతున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చాలా మంచివాళ్లని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. జగన్‌రెడ్డి మాటలు వింటూ ఉంటే 'అందరూ శ్రీవైష్ణవులే– బుట్టలోని రొయ్యలు మాత్రం మాయమయ్యాయి' అన్న సామెత గుర్తుకొస్తుంది. జగన్‌రెడ్డి చేతులు పిసుక్కుంటూ పిచ్చి చూపులు చూడటాన్ని ట్రోల్ చేస్తూ తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా సిబ్బంది, తెలుగు తమ్ముళ్లు ఆనంద పడిపోతుంటారు కానీ... ఆ పిసుక్కోవడం వెనుక ఉండే వికృతమైన ఆలోచనలను పసిగట్టడంలో విఫలమవుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన రాజకీయాలకోసం శవాలు ఎక్కడ దొరుకుతాయా అని జగన్ ఎదురుచూస్తుంటారు. తాజాగా వినుకొండలో రషీద్ శవం అతనికి లభించింది. వెంటనే వికృత రాజకీయాలకు తెర లేపారు. ఈ సందర్భంగా 'స్పైడర్' సినిమాలో ఎస్‌జే సూర్య క్యారెక్టర్ గుర్తుకు రాకుండా ఉండదు. ఆ సినిమాలో ఎవరైనా చనిపోతే విలన్ పాత్రధారి అలౌకిక ఆనందం పొందుతాడు.

ఎవరిది అరాచకం?

జగన్‌రెడ్డి విషయానికి వస్తే... అతను అప్పుడప్పుడూ నిజాలు చెబుతుంటాడు. అయితే, అవి ఏ కాలానికి సంబంధించినవన్నదే ప్రశ్న! రాష్ట్రంలో అరాచకాలు, విధ్వంసాలు ప్రబలాయని, ప్రశ్నించే వారిని వేధిస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని జగన్‌రెడ్డి తాజాగా చెప్పుకొచ్చారు. ఇవన్నీ నిజమే గానీ, అలా జరిగింది తన పాలనలోనే అన్న నిజాన్ని మాత్రం జగన్ అంగీకరించరు. తన పాలనలో అరాచకం ప్రబలిందని నమ్మడం వల్లనే ప్రజలు తనను పదకొండు సీట్లకు పరిమితం చేశారని కూడా ఆయన ఒప్పుకోరు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని గొప్పగా చెప్పుకొన్న జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా అదే దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని, చేసిన పాపాలకు తగిన శిక్ష విధించాడని మాత్రం ఒప్పుకోరు. ప్రజలు తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా ఇవ్వలేదని గుర్తించి, కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం మాత్రం ఆయన చేయరు. అలా చేస్తే అతను జగన్మోహన్‌రెడ్డి ఎందుకవుతారు? తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు కూడా హాజరు కానని అతగాడు తాజాగా సెలవిచ్చారు. ప్రజలే ఇవ్వని హోదా కోసం హైకోర్టును ఆశ్రయించడం జగన్‌రెడ్డికే చెల్లింది. జగన్‌రెడ్డి శాసనసభకు హాజరైనా, అవకపోయినా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. చంద్రబాబు శాసనసభకు హాజరు కాకూడదని నిర్ణయించుకోవడం వెనుక బలమైన కారణం ఉందని కొందరైనా అంగీకరిస్తారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకే రానని చెప్పడమే జగన్‌రెడ్డి ప్రత్యేకత. సంప్రదాయ రాజకీయాలకు అలవాటుపడిన వారి అభిప్రాయాలకు ఆయన విలువ ఇవ్వరు. అతడి ఆలోచనల వెనుక అంతరంగం అంతుబట్టదు. అన్నీ తెలిసేసరికి రాజకీయ ప్రత్యర్థులకు జరగాల్సిన నష్టం జరుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్ విధ్వంసాన్నే నమ్ముకున్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా విధ్వంసాన్నే నమ్ముకుంటున్నారు.



> జగన్‌రెడ్డి అప్పుడప్పుడూ నిజాలు చెబుతుంటాడు. అయితే, అవి ఏ కాలానికి సంబంధించినవన్నదే ప్రశ్న! రాష్ట్రంలో అరాచకాలు, విధ్వంసాలు ప్రబలాయని, ప్రశ్నించే వారిని వేధిస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని జగన్‌రెడ్డి తాజాగా చెప్పుకొచ్చారు. ఇవన్నీ నిజమేగానీ, అలా జరిగింది తన పాలనలోనే అన్న నిజాన్ని మాత్రం జగన్ అంగీకరించరు. తన పాలనలో అరాచకం ప్రబలిందని నమ్మడం వల్లనే ప్రజలు తనను పదకొండు సీట్లకు పరిమితం చేశారని కూడా ఆయన ఒప్పుకోరు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని గొప్పగా చెప్పుకొన్న జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా అదే దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని, చేసిన పాపాలకు తగిన శిక్ష విధించాడని మాత్రం ఒప్పుకోరు. ప్రజలు తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా ఇవ్వలేదని గుర్తించి, కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం మాత్రం ఆయన చేయరు. అలా చేస్తే అతను జగన్మోహన్‌రెడ్డి ఎందుకవుతారు?

ధనం... అధికారం...

జగన్‌రెడ్డి వద్ద అంతులేని ధన బలం ఉంది. అతడికి కావాల్సింది అధికారం! 'అధికారం కోసం ధనం – ధనం కోసం అధికారం' అన్న సూత్రాన్ని జగన్‌రెడ్డి బలంగా నమ్ముతారు. అందుకే శాసనసభకు హాజరై అతను టైం వేస్ట్ చేసుకోరు. ప్రజా సమస్యలపై గొంతు విప్పడానికే ప్రతిపక్షం ఉంటుందన్న పాత చింతకాయ పచ్చడి సిద్ధాంతాలను జగన్ నమ్మరు. తాడేపల్లి ప్యాలెస్‌లోనో, బెంగళూరు ప్యాలెస్‌లోనో, మరోచోట నిర్మించుకున్న ప్యాలెస్‌లోనో సతీసమేతంగా సేదదీరుతూ విధ్వంస రచన చేస్తుంటారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రతిపక్షాలను అణచివేసేందుకు విధ్వంస రచనకే అధిక సమయం కేటాయించిన విషయం మరచిపోకూడదు. రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తినా జగన్‌కు పట్టదు. జగన్ తరహా రాజకీయాలు ఒంటబట్టించుకోని షర్మిల మాత్రం సంప్రదాయ రాజకీయాలను నమ్ముకున్నట్టున్నారు. అందుకే వరద నీటిలో దిగి ఫొటోలు దిగారు. ఇలాంటివి చిల్లర రాజకీయాలుగా జగన్ భావిస్తారు. 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేయడమెలా? అన్న దానిపైనే ఇప్పుడు ఆయన ఫోకస్ ఉంటోంది. ఇందుకోసం అతను ఎటువంటి విధ్వంస రచన చేస్తారో వేచిచూడాలి.

చంద్రబాబు తెలుసుకోవాలి...

తాను పది ఎన్నికలు చూశానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొంటున్నారు కానీ, జగన్‌రెడ్డి వంటి వారిని ఇప్పుడే చూస్తున్నానని అనుక్షణం గుర్తు చేసుకోవాలన్నది మరచిపోతున్నారు. రాజకీయాలలో తన సమకాలీనుడైన వైఎస్ రాజశేఖరరెడ్డితో తలపడినప్పుడు చంద్రబాబుకు ఇన్ని ఇబ్బందులు ఎదురుకాలేదు. గత ఐదేళ్లు చంద్రబాబు రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం. కార్యకర్త నుంచి చంద్రబాబు వరకు ప్రతి ఒక్కరినీ వేధించిన చరిత్ర జగన్‌రెడ్డిది. రాష్ట్రాభివృద్ధి ఎంత ముఖ్యమో, జగన్‌రెడ్డి వంటి వారిని రాజకీయంగా మళ్లీ కోలుకోకుండా దెబ్బతీయడం కూడా అంతే ముఖ్యమని చంద్రబాబు తక్షణం గ్రహించాలి. అతగాడికి రాజకీయ భవిష్యత్తు లేదన్న నమ్మకం కుదిరితేనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా ముందుకొస్తారు. జగన్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ముఖ్యం– రాష్ట్రాభివృద్ధిని ఆయన పట్టించుకోరు. ఈ క్రమంలో ఆయన ఎంతకైనా తెగిస్తారు. కేవలం వంద కోట్ల లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కవిత జైలు జీవితం గడుపుతున్నారు. జగన్‌రెడ్డి తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని 36 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని సీబీఐ తన చార్జిషీట్లలో పేర్కొంది. అయినా అదురూ బెదురూ లేకుండా క్రిమినల్ రాజకీయాలనే జగన్ నమ్ముకున్నారంటే అతను ఎలాంటివాడో అర్థం చేసుకోవాలి. మా ఓటర్లు వేరు అని చెప్పుకొనే జగన్‌రెడ్డి తన రాజకీయాలు వేరుగా ఉంటాయని కూడా చెప్పకనే చెబుతున్నారు. అర్థం చేసుకోలేకపోవడం అవతలివారి అవివేకం అవుతుంది. తాజా ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా పాతాళానికి తొక్కినా రాజకీయంగా మళ్లీ ఊపిరి పోసుకోవడానికే జగన్ ప్రయత్నం చేస్తారు. అందుకోసం శవాల వేట కొనసాగుతూనే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర కాకముందే రాష్ట్రపతి పాలన కోరడం మనకు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. ఈ డిమాండ్ చేయడం వెనుక ఎటువంటి వికృత ఆలోచనలు, వ్యూహాలు ఉన్నాయో గుర్తించే ప్రయత్నం చేయకపోతే చంద్రబాబు ప్రభుత్వం ఆత్మరక్షణలో పడుతుంది. కొలంబియాకు కంటి మీద కునుకు లేకుండా చేసిన మాఫియా డాన్ ఎస్కోబార్‌తో జగన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు పోల్చారు. ఎస్కోబార్ కేవలం డ్రగ్స్ స్మగ్లింగ్ మీదే ఆధారపడ్డాడు. అధికారం చేపట్టలేదు. కానీ... జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. కాలం కలిసొస్తే రాజకీయంగా ఊపిరిపోసుకొని మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నది జగన్‌రెడ్డి లక్ష్యం. ఇందుకోసం ఆయన ఎంతకైనా తెగిస్తారు. అప్రమత్తంగా ఉండటమా లేదా అన్నది చంద్రబాబు అండ్ కో తేల్చుకోవాలి. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చంద్రబాబు సంకల్పం వాంఛనీయమే కానీ, రాజకీయం కూడా అంతే ముఖ్యం. జగన్ విషయంలో ఏ మాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా రాజకీయ భూతం మళ్లీ జూలు విదిలిస్తుంది.

కేంద్రం అండపైనా అక్కసే...

కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌లతో చర్చలు జరిపి రాష్ట్రానికి కేంద్రం సహాయంపై ఒక అవగాహన కుదుర్చుకొని వచ్చారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్ర సంస్థల ద్వారా పదిహేను వేల కోట్ల రూపాయల సహాయం లభించబోతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఈ విషయాన్ని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించగానే అది అప్పు మాత్రమేనని, గ్రాంట్ కాదని జగన్ అండ్ కో విష ప్రచారం మొదలెట్టింది. తాను ముఖ్యమంత్రిగా ఢిల్లీ వెళ్లినప్పుడు ఎప్పుడైనా రాష్ట్రం గురించి అడిగిన దాఖలాలు చూపించే సాహసం జగన్ చేయలేరు. అయినా ఇప్పుడు అది అప్పు మాత్రమే అని ఎగతాళి చేయడాన్నిబట్టి జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేక హోదా బదులుగా 2019కి పూర్వం కేంద్రం ఇవ్వజూపిన ప్రత్యేక ప్యాకేజీ ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది. ఈ ప్యాకేజీ కింద లభించే సహాయాన్ని కేంద్రమే భరిస్తుంది. ఈ వాస్తవాన్ని ప్రజలు అర్థం చేసుకోకుండా అబద్ధాల మత్తులో ప్రజలను ముంచెత్తేందుకు జగన్ అండ్ కో శక్తివంచన లేకుండా ప్రయత్నాలు మొదలెట్టారు. కారణాలు ఏమైనా శిథిలమైన రాష్ట్రాన్ని ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వం ఇప్పుడు సంసిద్ధంగా ఉంది. ఈ అవకాశాన్ని చంద్రబాబు ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. ప్రత్యేక హోదా వంటి కాలం చెల్లిన నినాదాలను ఎవరు చేసినా పట్టించుకోకూడదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటిన తర్వాత ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలని కోరడం రాజకీయమే అవుతుంది. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం నిలదొక్కుకోలేదు. ప్రజలు ఈ వాస్తవాన్ని గుర్తించలేని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌కు మోక్షం ఉండదు. గతంలో జగన్ ట్రాప్‌లో పడి ప్రత్యేక ప్యాకేజీని చంద్రబాబు వదులుకోవడం వల్ల జరిగిన నష్టాన్ని ప్రజలు గ్రహించాలి. జగన్‌రెడ్డి ఎత్తుగడలు ఎన్నో రూపాల్లో ఉంటున్నాయి. వాటిల్లో ప్రజాహితం మచ్చుకైనా ఉండదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన చెప్పిన మాటలు, చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను పదే పదే ప్రదర్శిస్తే చాలు. అతని వద్ద సమాధానం ఉండదు. ప్రజలు కూడా అర్థం చేసుకుంటారు.

> ప్రత్యేక హోదా బదులుగా 2019కి పూర్వం కేంద్రం ఇవ్వజూపిన ప్రత్యేక ప్యాకేజీ ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది. ఈ ప్యాకేజీ కింద లభించే సహాయాన్ని కేంద్రమే భరిస్తుంది. ఈ వాస్తవాన్ని ప్రజలు అర్థం చేసుకోకుండా అబద్ధాల మత్తులో ప్రజలను ముంచెత్తేందుకు జగన్ అండ్ కో శక్తివంచన లేకుండా ప్రయత్నాలు మొదలెట్టారు.

పులి కాదు.. పిల్లి

జగన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో కొంత మంది ఇండియా కూటమి నాయకులు పాల్గొనడంతో ఆయన ఇండియా కూటమిలో చేరతారా? అన్న చర్చ మొదలైంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు కూడా ఢిల్లీ కేంద్రంగా రాజకీయాలు చేసే నాయకులను ఆహ్వానించేవారు. ఢిల్లీ రాజకీయాల గురించి అవగాహన ఉన్న వారికి ఇవన్నీ తెలుసు. వచ్చే వారు ఎందుకు వస్తారో అందరికీ తెలుసు. జాతీయ మీడియాలో చోటు లభించాలంటే ఏం చేయాలో కూడా అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి ఇండియా కూటమిలో చేరబోతున్నారా? అన్న చర్చలో వాస్తవం నేతి బీరకాయలోని నెయ్యి చందంగా ఉంటుంది. జగన్‌రెడ్డి అనే వ్యక్తి పులి కాదు పిల్లి అని అనేక సందర్భాలలో రుజువైంది. గతంలో బెయిలు కోసం సోనియాగాంధీ వద్ద సాగిలపడిన విషయం మరచిపోవద్దు. ఇప్పుడు ప్రధాని మోదీని ధిక్కరించిన బలమైన నాయకులకు కూడా ఏ గతి పట్టిందో తెలిసి కూడా జగన్‌రెడ్డి వంటి వారు మోదీని ధిక్కరించే సాహసం చేస్తారని అనుకోలేం. తన గారాల పట్టి కవితను విడిపించుకోవడం కోసం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుషులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడాన్ని చూస్తున్నాం. కవితకు బెయిల్ వచ్చేలా సహకరిస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి కూడా కేసీఆర్ సిద్ధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి మోదీని ధిక్కరించి ఇండియా కూటమిలో చేరతారా? చేరితే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? సీబీఐ, ఈడీ కేసులలో విచారణ వేగవంతమైతే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? మరోవైపు రాష్ట్రంలో అధికారం వెలగబెట్టినప్పుడు చేసిన అరాచకాలు, అవినీతిపై కేసులు కట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించే సాహసం జగన్‌రెడ్డి చేసే అవకాశం లేదు. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు జగన్ రాజకీయాలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. కేంద్రంతో సఖ్యత సాధ్యం కాని పక్షంలో రాజ్యసభలోని తన సభ్యులను బీజేపీలోకి పంపడానికి కూడా మొహమాటపడరు. ఆయనకు ప్రస్తుతం కేసుల నుంచి రక్షణ కావాలి. లేని పక్షంలో రాష్ట్రంలో రాజకీయంగా ఊపిరి పోసుకొనే విషయం అటుంచితే అతడి రాజకీయ జీవితమే కొడిగట్టే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన రాజకీయ విన్యాసాలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు... తాను మాత్రం బాగుండాలన్నదే జగన్‌రెడ్డి ఏకైక లక్ష్యం. అందుకోసం ఆయన ఏమైనా చేస్తారు. ఎంతకైనా దిగజారుతారు. "తన పెళ్లి లోకకళ్యాణమని, తన చావు జగత్ప్రళయమని" అనుకునే బాపతు జగన్. అధికారంలో ఉన్నంత కాలం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును పెద్దగా ప్రస్తావించని జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారం కోల్పోయాక రాజశేఖరరెడ్డి పాలనను ప్రజలకు గుర్తు చేసే ప్రయత్నాలను మళ్లీ మొదలుపెట్టడం గమనార్హం. ఈ మహానుభావుడికి ఆంధ్రజ్యోతి, ఈనాడు వంటి సంస్థలు దుర్మార్గంగా కనపడటంలో ఆశ్చర్యం ఏముంది? అయినా అతడిని మించిన దుర్మార్గుడు ఎవరుంటారు లెండి!

> చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందో లేదో... రాష్ట్రంలో అరాచకం ప్రబలిందని, రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెట్టడం జగన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెల రోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం కావొచ్చు. ఇదే జగన్‌రెడ్డి ప్రత్యేకత! క్రిమినాలజీలో ఆరితేరిన జగన్‌రెడ్డి రాజకీయాలు విలక్షణంగానే ఉంటాయి. గతంలో ఫ్యాక్షనిస్టులు తమ ప్రత్యర్థులకు స్పాట్ పెట్టాలనుకున్నప్పుడు ఎలిబీ కోసం ఏదో ఒక ఆస్పత్రిలో చికిత్స పేరిట చేరిపోయేవారు. ఆ తర్వాత ఎవరో ఒకరు హత్యకు గురయ్యేవారు. ఇప్పుడు ఈ ఆధునిక పాలెగాడైన జగన్మోహన్ రెడ్డి తనపై గతంలోనే నమోదైన కేసులతో పాటు ఇకపై నమోదయ్యే కేసుల నుంచి రక్షణ కోసం ఢిల్లీ స్థాయిలో ధర్నా పేరిట స్కెచ్ వేసుకున్నారు. ఈ నేపథ్యంలో అతగాడు అలవోకగా అబద్ధాలు ప్రచారం చేస్తుంటారు.

నిరుద్యోగ సమస్యకి చిట్కాల పరిష్కారమా?

తాజా బడ్జెట్టులో, నిరుద్యోగుల కోసం, లక్షా 7 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టు కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది! ఎందుకూ? రకరకాల పరిశ్రమలలో, ప్రైవేటు రంగంలో, దాదాపు 50 లక్షల కొత్త ఉద్యోగాలు దొరికేలా! 'ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింద'ని పత్రికలు కూడా ప్రకటించాయి! కానీ, ఆ రకపు కేటాయింపులు, 'నిరుద్యోగం' అనే రాకాసి వ్యాధిని ఏ మాత్రం తగ్గించవని బైట వున్న లెక్కలు చెపుతున్నాయి. ఇప్పటికే, పని చేసే సామర్థ్యం వుండీ, పని దొరకనీ, 28 కోట్ల మంది నిరుద్యోగులు వున్నారని ఆ లెక్కలే చెబుతున్నాయి. అంతేకాదు. ఇంకా, ప్రతీ సంవత్సరం, 2 కోట్ల 40 లక్షల మంది, అప్పటికి పెరిగిన యువతీ యువకులు, ఉద్యోగాల కోసం కొత్తగా తయారవుతున్నారు. ఇటువంటి స్థితిలో, ప్రభుత్వం, అది ఏ పార్టీ ప్రభుత్వం అయినా, ప్రకటించే బడ్జెట్టు కేటాయింపులు ఏ మాత్రమూ సరిపోయేవి కావు.

ఈ నిరుద్యోగ సమస్య గురించి, ప్రభుత్వమూ పారిశ్రామికవేత్తలూ, ఆర్థిక వేత్తలూ, చేస్తున్న రకరకాల సూచనల్ని చూద్దాం. ముందుగా ఒక ఉదాహరణ! దేశంలోని అన్ని ప్రాంతాలనీ కలిపే రహదారుల్ని నిర్మిస్తే, కొన్ని లక్షలమందికి పని దొరుకుతుందనేది ఒక సూచన! కానీ, జరుగుతున్నది ఏమిటి? ఒకప్పుడు, ఒక్క రహదారి నిర్మాణానికి కొన్ని 'వందల మంది' అవసరం అయితే, ఇప్పుడు కొన్ని 'పదుల మంది' చాలునని ఇప్పటి లెక్క! ఎందుకంటే, భారీ యంత్రాలనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు కాబట్టి! నేలని బాగా లోతుగా తవ్వే యంత్రాలూ (జె.సి.బి.లు); రోడ్డు వెయ్యడానికి కావలసిన సిమెంటునీ, ఇసకనీ కలిపి తయారు చేసే కాంక్రీట్ మిక్సర్లూ; రోడ్డుని చదును చేసే రోడ్డు రోలర్లూ; నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చే పెద్ద పెద్ద ట్రక్కులూ వంటివెన్నో భారీ యంత్రాలను ఉపయోగించడం వల్ల, కార్మికుల్ని తక్కువగా ఉపయోగిస్తున్నారు. ఒక పెద్ద వెడల్పు రహదారిలో, ఒక కిలోమీటరు రోడ్డు వెయ్యడానికి 20 మందిని మాత్రమే, 40 రోజుల్లో మాత్రమే పనిలో పెడతారని ఇప్పటి లెక్క! కాబట్టి, భారీ యంత్రాలను ఉపయోగించి, కార్మికులకు పనులే లేకుండా చేసే 'ప్రధానమంత్రీ గ్రామ్ సడక్ యోజన' అని ఎన్ని గొప్ప పేర్ల పథకాలు పెట్టినా, వాటిలో ఏ పథకమూ నిరుద్యోగం సమస్యని పెంచుతుందేగానీ తగ్గించదు.

ఇప్పుడు బడ్జెట్టులో ఒక కొత్త పథకం పెట్టారు. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే పరిశ్రమల వారికి, డబ్బు రూపంలో కొంత ప్రోత్సాహకాలు అందించే పథకం. కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారికి, ఒక నెల జీతాన్ని ప్రభుత్వమే మూడు వాయిదాల్లో ఇవ్వడం. ఎప్పటికప్పుడు సాంకేతికత (టెక్నాలజీ) మెరుగవుతూ వుంటుంది కాబట్టి, దానికి తగిన నైపుణ్యాన్ని నేర్చుకునే సమయంలో, ఆ నిరుద్యోగులకి కొంత డబ్బు (స్టైపెండ్) ఇవ్వడం. నైపుణ్యాలు నేర్చుకున్న తర్వాత కూడా వారందరికీ ఉద్యోగాలు గ్యారంటీగా దొరుకుతాయో లేదో స్పష్టత లేదు. ఇక, ప్రతి ఏటా కొత్తగా ఉద్యోగాలు కావలిసిన '2 కోట్ల 40 లక్షల' మంది యువజనుల మాటేమిటి?

> ఎన్ని పథకాలు పెట్టినా, ఇప్పుడు వున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో నిరుద్యోగం అనేది సమాజానికి పుట్టుకతో ప్రారంభమైన రాచపుండు! దీనికి పరిష్కారం, యంత్రాలు అనే 'ఉత్పత్తి సాధనాల' రూపంలో వున్న పెట్టుబడిని, శ్రమలు చేసే కార్మిక వర్గం స్వాధీనం చేసుకోవడమే.



ఎన్ని పథకాలు పెట్టినా, ఇప్పుడు వున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో నిరుద్యోగం అనేది సమాజానికి పుట్టుకతో ప్రారంభమైన రాచపుండు! దీనికి చిట్కా వైద్యాలెలా పని చేస్తాయి? 'లాభమే' లక్ష్యంగా గల ఈ ఆర్థిక విధానంలో, ఆ లాభాల్ని సంపాదించడానికి, పరిశ్రమల వాళ్ళు అనుసరించే ఒక ప్రధానమైన పద్ధతి, 'ఉత్పాదకత' కోసం సాంకేతికతల్ని పెంచుకుంటూ పోవడం! సాంకేతికత అంటే, భారీ యంత్రాలనూ, ఆటోమేటిక్ యంత్రాలనూ నడుపుతూ తక్కువ మంది కార్మికులు, తక్కువ ఖర్చుతో, పెద్ద మొత్తంలో, 'సరుకుల్ని' ఉత్పత్తి చేసేలా చూడడం! ఈ మధ్య 'కృత్రిమ మేధ'తో ('ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్') అంటే కంప్యూటరు సైన్స్‌ని ఉపయోగించి, మనుషులకున్న తెలివితో పోలుస్తూ, యంత్రాల్ని ఉపయోగించడం! ఈ మార్గంలో, కోట్ల కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు ఏర్పరిచే మార్గాలోచనే లేకుండా ఆ సంఖ్యని తగ్గించడానికి ప్రయత్నాలు ఎక్కువయ్యాయి!

ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే, అసలు యంత్రాలే వద్దని కాదు. మానవుల మేధాశ్రమల వల్లా, శారీరక శ్రమల వల్లా తయారైన యంత్రాలు, మార్క్సు 'కాపిటల్'లో చెప్పినట్టు, మానవుల "పని భారాన్ని తగ్గిస్తాయి. కానీ, పెట్టుబడి వాటిని ఉపయోగించినప్పుడు, అవి శ్రమ తీవ్రతను పెంచుతాయి." పెట్టుబడిదారుల సంపదని పెంచి, కార్మికుల్ని 'పరమ దరిద్రులుగా' ('పాపర్స్'గా) చేస్తాయి. పెట్టుబడి అన్నప్పుడు అది చిన్నస్థాయిదైనా, మధ్యస్థాయిదైనా, భారీ స్థాయిదైనా, సాధారణంగా పెట్టుబడిదారులు ఏదో స్థాయిలో యంత్రాలను ఉపయోగించడం, తక్కువమంది కార్మికులతో ఎక్కువ పనిచేయిస్తూ పరిశ్రమలు నడపడానికే! దాని ఫలితమే, నిరుద్యోగం రెట్టు మరింతగా పెరగడం.

అది ఎలా జరుగుతుందో చూద్దాం: ఒక తివాచీల ఫ్యాక్టరీ, సంవత్సరానికి 6 కోట్ల పెట్టుబడితో పనిచేస్తోంది అనుకుందాం. యంత్రాలూ, ముడిపదార్థాలూ వగైరాల కోసం 3 కోట్లు. జీతాల కోసం 3 కోట్లు. ఈ జీతాలతో సంవత్సరానికి 100 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక మనిషికి సంవత్సర జీతం: 3 లక్షలు. ఇలా ఉండగా, కార్మికుల అవసరాన్ని సగానికి తగ్గించే కొత్త యంత్రం వచ్చినప్పుడు? జీతాలలోనించే 1 కోటీ, 50 లక్షల్ని తగ్గించి, దాన్ని తీసి, కొత్త యంత్రం కోసం అదనంగా పెట్టారు. కొత్త యంత్రం వల్ల 50 మంది కార్మికులు, అవసరం లేకుండా, అదనం ఐపోయారు. మిగిలిన 50 మంది కార్మికులతోనే గతంలో జరిగిన పని అంతా జరుగుతుంది.

ఆ పెట్టుబడి, గతంలో: యంత్రాలూ, వగైరాలకు– 3 కోట్లూ + జీతాలకు 3 కోట్లూగా ఉంటే, అదే ఇప్పుడు: యంత్రాలకు 4 కోట్ల, 50 లక్షలుగా పెరిగి + కార్మికుల జీతాలకు 3 కోట్ల నించి, 1 కోటీ, 50 లక్షలుగా తగ్గిపోయింది! ఆ పెట్టుబడితో గతంలో: 100 మంది కార్మికులు పనిలో ఉంటే, దానితో ఇప్పుడు 50 మంది మాత్రమే పనిలో ఉన్నారు. ఇంకో 50 మంది నిరుద్యోగులయ్యారు.

దీనికి పరిష్కారం, యంత్రాలు అనే 'ఉత్పత్తి సాధనాల' రూపంలో వున్న పెట్టుబడిని, శ్రమలు చేసే కార్మిక వర్గం స్వాధీనం చేసుకోవడమే! ఇది జరగాలంటే, చాలా పనులు జరగాలి. అన్నిటికంటే ముందు జరగవలిసింది: "పాలక వర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, ఆ అధికారానికి వ్యతిరేకంగా నిరంతర ప్రచారం ద్వారానూ, పాలక వర్గాల విధానాల పట్ల శతృపూరిత వైఖరిని ప్రదర్శించడం ద్వారానూ, కార్మిక వర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. లేకపోతే, కార్మికవర్గం పాలకవర్గాల చేతిలో ఆట వస్తువుగా వుండిపోతుంది." (మార్క్స్, 23-11-1871).

ఈ పని చెయ్యవలిసింది ఎవరు? కార్మికవర్గ రాజకీయ పార్టీల వారు. మరి వారు ఈ పని చేస్తున్నారా?

■ రంగనాయకమ్మ



Sunday SPECIAL

టీచర్లూ.. సెల్యూట్

- తాము పనిచేసే సర్కారు బడిలోనే తమ పిల్లలకు చదువులు
- ప్రైవేటు స్కూళ్లు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దంటున్న పలువురు గురువులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- గవర్నమెంట్ బడుల్లోనే మెరుగైన బోధన, సౌకర్యాలున్నాయంటూ కితాబు

7



ఇప్పుడంతా 'కార్పొరేట్' యుగం. చదువుల నుంచి కొలువుల వరకూ అందరూ కార్పొరేట్ సంస్థలవైపే మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై తల్లిదండ్రులు కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సైతం కష్టాలు పడైనా.. అప్పులు చేసైనా.. తమ పిల్లలను ప్రముఖ నగరాలు, పట్టణాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తుంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం.. తమ పిల్లలకు తాము పనిచేసే ప్రభుత్వ బడుల్లోనే చదువు చెప్పిస్తున్నారు. పెద్దపెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు చెప్పించే స్థోమత ఉన్నా.. సర్కారు స్కూళ్లలోనూ మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధన అందుతోందని, ప్రైవేట్, కార్పొరేట్ తరహాలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, ఇంగ్లీష్ మీడియం బోధన కూడా మెరుగ్గానే ఉంటోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కొలువులు చేసి.. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకోవడమే కాదు.. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించేలా తమ పిల్లలకు సర్కారు చదువు చెప్పిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఆయారే.. ఎల్‌ఆర్‌ఎస్!

- నాన్ లేఅవుట్ దరఖాస్తులకు చాన్స్
- అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగేళ్ల నిరీక్షణకు పడనున్న తెర
- దరఖాస్తుల పరిశీలనకు జిల్లాకో ప్రత్యేక బృందం
- కొత్త దరఖాస్తులకూ అవకాశం
- పరిష్కారంలో పాత దరఖాస్తులకు ప్రాధాన్యత
- గతంలోనే శ్లాబుల వారీగా నిర్ణయమైన ధరలు

హనుమకొండ, జులై 27 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్న దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నాలుగేళ్ల తర్వాత లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులకు ఎట్టకేలకు పరిష్కారం లభించనున్నది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రతీ జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటంతో ఈ దిశగా కదలిక మొదలైంది. ఇన్నాళ్లు మూలపడిన దరఖాస్తుల బూజు దులుపుతున్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక బృందాలు దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నాయి. కొత్త ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రత్యేక బృందాలు వీటిని కూడా పరిశీలించి పరిష్కరించింది. కొత్త దరఖాస్తులకు కూడా అవకాశం ఇచ్చినందుకు లే అవుట్ కాని భూములు కొన్న యజమానుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వారు కూడా దరఖాస్తులు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ సారైనా ఎల్‌ఆర్‌ఎస్ ఇబ్బందులు తొలగిపోతాయని దరఖాస్తుదారులు ఆశిస్తున్నారు.

ఆశపడి కొంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రియల్ వ్యాపారులు లే అవుట్‌లు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ విచ్చలవిడిగా అక్రమ లే అవుట్‌లు చేశారు. ఈ క్రమంలో తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో వేలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో పాటు నిబంధనల అమలుకు కఠినంగా వ్యవహరిస్తున్న క్రమంలో ప్లాట్ల యజమానులు తమ దయనీయ స్థితిని సర్కారు దృష్టికి తీసుకువచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. 2015 అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ పథకంను తెచ్చింది. లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించింది. లే అవుట్ క్రమబద్ధీకరణకు రూ.10వేల చొప్పున చెల్లించి దరఖాస్తులు దాఖలు చేశారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్నవారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా క్రమబద్ధీకరణ జరగలేదు. తర్వాత 2020 ఆగస్టులో మరో జీవో తీసుకొచ్చింది. ఇందులో ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసేందుకు అవకాశం కల్పించింది. అది కూడా జరగకపోవడంతో 2022 తర్వాత మరో జీవో ద్వారా వెసులుబాటు కల్పించింది. క్రమబద్ధీకరణకు స్థలం విలువ లెక్కింపునకు ప్రభుత్వం శ్లాబులవారీగా కూడా ధరలు నిర్ణయించింది. ఆ మేరకు మార్గదర్శకా లను కూడా జారీ చేసింది. అయినా అమలు కాలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతి ఇవ్వడంతో లేఅవుట్లు లేని ప్లాట్ల యజమానుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భారీగా సమకూరనున్న ఆదాయం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంతో ప్రస్తుతం నిధుల లేమితో కునారిల్లుతున్న కార్పొరేషన్, పురపాలక సంఘాలు, పంచాయతీలకు భారీగా ఆదాయం సమకూరనున్నది. అయితే ఇదే స్థాయిలో ప్రజలపై ఆర్థిక భారం పడనున్నది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలో ప్లాట్ మార్కెట్ విలువలో 14 శాతం రుసుము వసూలు చేస్తారు. ఇది తమకు పెనుభారంగా మారుతుందని దరఖాస్తుదారుల పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ వసూలు చేసే రుసుము ప్లాట్లు కొనుగోలు చేసిన రేటు కన్నా అనేక రేట్లు అధికమవుతుందని చెబుతున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పెద్దగా దాఖలుకానట్లు సమాచారం. ప్రభుత్వం కూడా పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఆదాయ మార్గాలపైనే దృష్టి సారించింది.

'కుడా'లో పెండింగ్ సంగతేమిటీ?

ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకం ప్రకటించిన కొత్తలో 2015లో దరఖాస్తులను స్వీకరించే అధికారాన్ని పట్టణాభివృద్ధి సంస్థలకు ఇచ్చింది. ఈ క్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థకు సుమారు 25వేల దరఖాస్తులు అందాయి. అయితే సిబ్బంది కొరత కారణంతో దరఖాస్తుల పరిష్కారంలో తీవ్ర జాప్యానికి పాల్పడింది. సుమారు 19వేల దరఖాస్తులను అతికష్టం మీద పరిష్కరించగలిగింది. ఇప్పటికీ కుడా వద్ద ఆరువేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరీ వాటి సంగతేమిటనే విషయంలో స్పష్టత లేదు.

పెరిగిన శ్లాబులు

ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు తగ్గిస్తూ 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చదరపు గజం ధర ఆధారంగా క్రమబద్ధీకరణ కోసం చార్జీల శ్లాబుల సంఖ్యను పెంచింది. నిర్దేశించిన ఖాళీస్థలాలు, వదలని చోట్ల చెల్లించాల్సిన రుసుమును రిజిస్ట్రేషన్ సమయంలో సబ్‌రిజిస్ట్రార్ నిర్ణయించే ధరను ప్రాతిపదికగా చేసింది. ప్రత్యేకంగా నాలా చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. 2020లో జారీ చేసిన క్రమబద్ధీకరణ పథకం జీవో 131 ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అప్పట్లోనే ప్రారంభమైంది. ఈ మేరకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి కమిషనర్లకు ఆదేశాలు అందాయి. అయితే పలు కారణాల వల్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

1.09 లక్షల దరఖాస్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,09,696 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు నాలుగేళ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీలో 99,221, వర్ధన్నపేట మునిసిపాలిటీలో 460, పరకాల మునిసిపాలిటీలో 3,194, నర్సంపేట పురపాలక సంఘంలో 5,421 దరఖాస్తులు దాఖలయ్యాయి. గ్రామ పంచాయతీలకు మరో 1,400 దరఖాస్తులు అందాయి. ప్రతీ దరఖాస్తుకు రుసుము కింద రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.10,83,10,000 ఆదాయం సమకూరింది. వరంగల్ కార్పొరేషన్‌లో మొత్తంగా 99,293 దరఖాస్తులు దాఖలయ్యా యి. వీటిలో 10,871 దరఖాస్తులను పరిశీలించారు. 1,084 దరఖాస్తులకు సంబంధించి సరైన పత్రాలు లేవంటూ షార్ట్‌ఫాల్ చూపించారు. 80 దరఖాస్తులను తిరస్కరించారు. 40 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. 309 దరఖా స్తులకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లింపునకు నోటీసులు పంపారు. ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.9,92,93,000 వసూలు చేశారు. ఆమోదించిన దరఖాస్తులకు రూ.27,26,677 రుసుము చెల్లించాలని ఆదేశాలు పంపారు. వర్ధన్నపేట మున్సి పాలిటీకి అందిన 460 దరఖాస్తుల్లో 230 వరకు పరిశీలిం చారు. పరకాల మునిసిపాలిటీలో దాఖలైన 3,194 దరఖా స్తుల్లో కేవలం అయిదింటిని మాత్రమే పరిష్కరించారు. నర్సంపే ట పురపాలికలో 5,421 దరఖాస్తులకు గాను 1,849 పరిశీ లించారు. గ్రామపంచాయతీలో దాఖలైన 1,400 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో ఏ ఒక్కటీ పరిష్కారానికి నోచుకోలేదు.



అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న వినయభాస్కర్

ప్రపంచ స్థాయిలో దేశ ఖ్యాతిని నిలిపిన కలామ్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- బీఆర్‌ఎస్ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ వర్ధంతి

రాంనగర్, జులై 27: శాస్త్ర, సాంకేతికరంగాల్లో దేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలిపిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ కొనియాడారు. శనివారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్‌తో పాటు పలువురు నేతలు అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కలామ్ చేసిన సేవలు దేశం మరువదన్నారు. అణు ఆయుధాల రూపకల్పనలో, క్షిపణుల తయారీలో ఆయన కృషి ప్రపంచానికి మార్గదర్శకమైందన్నారు. ఆయన జీవితం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. బీఆర్‌ఎస్ నేత పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేశ్, నయీమ్, జానకి రాములు, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి


- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జులై 27: డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అధికారులు, సిబ్బందికి సూచించారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోల్ట్స్, పెట్రోకార్, పోలీసు అధికారులతో సీపీ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. బ్లూకోల్ట్స్

మిగతా 8వ పేజీలో

WANTED
VMR HOSTEL
రాంపూర్, వరంగల్ నందు పని చేయుటకు
✦ WARDEN (M/F)
✦ వంట మనిషి
వెంటనే కావలెను
Cell : 9849224169

WANTED TEACHERS
Wanted High School Biology, Maths (Upper Primary) and Pre-Primary Teachers
Others : PETs and DTP Operator
Experienced and English Medium Background Candidates only preferred
Free Acomodation for Non-Local candidates
CHAITANYA MODEL HIGH SCHOOL
PARKAL - 7337069698



బల్దియా షెడ్డును తనిఖీ చేస్తున్న మేయర్ సుధారాణి

వాహన మరమ్మతు పనుల్లో వేగం పెంచండి

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జులై 27: యుద్ధప్రాతిపదికన వాహనాలు మరమతు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ రిపేరు షెడ్డును అకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్డులో చేపడుతున్న సివిల్ పనుల తీరుపై అడిగి తెలుసుకున్నారు. అక్కడ పెద్ద మొత్తంలో ఉన్న స్క్రాప్‌ను తరలించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ పనులతో చేపట్టిన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల కారణంగా మట్టిని అడ్డుగా పోయడంతో నీరు నిలిచిపోయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి మట్టిని తక్షణమే తొలగించి డస్ట్ మొరం పోయాలని సదరు కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. మరమతు కోసం వచ్చే బల్దియా వాహనాలను 2, 3 రోజుల్లో రిపేరు చేసి పంపించాలని చెప్పారు. స్క్రాప్‌కు సంబంధించిన టెండర్‌ను పిలిచి అక్కడి నుంచి తొలగించాలన్నారు. సెకండరీ ట్రాన్స్‌ఫర్మేషన్ పనులు త్వరంగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చే విధంగా పనులు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, డీఈ సంతోష్‌బాబు, ఏఈ సంతోష్‌తోపాటు కాంట్రాక్టర్ శ్రీనివాస్ గౌడ్, పీఆర్వో అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

పారిశుధ్యంలో అలసత్వాన్ని సహించేది లేదు..

- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- 1వ డివిజన్‌లోని పలు ప్రాంతాల పరిశీలన
- నలుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

వరంగల్ కార్పొరేషన్, జులై 27: పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని, ఎవరైనా సిబ్బంది పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. శనివారం ఉదయం గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్‌లోని పెగడపెల్లి, గుండ్లసింగారం, విజయలక్ష్మికాలనీ, ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల్లో శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అక్కడ పని చేసే సిబ్బందికి పలు సూచలను చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు జావాన్‌లకు షోకాజు నోటీసులు ఇవ్వాలని సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌ను ఆదేశించారు. ముచ్చర్ల గ్రామంలో దోమల సమస్య ఎక్కువగా ఉందని గ్రామస్తులు చెప్పడంతో బయాలజిస్ట్, మలేరియా సిబ్బందిని పిలిచి వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణకు ఏం మందు వాడుతున్నారు? అన్ని రోజులకోమారు ఫాగింగ్ చేస్తున్నారు? అని విచారించారు. రోడ్లపై గుంతలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. తర్వాత పలివేల్పుల సమీపంలోని కేయూ ఫిల్టర్ బెడ్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏఈలు హరికుమార్, శ్రీకాంత్, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్లు బాషానాయక్, శ్రవంత్, హెల్త్ అసిస్టెంట్ మధూకర్ పాల్గొన్నారు.



గుండ్లసింగారంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కాళోజీ కళాక్షేత్రం పనులు పరిశీలన

హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం పనులను కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. కాళోజీ కళాక్షేత్రం పనులు ఈనెల 31కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫినిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. కమిషనర్ వెంట కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బల్దియా సీపీ వెంకన్న బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జులై 27: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న బి.వెంకన్నను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలం పాటు పని చేసిన వెంకన్నకు అడిషనల్ సిటీ చీఫ్ ప్లానర్‌గా పదోన్నతి కల్పిస్తూ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. వెంకన్న స్థానంలో హైదరాబాద్ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఎంశైలజను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బల్దియా డీసీపీగా రవీంద్ర రెడెకర్

బల్దియా డీసీపీగా రవీంద్ర రెడెకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం.దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియాలో పని చేసిన ప్రకాశ్‌రెడ్డి జూన్‌లో ఉద్యోగ విరమణ పొందడంతో డీసీపీగా రవీంద్ర రెడెకర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ డీటీ, సీపీగా పనిచేస్తున్నారు.



మేడారం పూజారి మృతికి మంత్రుల సంతాపం

మేడారం, జులై 27 : తాడ్వాయి మండలం మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ మృతికి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సంతాపం తెలిపారు. పూజారి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో జీపీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటేష్(ఫైల్)

తొర్రూరు, జూలై 27 : ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల వెంకటేష్ (32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యదర్శుల వేతనాలు పెంచాలని కోరు తూ గతంలో సమ్మె చేసిన నేపథ్యంలో వేతనాలు రాకపోవడం, ఒకసారి విధుల నుంచి సస్పెండ్ కావడంతో మనోవేదనకు గురయ్యా డు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండడంతో సతమతమవుతున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పట్టణ శివారులోని వ్యవసాయ బావిలో దూకి వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో శవా న్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య పేర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.15
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,6.00

వరంగల్ ... GLOBAL CINEMAS RELEASE

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



మీ అభిమాన థియేటర్లలో



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
SRI VIJAYA FILMS



BOOK YOUR TICKETS NOW
IN 4DX AT
PVR - INOX (SUJANA FORUM PRESTIGE MALL KPBH | ERRAMANZIL)

MUKTA RAMAKRISHNA ABIDS	PRASADS LARGE SCREEN NTR GARDENS	MOVIEMAX AMR MALL SECUNDERABAD
AMB CINEMAS GACHIBOWLI	AAA CINEMAS AMEERPET	PLATINUM MOVIE TIME GACHIBOWLI

PVR - INOX CINEMAS :- INORBIT MALL CYBERABAD | SUJANA FORUM PRESTIGE MALL, KPBH | ICON HYDERABAD NEXT GALLERIA, MADHAPUR | PLAY HOUSE HYDERABAD NEXT GALLERIA, PANJAGUTTA | NEXT GALLERIA ERRAMANZIL | MUSARAMBAGH | CENTRAL MALL, PANJAGUTTA | RK MALL, BANJARA HILLS | ATRIUM MALL, GACHIBOWLI | PRESTON MALL, GACHIBOWLI | PRISM MALL | S2 CINEMAS MALLAPUR | GVK ONE MALL, BANJARA HILLS | MAHESHWARI PARMESHWARI MALL | GSM MALL, MIYAPUR | SATTA NECKLACE MALL, KAVADIGUDA | ASHOKA, KUKATPALLY

MIRAJ CINEMAS :- SHALINI SIVANI, DSKN | BALANAGAR | CHANDA NAGAR | MIYAPUR | MALJKAGIRI

CINEPOLIS :- LULU MALL, KUKATPALLY | MANTRA MALL, ATTAPUR | CCPL, MALKAJGIRI | SUDHA, SHALIBANDA | DSL, UPPAL

ASIAN CINEMAS :- CINESQUARE MULTIPLEX - UPPAL | SHIVA GANGA | CINE PLANET - KOMPALI | RADHIKA - KAPRA | M CUBE MALL MULTIPLEX - ATTAPUR | SHA - CHINTAL HMT | MUKTA A2 MJR CINEMAS | A2 SENSATIONS | CINEPRIDE SHASHIKALA MOOSAPET | ASR SWAPNA - KATHADAN | VAISHNAVI - R.C.PURAM | CINE TOWN - KARMANGHAT

MOVIE TIME AMEERPET	MOVIE TIMES SKY MALL SANATHNAGAR	JPRASAD MULTIPLEX MADANIGUDA
GRP MALL & MULTIPLEX KUKATPALLY	APASARA CINEMAS NALLAGANDLA	VENKATRAMANA KACHIGUDA
TARAKARAMA THEATRE KACHIGUDA	DEVI 70MM RTC.X.ROAD	BVK VIJAYALAKSHIMI L B NAGAR
TIVOLI CINE HOME SECUNDERABAD	SAI RAM THEATRE MALKAJGIRI	SHANTHI RTC CROSS ROAD
BHRAMARAMBA KUKATPALLI	RAJADHANI 70MM DILSHUKNAGAR	RAJADHANI DELUXE DILSHUKNAGAR
SRI RAMANA 35MM AMBEERPET	MAHALAXMI THEATRE KOTHAPET	BHUJANGA THEATRE JEEDIMATLA

FARNAZ

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES THRO GANESH BHARI 9299992173, 9296509333



HIT SUPER HIT నేడే చూడండి



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.30am
SMK FILMS THRO PRK FILMS 9154578901/8919077130

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 6వ వారం



శ్రీనివాస 70ఎంఎం - నర్సాపూర్ 11.00,2.00,6.00,9.00
PARAM JYOTHI FILMS 9848028739

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 5వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్: మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

మల్టీప్లెక్స్: 150/-, సింగిల్ స్క్రీన్: 110/- 80/- 50/-

SUPER HIT నేడే చూడండి



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

టీచర్లూ.. సెల్యూట్

తాము పనిచేసే సర్కారు బడిలోనే పిల్లలకూ చదువులు ● ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న గురువులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పడమే కాదు... తమ పిల్లలను కూడా సర్కారు బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తున్నారు కొందరు టీచర్లు. ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి వారు సైతం అప్పో సప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ బడులు, కళాశాలలకు పంపిస్తున్నారు. మరి ప్రభుత్వ ఉద్యోగులైతే.. మరింత పేరున్న సంస్థల్లో చదివిస్తున్నారు. అందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. తమ పిల్లల చదు వుల కోసమే అనేకమంది తమ సొంత ఊళ్లను వదిలి నగరాల్లో స్థిరపడిపోతున్నారు. అయితే సర్కారు విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకునే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీఏటా బడిబాట కార్యక్రమాలతో గ్రామాల్లోకి వెళుతున్నారు. ఆ సమయంలో 'మీ పిల్లలనేమో ప్రైవేటుబడికి పంపుతారా? మా పిల్లలేమో సర్కారు బడికి పంపాలా?' అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి ఎదురవుతున్నాయి. కానీ ఇలాంటి పరిస్థితుల్లో తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం.

సకల సౌకర్యాల సర్కారు బడి...

ప్రభుత్వ బడిలో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. బోధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయులనే ప్రభుత్వం నియమిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వం మన ఊరు.. మన బడి, మన బస్తీ- మన పాఠశాల, పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అనేక పాఠశాలల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొన్నిచోట్ల ప్రభుత్వ బడుల్లో కూడా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. ఉచితంగా స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడికి మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో డీఎడ్, బీఎడ్, ఎంఎడ్ తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులను పూర్తి చేసిన వారినే టీచర్లుగా నియమిస్తోంది. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పాఠాల బోధన జరుగుతోంది. దీంతో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా పునరాలోచనలో పడ్డారు. తాము విద్యార్థులను బడిలో చేర్పించాలని ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు.. 'మీ పిల్లలను ప్రభుత్వ బడిలో ఎందుకు చేర్పరు..' అని తల్లిదండ్రుల నుంచి ఎదురైన ప్రశ్నలకు కొందరు సమాధానం ఇస్తున్నారు. తాము చెప్పే విద్యనే తమ పిల్లలకు కూడా అందించాలనే తాపత్రాయంతో ఉమ్మడి జిల్లాలోని చాలామంది టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థికస్థోమత ఉన్నా ప్రభుత్వం పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కితాబివ్వడమేకాదు.. ప్రజల్లోనూ నమ్మకం కలిగించేలా తమ పిల్లలను సర్కారు బడిలో చదివిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ బడిలో ఉండే ఇంగ్లీషు మీడియం సర్కారు బడిలో కూడా ఉండటంతో ఇతర పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ సర్కారు బడిలో చదువుకునేలా కృషి చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

ఒత్తిడి లేని చదువు ప్రభుత్వ బడిలోనే..

'మేం 1వ తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యనే అభ్యసించాం. ఏ ఒత్తిడి లేకుండా చదువుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడినాం. మా పిల్లలకు ఒత్తిడి లేని చదువు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాం.. మా ఇద్దరు పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తున్నాం' అని ఉపాధ్యాయ దంపతులు శ్యామలత, రాజు చెబుతున్నారు. శ్యామలత మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రాపల్లి జడ్పీఎస్ పాఠశాలలో, రాజు గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం టీచర్లుగా పని చేస్తున్నారు. వారి ఇద్దరు పిల్లలు హిమాన్షుసహన్, కోవిద్‌సహన్ వరంగల్‌లోని చార్‌బౌలి ప్రభుత్వ పాఠశాలలో ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో హోం వర్క్ పేరుతో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని ఆ ఉపాధ్యాయ దంపతులు అంటున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే అయినా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇద్దరు పిల్లలు సర్కారు బడికే..

ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో టీజీటీగా పని చేస్తున్న సుధారాణి తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. తన కుమారుడు సుమితేష్ 8వ తరగతి, కుమార్తె సంవిద 6వ తరగతి టీజీఎంఎస్‌లో చదువుతున్నారు. అలాగే ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరాచారి తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఇదే గ్రామంలోని జడ్పీఎస్ పాఠశాలలో కుమారు చైతన్యరిషి 8వ తరగతి చదువుతుండగా, కుమార్తె ఆరాధ్య 6వ తరగతి చదువుతోంది. చైతన్యరిషి 2వ తరగతి నుంచి, ఆరాధ్య 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. తాను చదువు చెప్పే సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య ఉందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నామని ఆ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆ ఉపాధ్యాయుల పిల్లలంతా సర్కారుకే..

మరిపెడ మండలం సీతారాంపురంతండా, మరిపెడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. మరిపెడ జడ్పీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందిగామ జనార్దనాచారి తన కుమార్తె సరస్వతిని పదోతరగతి, మరో ఉపాధ్యాయుడు సారయ్య తన కుమార్తె దేవిని ఏడోతరగతి, ఉపాధ్యాయుడు లాల్‌చంద్ తన కుమార్తె మైథిలీని ఏడోతరగతి, కె.వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల పిల్లలు మరిపెడ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇస్మిత 8వ తరగతి, హర్షద్ 7వ తరగతి చదివిస్తున్నారు. వీరే కాకుండా దంతాలపల్లి జడ్పీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ పండిట్ డి.పరంకుశచారి 9వ తరగతి చదువుతున్న తన కుమార్తె సిరిచందనను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే కొత్తగూడ మండలానికి చెందిన పుల్సం కవిత తన కుమార్తె సాహిత్యను గూడూరుకు చెందిన ఉపాధ్యాయుడు తాటి బుచ్చిరాములు తన ఇద్దరు పిల్లలు వేదశ్రీ 2వ తరగతి, గాయత్రి 1వ తరగతిలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తాను చదువు చెప్పే బడిలోనే..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జడ్పీఎస్ పాఠశాలలో స్టాలిన్ బేగ్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన స్టాలిన్‌బేగ్ తాను పాఠాలు చెప్పుతున్న బడిలోనే తన ఇద్దరు పిల్లలను కూడా చదివిస్తున్నారు. ఇటీవలే భీమదేవరపల్లి పాఠశాలలో కుమార్తె పదో తరగతి పూర్తి చేయగా.. కుమారుడు తల్హార్‌బేగ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్న స్టాలిన్‌బేగ్ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రైవేట్ బడిలో ఉండరని, ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉంటుందని స్టాలిన్‌బేగ్ పేర్కొంటున్నారు.



కారులో కూరగాయల విక్రయం

జూలైవాడ, జూలై 27: కూరగాయలను సైకిళ్లు, తోపుడు బండ్లపై వాడవాడల తిరుగుతూ విక్రయించేవారు. ఎలాంటి అద్దె ఖర్చు లేకుండా మొబైల్ వాహనాలపై వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా శాతం వాహనాలపై ఉదయం, సాయంత్రం వేళల్లో టిఫిన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించి కారునే కూరగాయల విక్రయ కేంద్రంగా మార్చుకున్నాడు. శనివారం హనుమకొండ గ్రేటర్ 59వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఖరీదైన కారులో వివిధ రకాల కూరగాయలు విక్రయిస్తూ పలువురిని ఆకర్షించాడు. కారు వెనుక డిక్కీలో తూకం మిషన్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు విక్రయిస్తున్నాడు.



కారులో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

పెండింగ్ స్లాట్‌లకు హాజరుకావాలి..

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల

వరంగల్ క్రైం, జూలై 27: హనుమకొండ రవాణా శాఖ కార్యాలయంలో జనవరి 2020 నుంచి ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేసుకున్న అప్లికేషన్లు 1,263 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి హాజరుకావాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల ఒక ప్రకటనలో కోరారు. వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్సుదారులు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించి కార్యాలయానికి వచ్చి డ్రైవింగ్ టెస్ట్, వాహన ఇన్స్‌పెక్షన్ వంటివి చేయించకపోవడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని వలన ఏదైనా న్యాయపరమైన సమస్యలు, ఇన్సూరెన్స్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు చింతగట్టు క్యాంపు వద్ద ఉన్న కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని శ్రీనివాస్ సూచించారు.

కమిషనరేట్‌లో ముగ్గురు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 27: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఒ.రమేశ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, పి.దామోదర్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, ఎం.రంజిత్‌కుమార్ కమిషనరేట్ నుంచి వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు కేటాయించారు.

ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ బదిలీపై వెలసిన ఫ్లెక్సీలు



వరంగల్ మెడికల్, జూలై 27: ఇటీవల ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ కావడంపై ఎంజీఎం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు ఎంజీఎంకు పట్టిన పీడ విరగడ అయిందంటూ ఎంజీఎం గేటుకు ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఘటన పెద్దాస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్పీడీసీఎల్ స్టోర్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 27:ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన విద్యుత్ సామగ్రిని సరఫరా చేసే స్టోర్‌ను హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీఅండ్‌డీ వర్క్స్ కొత్త సర్వీసుల రిలీజ్‌లు, ఇతరత్రా అవసరాలు తీర్చడానికి స్టోర్‌లో మెటీరియల్ లభ్యతపై ఆరా తీశారు.



WANTED
★ Good Communication Skills, Computer Knowledge కలిగిన Pharm D, B Pharmacy, Nursing & Graduates Resume తీసుకొని శ్రీనివాస పినాకిల్ హాస్పటల్‌ను సంప్రదించండి.
AJW-199003

WANTED
★ ఆయాలు, వార్డు బాయ్స్, B.Sc నర్సింగ్ GNM సిస్టర్స్ హాస్పిటల్‌లో పని చేయుటకు కావలెను. 8 గంటల డ్యూటీ. సం.ప్ర॥ 7702686277, 8309675303
AJW-7610

WANTED
★ Wanted PRO'S for MBBS in Abroad Education. Contact No. 8121554649
AJW-3110

WANTED TEACHERS
★ Wanted Teachers to Teach 1st to 5th. Eng. Maths. 6th to 9th Maths, Wardens, Cooks, AVS High School, DJS Ramaram, Warangal. Cell : 9848672108, 9848181976
AJW-5718

WANTED
★ హన్మకొండలో ప్రముఖ లాడ్జిలో పని చేయుటకు Room Boy's కావలెను. సం.ప్ర॥ 7013654190
AJW-3719

WANTED
★ Wanted Full time EVS Lady Teacher మరియు లేడీ వంటమనిషి, లేడీ వార్డెన్ హాస్టల్‌లో ఉండుటకు కావలెను. సం.ప్ర॥ 9963203554
AJW-188443

WANTED
★ యూనివర్స్ క్లీనింగ్ ప్రొడక్ట్స్ హాస్పిటల్స్, కాలేజస్, షాపింగ్ మాల్స్‌లో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సం.ప్ర॥ 8341679680
AJW-188410

WANTED TEACHERS
Primary Science (I to V), IIT Chemistry (XI &XII), PET ★ Warden (M/F)
TEJA INTERNATIONAL HIGH SCHOOL PARIMALA COLONY, HANAMKONDA
Cell : 8099339699

WANTED
★ హాస్పిటల్‌లో పని చేయుటకు ఆయాలు కావలెను. 3షిఫ్ట్లు కలవు. బేబీస్ లైఫ్ హాస్పిటల్ రోడ్ నెం.1, కాకాజీకాలనీ, హన్మకొండ. సం.ప్ర॥ 9989510003
AJW-188447

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. 8గం॥ - 12గం॥ల డ్యూటీలు కలవు. జీతం : 10000 - 13500. సం.ప్ర॥ 9000463426
AJW-188449

WANTED TEACHERS
★ Wanted Teachers to teach Social Studies (H.S.), PET, Fluency in English is must. DAFFODILS HIGH SCHOOL, Subedari, HNK. Ph : 9885850508
AJW-188379

PLOTS FOR SALE
★ 484 sq yard location Pensionpura, Thimmapur (H) near Navodaya school, Warangal Ph No.9912983198
AJM-12111

PLOTS FOR SALE
★ పరకాల మున్సిపాలిటీలో, మల్లారెడ్డిపల్లి స్ట్రీట్‌లో 160, 300చ॥గ॥ల ప్లాట్స్ అమ్మబడును. పతంజలి ఆయుర్వేద వైద్యాలయం దగ్గర. సం.ప్ర॥ 6300938052
AJW-0406

PLOT FOR SALE
★ మామునూర్‌లో కూడా లీ అవుట్ రెండు దిశలా దారిస్తా మండి మరియు జ్యోతిబాఫులే ఆశ్రమ పాఠశాల ప్రక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా దాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263 అమ్మకానికై కలదు. సెల్ : 9032111600.
AJW-199001

PLOTS FOR SALE
★ ఒగ్లాపూర్-తక్కళ్లపహాడ్ 80ft మెయిన్‌రోడ్డుకు ఆనుకొని East ఫేస్‌తో 500 గజాల to 1500 గజాల వరకు స్థలం అమ్మబడును. గజం కేవలం 4500/- మాత్రమే. సం.ప్ర॥ 9281131001
AJW-3925

FLATS FOR SALE
★ వరంగల్ దేశాయిపేట రోడ్ సూర్యబార్ పక్కలేన్ ఏకశిలా నగర్ మెయిన్ రోడ్‌లో 3BHK కొత్త ఫ్లాట్స్ (1600/1800Sft) అమ్మకమునకు కలవు. సం.ప్ర॥ +91 9848225151, What'sup No. +91 8519905644
AJW-17173

LAND FOR SALE
★ ధర్మసాగర్ మండలం, బంజేరుపల్లి శివారులో సర్వేనెం. 63/C/2 లో 1 ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమి అమ్మబడును. సం.ప్ర॥ 9849359714, 6309306757
AJW-188360

FLATS FOR SALE
★ 3BHK, 2676 Sft, Near DMart, Subedari Post Office, Hanamkonda & 2BHK, 1175 Sft, Police Colony, Basith Nagar, Hanamkonda. Contact : 8897221187
AJW-188367

FOR SALE
★ Shope In Autonagar 45 Lakhs (Rs.9000/- Getting Rent). House in Kashibugga 45 Lakhs (Rs.6200/- Getting Rent) Cont : 9492199961
AJW-3112

HOUSE FOR SALE
★ హన్మకొండ హంటర్ రోడ్‌లోని టెంపుల్ ట్రీస్ విల్లాస్ దగ్గర G+3, 2100 Sft, 3BHK బిల్డింగ్ ఫ్లోర్ వైజ్‌గా అమ్మబడును. సం.ప్ర॥ 9346402588
AJW-188428

HOUSE FOR SALE
★ ఖాజీపేట బాపూజీనగర్ మెయిన్‌రోడ్‌లో 108 చ॥గ॥ దాబా Shope cum House అమ్మబడును. ధర : 1,40,00,000/- Negotiable / Genuine. సం.ప్ర॥ 6302469119, ఇ.నెం.1-6-126/1, వెంకటరమణ కిరాణం.
AJW-188356

HOUSE FOR SALE
★ WGL, కొత్తవాడ, లక్ష్మీగార్డెన్స్ ఫంక్షన్‌హాల్ దగ్గర 182 గజ.E/F ఇల్లు G.F 1BHK+2BHK,1st ఫ్లోర్ 2BHK+2BHK, 2nd Floor, 1BHK పార్కింగ్ G.F. కార్ @3 Bikes, 1 బోర్, WMC వాటర్. సం.ప్ర॥సెల్ : 9490421153, 9652979107
AJM-12117

HOUSE FOR SALE
★ హన్మకొండ, పోస్టల్ కాలనీలో H.No.1-9-799 గల 300 చ॥గ॥లలో నిర్మించిన G+2 ఇల్లు అమ్మబడును. సం.ప్ర॥ 9849283034
AJW-188381

3+2 స్కీం కలదు

HOUSE FOR SALE
★ వరంగల్లు, నర్సంపేట రోడ్, లేబర్ కాలనీ బస్టాండ్ సెంటర్ నందు 200 చ॥గజముల స్థలములో Reconstruction చేయబడిన Two Bedrooms గల House దాని ముందు నెలకు రూ.20,000/- ఇన్‌కం గల మూడు షాపింగ్ షట్టర్లుతో సహా అమ్మబడును. సం.ప్ర॥ 9700563645
AJW-5717

COMMERCIAL PLOTS FOR SALE
★ 230&416 Sq.Yds Commercial Plots at Arepally Main Road, 200(2)&400 Sq.Yds at Mettugutta in Madikonda, 500 Mt's from Hyd High Way for immediate Sale. Ph : 8374004227, 9700480658. W.App : 00971504441953
AJW-5719

HOUSE FOR SALE
మంచి ఆర్కిటెక్చరల్ డిజైనతో ఇండిపెండెంట్
Luxurious Building in 300 Sq.Yds, Plot in Prime Location, Road No.9, Advocates Colony, Hanamkonda. Ground Floor with Two Single Bed Room Portions; First & 2nd Floor Duplex House with 3 Bed - 4 Bath, Two Full Sized Balconies, Wardrobes, Modular Kitchen, Marble Flooring, Survelliance System, etc.,
Contact / Whatsup :
9550398128

TO-LET
★ REC పెట్రోల్ పంప్ (తారా గార్డెన్ ఎదురుగా) మెయిన్ రోడ్‌లో 1780 చ॥అ॥ విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 3000 చ॥అ॥ విస్తీర్ణములో గల వర్క్‌షాప్ పూర్తి కవరేజ్ షెడ్‌తో టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ షోరూంలకు, బ్యాంకులకు, వ్యాపార సంస్థలకు కిరాయకు ఇవ్వబడును. సం.ప్ర॥ 9704445770, 8897678810
AJW-188445

TO-LET
★ HNK భీమారం మెయిన్ రోడ్ GMR గార్డెన్ ప్రక్కన సెల్లార్ + గ్రౌండ్ + 1st మరియు 2nd ఫ్లోర్స్ గల బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును. కాలేజీలకు, స్కూల్స్‌కు అనుకూలంగా ఉండును. సం.ప్ర॥ 9849141411, 9849820345
AJW-188310

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు. చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ఉచిత అప్రెంటిషిప్ అడ్మిషన్లు కలవు
★ M.P.H.W (F) and (M.L.T). పూర్తి చేసిన వారికి అప్రెంటిషిప్ సౌకర్యము కలదు. సం.ప్ర॥ 9177631014
AJ W-188441

అడ్మిషన్లకై సంప్రదించండి
★ M.P.H.W (వర్కింగ్) (M/F), 2) ల్యాబ్ టెక్నీషియన్, 3) ఆపరేషన్, అనస్తీషియా టెక్నీషియన్, 4) ఆప్టోమెట్రిస్ట్, ఆప్తోమెటి, రెడియోగ్రఫీ. విద్యార్హత : SSC, Inter డిగ్రీపాస్ మరియు ఫెయిల్. సం.ప్ర॥ 9177631014
AJ W-188436

సాయి సేవా ట్రస్టు (వృద్ధాశ్రమము)
★ హన్మకొండ, వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత 10 సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ మానవంగా ఖాళీ అందుబాటులోకి తేవడం జరిగింది. దయచేసి సం.ప్ర॥ 9848444020, 9110551507
AJW-188437

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. Cont : 9849145043, 9866584455.
AJW-186141

బిల్డింగ్ పెయింటింగ్స్, వాటర్ ప్రూఫింగ్
★ బిల్డింగ్‌లకి పెయింట్స్, పుట్టి, టెక్చర్, పాలిష్, రాయల్ ప్లే, డైసింగ్స్, స్టెన్సిల్స్ మరియు బిల్డింగ్ లీకేజి, వాటర్ ప్రూఫింగ్ సమస్యలు టెక్నికల్ వర్కర్స్‌తో చేయబడును. సం.ప్ర॥ 9959241616
AJW-188174

గ్యాస్ ఏజెన్సీ అమ్మబడును
★ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధికి చెందిన రన్నింగ్‌లో ఉన్న Pvt. గ్యాస్ ఏజెన్సీ డీలర్‌షిప్ అమ్మబడును. సంప్ర॥ 9491141173
AJW-188448

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

విద్యార్థి సంఘ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం వినతి

హనుమకొండ కలెక్టరేట్, జూలై27: కొందరు విద్యార్థి సంఘాల పేర్లు చెప్పుకుంటూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆర్‌టీఏ, బీఎస్‌ఎఫ్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల అధ్యక్షులు తమ కళాశాలలకు వచ్చి చందాల వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. చందా ఇవ్వని కళాశాలల ముందు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే పేరుతో ధర్నాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నిరుద్యోగులైన తాము ప్రైవేట్ కళాశాలలు పెట్టుకుని ఉపాధి పొందుతూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, కొందరు కుల సంఘాల నాయకులు ఆర్‌టీఏ యాక్ట్ కింద నోటీసులు ఇస్తూ తమను ఒత్తిడి గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఈ విద్యార్థి సంఘాల నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రాజు, గౌరవ సలహాదారులు గౌరు తిరుపతిరెడ్డి, కుమార్, రాజిరెడ్డి, రాంమూర్తి, కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, తాళ్లపల్లి స్వామి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

బాలసముద్రం, జూలై 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను శనివారం హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ధరమ్‌సింగ్ మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపుగా వాడి ఆదాయం తెచ్చి సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు తమ ప్రతిభను కనబరిచి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు



అవార్డులు పొందిన ఉద్యోగులు

అలంకారప్రాయంగా టీ డయాగ్నోస్టిక్ సెంటర్లు

- రేడియాలజీ పరీక్షలు లేవు..
- ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందే..
- డిప్యూటేషన్ సిబ్బందితో సరి

వరంగల్ మెడికల్, జూలై 27: పేద రోగుల సౌకర్యార్థం అట్టహాసంగా ప్రారంభించిన టీడయాగ్నోస్టిక్ కేంద్రం సిబ్బంది కొరతతో విలవిలలాడుతోంది. రేడియాజిస్టు వైద్యులు లేక సేవలు నిచిలిపోయాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కళ్ల ముందే నీరుగారిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎన్నో ఆశలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు రేడియాలజీ సేవలు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంపై కథనం.

రేడియాలజీ వైద్యుడు కరువు

ప్రతీ వైద్య చికిత్సలో రేడియాలజీ విభాగానికి అత్యంత ప్రాధాన్యముంటుంది. ఇందులో ప్రధానంగా ఈసీజీ, మెమోగ్రఫీ, అబ్డామిన్ స్కాన్, ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయి. కానీ రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో ఇవన్నీ మూలనపడ్డాయి. సిటీ, ఎంఆర్ఐ పరికరాలు ఇంతవరకు మంజూరు కూడా కాలేదు. రేడియాలజీ వైద్యుడి కోసం రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదని హబ్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రత్యేక చొరవ చూపితే డిప్యూటేషన్‌పై ఓరేడియాలజీని పంపించే అవకాశం ఉన్నప్పటికీ చొరవ చూపకపోవడంతో విభాగం సేవలు నిల్‌గా మారాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు విభాగాలు మాత్రమే..

టీహబ్‌లో రేడియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలు ఏర్పాటు చేశారు. వీటితో రేడియాలజీ విభాగానికి వైద్యుడు లేకపోవడంతో మొదటి నుంచి మూతపడింది. ఇక బయోకెమిస్ట్‌గా పని చేస్తున్న వైద్యులు ఇటీవల బదిలీల్లో వెళ్లిపోవడంతో ఆ విభాగం మూతపడే దశలో ఉంది. ప్రస్తుతం పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు మాత్రం ఏడుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

నిత్యం వేయి శాంపిళ్లు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్బన్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఈహెచ్ఎస్, ఇలా 33మార్గాల ద్వారా శాంపిళ్లు టీహబ్‌కు చేరుకుంటాయి. స్టెరిలైజేషన్ కోల్డ్ స్టోరేజ్ కలిగిన మూడు వాహనాలు కూడా ప్రతీరోజు మూడు రూట్లలో వెళుతు సాయంత్రం 4గంటల వరకు శాంపిళ్లను సేకరించి, ఆధార్, ఫోన్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నారు. పరీక్ష ఫలితాలను నేరుగా వారి మొబైల్‌లకు మెసేజ్ ద్వారా వెళుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న రేడియాలజీ సెంటర్

మల విసర్జన పరీక్షలు లేవు

57 రకాల పరీక్షలు తెలంగాణ హబ్‌లో నిర్వహిస్తున్నప్పటికీ మలవిసర్జన పరీక్షలు మాత్రం రియజెంట్స్ లేవనేసాకుతో కొద్దికాలంగా పరీక్షలు నిలిపివేశారు. ప్రోటీన్ టెస్ట్, హెచ్‌బీ పర్సంటేజ్ టెస్ట్‌లు కూడా జరగడం లేదు.

మూలనపడ్డ మిషన్లు

టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో కల్చర్ మిషన్, ఎలక్ట్రోఫోర్స్ కాంగ్లో మీటర్ మిషన్లు మూలనపడ్డాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోగుల తాకిడికి అనుకూలంగా టెక్నీషియన్లను నియమించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. మిషన్ కూడా బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు టీ హబ్ ఉద్యోగులు వాపోతున్నారు. టీ హబ్‌లో మౌలిక సదుపాయాల మెరుగు కోసం అధికారులు కృషి చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి

వరంగల్ క్రైం, జూలై 27 : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని హసన్‌పర్తి సీఐ సురేష్ సూచించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో పర్యటించిన సీఐ సురేష్, వర్షాల వల్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు, చెరువుల వద్దకు వెళ్లేవారు, విద్యుత్ వాడకం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మట్టి గోడలు, పురాతన ఇళ్లలో నివాసం ఉండేవారు సైతం జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఐ వెంట ఎస్ఐ దేవేందర్ ఉన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- నిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యం
- డైవర్షన్ పెట్టి చేతులెత్తేసిన వైనం
- తనిఖీల పేరిట సిబ్బంది అంతా ఒక దగ్గరే..
- వాహనాలను నియంత్రించే వారు లేక ట్రాఫిక్ జామ్
- నియంత్రణ పక్కనపెట్టి ఫొటోలు తీసేందుకే ఉత్సాహం
- మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక సీఐ, ఇద్దరే ఎస్ఐలు

హనుమకొండ టౌన్, జూలై 27: హనుమకొండలో ట్రాఫిక్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేయడంతో.. ములుగురోడ్డు నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు ఎక్కడ చూసినా ట్రాఫిక్ జాంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మూడు జోన్లలో హనుమకొండలో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. ఉమ్మడి వరంగల్‌లోని వివిధ ప్రాంతాలకు రాకపోకలుగా కేంద్రబిందువైన ఆర్టీసీ బస్టాండ్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. వీవీపీల వాహనాలు కూడా ఈ పోలీస్‌స్టేషన్ ముందు నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి ఈ ప్రాంతంపై కమిషనరేట్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలువినిపిస్తున్నాయి. హనుమకొండ, కేయూసీ పోలీస్‌స్టేషన్లతో పాటు సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంత ఏరియా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన బాధ్యత హనుమకొండ ట్రాఫిక్ పోలీసులది. అయితే ఈ పోలీస్‌స్టేషన్‌లో ఒక సిఐ, ఇద్దరే ఎస్సైలు ఉండటం గమనార్హం. వారిలో ఒకరు వారం రోజుల క్రితమే ఎస్‌బీ నుంచి వచ్చి బాధ్యతలు స్వీకరించగా, ప్రస్తుత సీఐ అయిష్టంగానే విధులు నిర్వర్తిస్తున్నట్టు సమాచారం. మరో ఎస్సైని కేవలం జరిమానాలు విధించడం, పాత జరిమానాలను గుర్తించి వాటిని కట్టించే పనికి ఉపయోగిస్తున్నారనేది ట్రాఫిక్ సిబ్బందిలో జరుగుతున్న చర్చ. కాగా, గతంలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు ఉన్నా ట్రాఫిక్‌ను నియంత్రించడం చాలా ఇబ్బంది ఉండేది. అలాంటిది ఇప్పుడు సమస్య ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వాహనదారులు అంటున్నారు.

డైవర్షన్ మార్గాల్లో సిబ్బంది నిల్

నయీంనగర్ పెద్దమోరీపై బ్రిడ్జి నిర్మిస్తుండటంతో కరీంనగర్ వైపు రాకపోకలు సాగించే బస్సులు, ఇతర వాహనాలను కేయూ క్రాస్, డబ్బాలు, యాదవనగర్ క్రాస్, పెద్దమ్మగడ్డ, ములుగురోడ్డు జంక్షన్ మీదుగా హనుమకొండకు మళ్లించారు. అయితే ఈ దారిలో అప్రమత్తంగా ఉండాల్సిన ట్రాఫిక్ సిబ్బంది చేతులెత్తేశారు. ఒక్క చోట కూడా ట్రాఫిక్ సిబ్బంది కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కేయూసీ టూ పెద్దమ్మగడ్డ రోడ్డు గతం కంటే రద్దీగా మారింది. అంతకముందే డబ్బాల జంక్షన్, యాదవనగర్ క్రాస్ వద్ద లేబర్ అడ్డా, జేసీబీ అడ్డా, సమీపంలోని గ్రామాలకు వెళ్లే దారులు బిజీగా ఉండేవి.. ఇప్పుడు డైవర్షన్‌తో మరింత రద్దీగా మారాయి. క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులు నమోదు చేయడం లాంటి రెండు పనులు ట్రాఫిక్ పోలీసులకు ఉంటే ఇబ్బందిగా ఉంటుందన్న భవనతో కేసుల నమోదును లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించి, కేవలం క్రమబద్ధీకరణ మాత్రమే ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. అయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలవవుతున్నార నే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంటపాటు స్తంభించిన వాహనాలు

మంగళవారం హనుమాన్‌నగర్ బ్రిడ్జికి అటు, ఇటు ఇరువైపు లా గంటపాటు ట్రాఫిక్ స్తంభించి ఆర్టీసీ బస్సుల్లో ఉన్న ప్రయాణికులు, అంబులెన్స్‌ల్లోని రోగులు, ద్విచక్రవాహనదారులు, పాఠశాల విద్యార్థులు తంటాలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఒకరిద్దరు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నా వాహనాలను క్రమబద్ధీకరించడం సాధ్యం కాలేదని స్థానికులు అంటున్నారు. గంటసేపు ట్రాఫిక్ స్తంభించినా ట్రాఫిక్ అధికారులు దృష్టిసారించకపోవవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా బ్రిడ్జికి ఇరువైపులా చేపలు విక్రయాలు సాగుతుండటంతో మామూలు రోజుల్లో కూడా ఇరువైపులా వాహనాల పార్కింగ్, ప్రజల రద్దీతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. నామ్ కే వాస్తేగా ఒక సిబ్బందిని హనుమాన్‌నగర్ బ్రిడ్జి దగ్గర నియమించగా కాలుకు గాయంతో అయన పక్కనే విశ్రాంతి తీసుకుంటున్నాడని స్థానికులు చెబుతున్నారు.



కేయూ - పెద్దమ్మగడ్డ రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

తనిఖీల పేరిట నియంత్రణ గాలికి..

డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు, పాత జరిమానాలను కట్టించే పనుల పేరిట ఎక్కడపడితే అక్కడ అడ్డాలు వేసి పాయింట్ల మీద ఉన్న సిబ్బందిని అక్కడికి పిలిపించుకొని ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేస్తున్నారనే విమర్శలు వాహనదారుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. సమస్య ఉన్న దగ్గర సిబ్బందిని ఉంచకుండా తనిఖీల పేరిట అధికారులు సిబ్బందిని తమ వెంట గుంపులు, గుంపులుగా ఉంచుకొని ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని కేవలం వాహనాల ఫొటోలు తీయడానికే వారికి అక్కడ డ్యూటీగా వేసినట్టుగా స్పష్టమవుతోంది. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేయడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయకుండా ఫొటో ఎంత క్లియర్‌గా వచ్చింది అనే దానిపైనే దృష్టిసారిస్తున్నారనే అపవాదు ఉంది. ఏఆర్ నుంచి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు కేటాయించిన ఆర్ఎస్ఐలపై పలు ఆరోపణలు రావడంతో వారిని కమిషనరేట్‌కు పిలిపించి కొత్తగా కమిషనరేట్ నుంచి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌ను ట్రైసిటీలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. వారిని ఉపయోగించుకోవడంలో సైతం హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నట్టుగా తెలుస్తోంది.

శ్రీనివాస్ గురుకుల్ స్కూల్‌లో బోనాల జాతర



బోనాల జాతరలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 27: బోనాల జాతరను పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ స్కూల్లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. శనివారం స్కూల్‌లో బోనాల జాతరను ప్రారంభించిన స్కూల్ కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బోనాల పండుగ వేడుకలు



బోనాల పండుగ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై27: హనుమకొండలోని వాగ్దేవి గ్లోబల్ స్మార్ట్ స్కూల్‌లో శనివారం బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పండుగ ప్రాశస్త్యాన్ని తెలిపే విధంగా బోనాలు ఎత్తుకున్నారు. అనంతరం స్కూల్ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. స్కూళ్లలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన విద్యార్థులకు సనాతన ధర్మ పద్ధతులు అలవాటుగా మారుతాయని, ప్రకృతి పట్ల విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ స్వప్న, అడ్మిన్ శోభారాణి, ఉపాధ్యాయినిలు సమత, రజిత, జ్యోతి, సాయిలత, శ్రీలత, పూజిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు మల్లన్న సన్నిధిలో చైర్మన్లు



స్వామి వారిని దర్శించుకున్న టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్‌లు

ఐనవోలు, జూలై 27: ఐనవోలు మల్లికార్జునస్వామిని టెస్కాబ్ చైర్మన్ బృందం దర్శించుకుంది. చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వైస్‌చైర్మన్ కొత్త కురుమ సత్తయ్యలతో పాటు మహబుబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ కురుమ వెంకటయ్యలు శనివారం ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు చైర్మన్ బృందానికి స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసదాలు అందించి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. వీరి వెంట దేవస్థానం మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, మాజీ ఉప సర్పంచ్ సతీష్, డబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులను ఆదుకోవాలి

హనుమకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేద సంచార జాతులవారిని ఆదుకోవాలని ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంచార జాతులవారు కూడా వారి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. శనివారం హనుమకొండలోని సుజిత్ నగర్‌లో నిలువ నీడ లేక వర్షాకాలంలో అడుస్తూ అవస్థలు పడుతున్న సంచారజాతులవారికీ ప్రేరణ ఫౌండేషన్, లైన్స్ క్లబ్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ స్పోర్ట్స్ అధ్యక్షుడు రాజు సభ్యులు తులసీదాస్, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, సభ్యులు శంకర్‌రావు, శ్రీలత రెడ్డి, మండల పరుశురాములు, లయన్స్ క్లబ్ హనుమకొండ బాధ్యులు మనోహరస్వామి, బూర రాంచందర్, టీవీ ఆశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న కార్మిక హక్కుల చట్ట సవరణకు వ్యతిరేకంగా సదస్సు



కరపత్రాలను అవిష్కరిస్తున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్

బాలసముద్రం, జూలై 27: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక హక్కుల చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆగస్టు 4న సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సును కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని బాలసముద్రంలో తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మోదీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిశ్కరించాలని ఆగస్టు 4న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలన్నారు. దాసరి రమేష్, ఉమ, విజయ, జ్యోతి, మమత, సంధ్య, వినోద, నాగమణి, మమత, ఇందిర, శోభ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేయాల్సిందే..

కాజీపేట, జూలై 27: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన మాటప్రకారం కులగణన చేయాల్సిందే, విస్మరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేముందు కామారెడ్డి సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా కులగణన చేయాలన్నారు. బీసీలకు రాజకీయంగా నష్టం జరగకుండా 42శాతం పెంచిన తర్వాతే ఎన్నికలు జరపాలన్నారు. బీసీలపట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పే ఈసారికూడా కాంగ్రెస్ చేస్తే బీఆర్ఎస్ పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.

డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ఫిర్యాదులు వచ్చిన వెంటనే నిర్దేశించిన సమయాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డయల్ 100 ఫిర్యాదులపై స్పందించాలన్నారు. పెట్రోలింగ్ విధులే కాకుండా పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. అలాగే కేడీలను, రౌడీషీటర్లను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ప్రజలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావాలన్నారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ఉంటాయన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు తిరుమల్, నందిరాంనాయక్, నర్సయ్య, భీంశర్మ, పార్థసారథి, జనార్దన్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనువాస్‌రెడ్డి, వివిధ రాణాల అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు నూతన భవన నిర్మాణం చేపట్టాలి

- ఎంజీఎం సెంటర్‌లో ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో నిరసన

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 27: శిథిలమవుతున్న వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవన సముదాయాన్ని సత్వరమే నిర్మించాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌డీవో ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎంజీఎం సెంటర్‌లో శనివారం నిరసనకు దిగారు. వర్షం పడుతున్నా విద్యార్థులు నిరసన గంట సేపు కొనసాగించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దాని నిర్మాణం కోసం ప్రభుత్వం సత్వరమే రూ.25 కోట్లు మంజూరు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం భవన నిర్మాణానికి సంబంధించిన బడ్జెట్‌ను కేటాయించి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. కళాశాల నుంచి ర్యాలీగా వచ్చిన విద్యార్థులు.. ఎంజీఎం సెంటర్‌లో నిరసనకు దిగారు. వర్షం పడుతున్నా గంట సేపు విద్యార్థి సంఘం నేతలతో కలిసి విద్యార్థులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అరెస్టు చేసి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సురేష్, వెంకటేష్, విద్యార్థులు అయాన్, ఆదిత్య, ఎబ్‌నేజర్, దినేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరెగంటి నాగరాజు తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 27 : ఆగస్టు 7న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం కేయూలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. బీసీల జనాభా లెక్కలను తీసి రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. 60 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికార వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా రాజకీయ రిజర్వేషన్ల కోసం పోరాడాలని కోరారు. బీసీల లెక్క తేలేవరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. బీసీలు బ్యాక్‌వర్డ్ కాదని.. బ్రిలియంట్ అని వ్యాఖ్యానించారు. బీసీల ఉద్యమాన్ని దేశమంతా విస్తరించి డిల్లీ కోటా మీద బీసీ జెండా ఎగురవేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కేయూ బాధ్యులు నరేశ్, రమేశ్, సురేశ్, నాగార్జున, శ్రీశైలం, సాయి, శ్రీకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 27: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యాహక్కు వేదిక కోశాధికారి డాక్టర్ ఎం.గంగాధర్ డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శనివారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 7.31 శాతం నిధులు కేటాయించడం సరైనది కాదన్నారు. ఇంత తక్కువ మొత్తంలో విద్యారంగానికి నిధులు కేటాయించడం వల్ల విద్యారంగాన్ని విస్మరించినట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని హామిని నిలబెట్టుకోకపోగా, అందులో సగం నిధులను సైతం కేటాయించలేదని ఆరోపించారు. పేద, మధ్య తరగతి బిడ్డలకు విద్యను అందించడం ఎలా సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్. ఎం.వెంగళ్‌రెడ్డి, ఎస్.తిరుపతి, పి.ఉదయ్‌సింగ్, కె.శ్రీనివాస్, ఎ.గోవింద రావు, ఎం.రఘుపతి, రాజ్‌మహ్మద్, టి.సుదర్శనం, ఆర్.రామ్‌రెడ్డి, కె.నరసింహులు, ఇ.కుమారస్వామి, ఎల్.భాస్కర్, ఎం.రాజ్‌కుమార్, ఆనంద చారి, రాజ్‌కుమార్, శ్రీరామ్, ఎస్.రవీందర్, జి.రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

జెన్‌ఫాక్ట్‌లో 100 మందికి ఉద్యోగావకాశాలు

కాజీపేట, జూలై 27: కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జెన్‌పాక్ట్ డ్రైవ్‌లో 100 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈసందర్భంగా తాళ్లపద్మావతి విద్యాసంస్థల చేర్మన్ తాళ్ల మల్లేశం మాట్లాడుతూ.. టాస్క్ సమన్వయంతో జెన్‌పాక్ట్ హైదరాబాద్, వరంగల్‌లో ఉండేవారి కోసం క్యాంపస్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారన్నారు. 650 మంది ఇంటర్వ్యూకు హాజరైతే 100 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఈ సెలోన్‌లో తాళ్లపద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్‌లు వంశీ చైతన్య, ప్రిన్సిపల్ వేలు విజయలక్ష్మి, శ్రీనివాస్‌రావు, అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికావు

కేయూ క్యాంపస్, జూలై 27:సివిల్ సర్వీసు పరీక్షల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ వద్దంటూ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు సరికావని కేయూ దివ్యాంగుల విద్యార్థి సంఘం నేతలు ఎన్.రాములు, డాక్టర్ వంగా మల్లేశ్, డాక్టర్ సంజీవ్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శివకృష్ణ, రమాదేవిలు ఒక శనివారం ప్రకటనలో ఖండించారు. ఈ మేరకు దివ్యాంగుల విద్యార్థి సంఘం నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగులపై స్మితా సబర్వాల్ తీరు హాస్యాస్పదంగా ఉందని, ఆమెను మానసిక దివ్యాంగురాలిగా భావించే విధంగా ఉందని తెలిపారు. అధికారిగా రెండు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన స్మితా సబర్వాల్.. దివ్యాంగులపై వ్యతిరేకంగా మాట్లాడటం మంచిదికాదని హితవు పలికారు. దివ్యాంగుల పేరుతో ఎంతోమంది సకలాంగులు నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందుతూ తమ కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. దివ్యాంగుల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులున్నారని గుర్తుచేశారు. స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల్లో 45 శాతం బీసీలకు కేటాయించాలి

ఐనవోలు, జూలై 27: రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 45 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయించాలని నందనంకు చెందిన ఆలిండియా కాంగ్రెస్ పార్టీ జాయింట్ కో ఆర్డినేటర్ ఉల్లెంగుల యాదగిరి కోరారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆలిండియా బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్యను కలుసుకొని వినతిపత్రం అందజేశారు. గడిచిన ఎన్నికల సమయంలో కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్‌పై రాహుల్‌గాంధీ స్థానిక సంస్థల్లో 45శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన మాటలను జస్టిస్ ఈశ్వరయ్యకు గుర్తుచేసినట్లు ఆయన తెలిపారు.



జస్టిస్ ఈశ్వరయ్యను శాలువాతో సత్కరిస్తున్న యాదగిరి

నాస్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 27 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) శిక్షణ శిబిరాలను డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై ప్రారంభించారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ హైస్కూల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. శిక్షణ శిబిరాలను ప్రారంభించిన అనంతరం అబ్దుల్‌హై మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన అభ్యసన సామర్థ్యాలు అందిస్తే వారికి గుణాత్మక విద్య లభిస్తుందన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ టీచర్స్, ఏఎంవో ఎ.శ్రీనివాస్, ఎంఈవో ఎం.రాంకిషన్‌రాజు, రీసోర్సు టీచర్స్ ఆనందం, బిక్షపతి, పున్నంచందర్, రాజగోపాల్, శ్యాంసుందర్, చంద్రయ్య, దయాకర్‌రెడ్డి, రామన్న, సురేష్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట, జూలై 27: ఆగస్టు 5, 6, 7 తేదీలలో కాజీపేట పీఎఫ్ ఆఫీస్ రోడ్డు భీమనగర్‌లోని కనుకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.చుక్కయ్య కోరారు. కాజీపేట ఫాతిమానగర్‌లో మండల కమిటీ సభ్యుడు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చుక్కయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన హామీ ప్రకారం కాజీపేటలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా కేంద్రం జిల్లాను తీవ్ర అన్యాయానికి గురిచేసిందన్నారు. వ్యాగన్ పరిశ్రమకు శంకుస్థాపనచేసి చేతులు దులుపుకుందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని గాలికి వదిలేసిందన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు జంపాల రమేశ్, సునీత యాదవ్, డింపుల్ పాల్గొన్నారు.

అరకల సాయికుంటను ఆధునీకరించాలి

- గోపాల్‌పూర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్

వడ్డెపల్లి, జూలై 27: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని అరకల సాయికుంటను ఆధునీకరించాలని గోపాల్‌పూర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్ ప్రభ త్వాన్ని కోరారు. శనివారం అరకల సాయికుంట కట్టపై వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు కట్టను విస్తరించడంతో పాటు నీడ, ఫలాలను ఇచ్చే మొక్కలను నాటాలని అన్నారు. చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాకర్స్ సౌకర్యార్థం చెరువు కట్టపై వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు విశ్రాంతి తీసుకోవడానికి సిమెంటు బల్లల ఏర్పాటుతో పాటు చేతి బోరు పంపు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలని మహా నగర పాలక సంస్థ అధికారులను కోరారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గోపాల్‌పూర్ వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కట్కూరి సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సార్ల రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అమృత్‌సింగ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళిత కార్మికులను వేధిస్తున్న బల్దియా కమిషనర్

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య
- 30న బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ కార్పొరేషన్, జూలై 27: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న దళిత కార్మికుల పట్ల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వేధింపులు ఆపాలని, కార్మి కులకు కనీస సౌకర్యాలు ఇవ్వకుండా వేటు వేయడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.ఉప్పలయ్య మండిపడ్డారు. శనివారం బల్దియా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 1వ డివిజన్‌లో పని చేస్తున్న కొందరు దళిత సఫాయి కార్మికులను, జవాన్‌లపై కమిషనర్ వేటు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మికులకు వర్షాకాలంలో రెయిన్ కోట్లు, అప్రాన్లు, యూనిఫామ్స్, పారలు, కొడవళ్ల ఇతర పరికరా లు ఇవ్వకుండా వర్షంలో సైతం పని చేయాలని ఆదేశించడం అమానవీయ చర్య అని మండిపడ్డారు. కమిషనర్ చర్యలకు నిరసనగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ఈనెల 30న బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ ధర్నాకు బల్దియా కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఉప్పలయ్య పిలుపునిచ్చారు.

కావలెను

ఆంధ్రజ్యోతి దినపత్రిక యందు ప్యాకింగ్ సెక్షన్‌లో రాత్రి వేళలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను.

అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వడం జరుగుతుంది.

మీ యొక్క బయోడేటాతో ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీస్‌లో హాజరు కాగలరు.

అర్హత : 10వ తరగతి,
వయస్సు : 21 నుండి 35 సం॥లోపు ఉండాలి.

ఇంటర్వ్యూ తేది : 29-07-2024
సమయం : ఉ॥ 10 గం॥ నుండి మ॥ 1 గం॥ వరకు

అడ్రస్ : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్,
సర్వే నెం. 1054, మడికొండ.
సెల్ : 9985411664



అలనాటి కథ

ఒకప్పటి హైదరాబాద్ క్రికెట్

క్రికెట్ ఇప్పుడు మన 'జాతీయ క్రీడ'లాగా మారిపోయింది కానీ ఒకప్పుడు దీనిని రాజకుటుంబీకులు మాత్రమే ఆడేవారు. హైదరాబాద్‌లో క్రికెట్ ప్రాచుర్యంలోకి రావటానికి మా నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్, నవాబ్ మొయిన్ ఉద్ దౌలా కారణం. స్వాతంత్ర్యం రాక ముందు వీరు క్రికెట్‌కు ఇచ్చిన ప్రోత్సాహం ఆ తర్వాతి కాలంలో అనేక మంది గొప్ప క్రీడాకారులు తయారవటానికి కారణమయింది.

క్రికెట్ ఆంగ్లేయుల ఆట. బ్రిటిష్ మిలటరీ రెజిమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో ఆర్మీ అధికారులు క్రికెట్ ఆడుతూ ఉండేవారు. ఫుట్‌బాల్, వాలీబాల్ మాదిరిగా దీనిని రెజిమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో ఆడటానికి వీలుండదు కాబట్టి కొన్ని కాలేజీ గ్రౌండ్స్‌ను, పెరేడ్ గ్రౌండ్స్‌ను ఎంపిక చేసుకొని వాటిలో ఆడేవారు. ఇలా సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్, జింఖానా క్లబ్ గ్రౌండ్స్ మొదలైన వాటిని ఎంపిక చేసుకున్నారు. అయితే క్రికెట్ ఖరీదైన ఆట. బ్యాట్స్, ప్యాడ్స్, గ్లౌవ్స్, ఆట మధ్యలో డ్రింక్స్, స్నాక్స్, ఆటగాళ్లకు రవాణా సదుపాయాలు... ఇలా ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల కొందరు అధికారులు రాజ కుటుంబీకులను విరాళాల కోసం సంప్రదించారు. అప్పటికి పోలో ఒకటే రాజకుటుంబీకులు ఆడే ఆటగా ఉండేది. క్రికెట్‌లో ఉన్న ఆకర్షణను గుర్తించిన నాన్న ధన్‌రాజ్‌గిర్ వంటి వారు క్రికెట్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లలో దేశంలోని అనేక మంది యువరాజులు, ప్రముఖ క్రికెటర్లు ఆడేవారు. నాన్న ఏర్పాటు చేసిన 'ధన్‌రాజ్‌గిర్ ఎలెవన్' టీమ్‌లో పాటియాలా యువరాజు ముస్తాక్, సి.కె.నాయుడు, దేవదర్, విజయనగరం యువరాజు



వంటి వారు ఆడేవారు. టీమ్‌లు మధ్య పోటీ కోసం నవాబ్ మొయిన్ ఉద్ దౌలా... 'బషీర్‌బాగ్ కప్' నిర్వహించారు. ఈ కప్‌ను పూర్తి బంగారంతో తయారు చేసేవారు. మూడుసార్లు గెలిచిన టీమ్ ఈ కప్‌ను తమ వద్దే ఉంచుకోవచ్చు. దీనితో ఆటగాళ్లు ప్రతిష్ఠాత్మకమైన ఈ కప్పును పొందటానికి ప్రయత్నించేవారు. ధన్‌రాజ్ ఎలెవన్ మూడుసార్లు వరుసగా ఈ కప్పు గెలుచుకుంది. మ్యాచ్‌లు పోటాపోటీగా జరుగుతూ ఉండటంతో ప్రేక్షకులు రావటం మొదలుపెట్టారు. దాంతో హైదరాబాద్‌లో క్రికెట్ సందడి బాగా పెరిగింది. ఒక దశలో ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యమైన ఆటగాళ్లు వచ్చి ఆడుతున్నప్పుడు, అప్పటి ప్రభుత్వం సెలవు కూడా ప్రకటించేది. ఇక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటగాళ్లతో జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ కూడా కళకళలాడుతూ ఉండేది. టైగర్ పటౌడి, సి.కె.నాయుడు వంటివారు నాన్నకు మంచి స్నేహితులు. సి.కె.నాయుడు మా ఇంటికి వచ్చినప్పుడు సరదాగా నాతో షటిల్ బ్యాట్‌తో క్రికెట్ ఆడేవారు. ఆ తర్వాతి కాలంలో హైదరాబాద్... క్రికెట్‌కు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారిపోయింది. క్రికెట్‌కు కావాల్సిన గ్రౌండ్స్, ఆఫీసులు వెలిసాయి. ఫతేమైదాన్ వద్ద ఉన్న క్రికెట్ అసోషియేషన్ ఆఫీసు ఎప్పుడూ సందడిగా ఉండేది. ఇప్పటితో పోలిస్తే అప్పటి క్రీడాకారులకు ఎక్కువ డబ్బులు వచ్చేవి కావు. కానీ ఇప్పటి లాగే అప్పుడు కూడా వారి పట్ల ప్రజల్లో క్రేజ్ మాత్రం ఉండేది.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



నోరు జారి.. ఆనక సారీతో సరి

ప్రత్యర్థులను ఇరుకున పెట్టేందుకు రాజకీయ నాయకులు... చీప్ పబ్లిసిటీ కోసం కొంత మంది సినిమావాళ్లు... కథానాయికలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా కోలీవుడ్‌లో హీరోయిన్లపై బజారు భాషను ఉపయోగిస్తూ వార్తల్లో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. కథానాయికలపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ, వారిని దుర్భాషలాడే సంస్కృతి అక్కడ క్రమంగా పెరుగుతోంది.

కొన్నేళ్లుగా ఏదో ఒక సందర్భంలో హీరోయిన్లను లక్ష్యంగా చేసుకొని వివాదాలు రాజేసే ప్రయత్నం తమిళ పరిశ్రమలో నిరాటంకంగా కొనసాగుతోంది. కొంతమంది స్వార్థపరులకు తమిళ నాయిక ఈజీ టార్గెట్‌గా మారుతోంది. ఈ తరహా ధోరణి అటు బాలీవుడ్‌లో కానీ ఇటు సౌతిండియాలోని మరో చిత్ర పరిశ్రమలోగానీ కనిపించదు.

తమన్నా పేరును వాడుకొని...

తమన్నా పాట ఉంటే చాలు సినిమా హిట్ అవుతుందంటూ తమిళ నటుడు, దర్శకుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్ పరిశ్రమలో దుమారం రేపాయి. అలా అనడంలో ఆయన అసలు లక్ష్యం మాత్రం రజనీకాంత్ నటించిన 'జైలర్', ఖుష్బూ భర్త సుందర్ తెరకెక్కించిన 'బాక్' చిత్రాలు. వాటి విజయాన్ని తక్కువ చేసి చూపించే క్రమంలో ఆయన



అలా మాట్లాడారు. కానీ అందుకు తమన్నా పేరును అస్త్రంగా వాడుకోవడాన్ని పరిశ్రమ తప్పు పట్టింది. కేవలం ఆమె కురుచ దుస్తుల్లో అందాల ప్రదర్శనే ఆ సినిమాలను ఒడ్డున పడేసిందని అర్థం వచ్చేలా మాట్లాడడంపై పరిశ్రమ వర్గాలు అభ్యంతరం చెప్పడంతో చివరకు పార్తీబన్ అందరికీ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

నయనతార లక్ష్యంగా...

సినీ రంగంలోని దిగ్గజాలే కాదు... వర్థమాన నటీనటులు, దర్శకులు సైతం హీరోయిన్లపై నోరు పారేసుకుంటున్నారు. కథానాయికల వ్యక్తిగత జీవితాన్ని బజారుకీడ్చే పని పెట్టుకుంటున్నారు. తరచూ సినీ, రాజకీయ వర్గాలకు లక్ష్యంగా మారారు నయనతార. ఆమెపై పలు సందర్భాల్లో అక్కడి సినీ రాజకీయ ప్రముఖులుగా భావించే కురుచ బుద్ధి నాయకులు కించపరిచే వ్యాఖ్యలు చేశారు. సీనియర్ నటుడు, బీజేపీ నాయకుడు రాధారవి నయనతారకూ, సీఎం స్టాలిన్ కుమారుడు, హీరో ఉదయనిధికి అక్రమ సంబంధం అంటగట్టారు. నయనతారతో ఉదయనిధి సహజీవనం చేస్తున్నారని 2021లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చెప్పాడు. వాళ్ల ఎఫైర్ గురించి నిలదీయడం వల్లే డీఎంకే నుంచి తనను బహిష్కరించారని చెప్పారు. ఆ ఎన్నికల్లోనే ఆయన కమల్‌హాసన్‌పైనా తన వ్యాఖ్యలతో పేట్రేగారు. ప్రధాని మోదీకి, కమల్‌హాసన్‌కు పోలిక లేదన్నారు. మోదీ దేశాన్ని కాపాడితే, కమల్ కట్టుకున్న భార్యలను కాపాడుకోలేకపోయాన్నారు. ముగ్గురు మహిళల జీవితాలను రోడ్డుపాలు చేశాడని విమర్శించారు.

హన్సికపై ఆరోపణలు...

హన్సిక నటించిన 'పార్ట్‌నర్' చిత్రంలో రోబో శంకర్ కీలకపాత్ర పోషించారు. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో హీరోయిన్ హన్సికపై ఆమె ఎదురుగానే మీడియా సమక్షంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు రోబో శంకర్. 'షూటింగ్‌లో దర్శకుడు ఎంత బతిమాలినా ఆమె నా కాలు తాకేందుకు ఇష్టపడలేదు. నన్ను ముట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదు. ఆమె ప్రవర్తనకు యూనిట్ అంతా విస్తుపోయింది' అని చెప్పాడు. అలాంటిదేం జరగలేదని ఆ తర్వాత అతడు క్షమాపణలు చెప్పాడు.

డబుల్ మీనింగ్ డైలాగ్‌తో...

త్రిషను బెడ్‌రూమ్‌కు తీసుకెళ్దామనుకున్నాను అంటూ డబుల్ మీనింగ్ డైలాగ్‌లతో ఆ మధ్య వార్తల్లో నిలిచారు సీనియర్ నటుడు మన్సూర్ అలీఖాన్. 'నా కెరీర్‌లో ఎన్నో రేప్ సీన్లు చేశాను. 'లియో'లో త్రిషను బెడ్‌రూమ్‌కి తీసుకెళ్దామనుకున్నాను. కానీ రేప్ సీన్ లేకపోవడం నన్ను బాధించింది' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు విలన్‌గా ఓ వెలుగు వెలిగిన మన్సూర్ ప్రభ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఆ నేపథ్యంలో 'లియో' సినిమాలో అప్రాధాన్యమైన పాత్ర పోషించాల్సి వస్తుందనే ఆక్రోశం, హీరోను, దర్శకుణ్ణి ఏమీ అనలేని పరిస్థితిలో ఆయన త్రిషపై చిల్లర వ్యాఖ్యలకు దిగాడనేది కోలీవుడ్ టాక్. తద్వారా జనాల దృష్టిని ఆకర్షించాలనే అతని ప్రయత్నం నెరవేరింది. కానీ ఒక మహిళ వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు అతను ప్రయత్నించడాన్ని జనాలు ఛీ కొట్టారు. చిత్రపరిశ్రమ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, కోర్టు మొట్టికాయలు వేయడంతో మన్సూర్ మొక్కుబడిగా క్షమాపణలు చెప్పి వివాదాన్ని ముగించాడు.

ధనుష్‌తో మీనా పెళ్లి?


2022లో మీనా భర్త విద్యాసాగర్ అనారోగ్యంతో కన్నుమూశారు. మీనాకు యావత్ చిత్రపరిశ్రమ అండగా నిలిచింది. నాలుగు ఓదార్పు మాటలు చెప్పింది. తర్వాత క్రమంగా ఆ బాధ నుంచి బయటపడి మీనా సినిమాలు చేస్తున్నారు. 'కూతురే నా లోకం. మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని మీనా పలు సందర్భాల్లో చెప్పారు. కానీ అక్కడి మీడియా మాత్రం మీనాతో ఎవరెవరినో ముడిపెడుతూ వార్తలు వడ్డిస్తోంది. దానిక్కావలసిన ముడి సరకును అక్కడి సినిమావాళ్లే అందిస్తున్నారు. మీనా జూలైలో ధనుష్‌ను పెళ్లాడబోతోందంటూ బీ రంగనాథన్ అనే నటుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'ఇద్దరూ వయసులో ఉన్నారు, పైగా తోడు లేదు, పెళ్లి చేసుకుంటే తప్పేంటి? చేసుకోకుండా కలిసి ఉన్నా తప్పులేదు' అన్నాడు. అతని వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారడంతో అలాంటిదేం లేదని మీనా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ●

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఎ గుడ్ గర్ల్స్ గైడ్ టు మర్డర్	వెబ్‌సిరీస్	ఆగస్టు 01
అన్‌స్టేబుల్ 2	వెబ్‌సిరీస్	ఆగస్టు 01
మోడ్రన్ మాస్టర్స్	రాజమౌళి డాక్యుమెంటరీ	ఆగస్టు 02
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
నో వే అవుట్	కొరియన్ సిరీస్	జూలై 31
కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్	తెలుగు డబ్బింగ్	ఆగస్టు 02
సోనీ లివ్		
బృంద	తెలుగు సిరీస్ 	ఆగస్టు 02
జియో సినిమా 		
డ్యూన్ 2	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 01
ఘుడ్‌చడీ	హిందీ చిత్రం	ఆగస్టు 01
టారో	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 03
ఆపిల్ టీవీ ప్లస్		
ఉమెన్ ఇన్ బ్లూ	వెబ్‌సిరీస్	జూలై 31

సినిమా బాహుబలి కథ



'బాహుబలి' సిరీస్ చిత్రాలతో తెలుగు సినిమాను జాతీయ స్థాయిలో మేటిగా నిలిపి దర్శకుడిగా పేరు ప్రతిష్ఠలు ఆర్జించారు రాజమౌళి. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకను రెపరెపలాడించాడు. ఆ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ దక్కడంతో దర్శకుడిగా ఆయన పేరు మార్మోగింది. దేశంలో పాపులర్ డైరెక్టర్స్, అత్యధిక పారితోషికం అందుకునే దర్శకుల్లో ఆయనది అగ్రస్థానం. ఈ నేపథ్యంలో రాజమౌళిపై 'మోడ్రన్ మాస్టర్స్' అనే డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ కన్నా దర్శకత్వంలో సమీర్ నాయక్, దీపక్ సెగల్ నిర్మించారు. ఇటీవలే ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు రాజమౌళిపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. 'మోడ్రన్ మాస్టర్స్' ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవనుంది. ●

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/ajQQ9wpలో చదవండి.

డాక్టర్ రెడ్డీస్ షేర్ల విభజన

ఒక షేరు ఐదు షేర్లుగా... అమెరికన్ డిపాజిటరీ షేర్లు సైతం



హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించనున్నట్లు శనివారం ప్రకటించింది. ప్రస్తుతం రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూపాయి ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కంపెనీ సమాచారం అందించింది. షేర్ల విభజనకు రికార్డు తేదీని తర్వాత వెల్లడిస్తామని సంస్థ పేర్కొంది. అంతేకాదు, ప్రస్తుతం ప్రతి అమెరికన్ డిపాజిటరీ షేరు (ఏడీఆర్) కూడా ఒక ఈక్విటీ షేరుతో సమానమని.. విభజన ఫలితంగా ఏడీఆర్‌లు సైతం ఈక్విటీ షేర్లకు సమానంగా పెరుగుతాయని కంపెనీ స్పష్టం చేసింది. డాక్టర్ రెడ్డీస్ తన షేర్లను విభజించడం ఇది రెండోసారి. 2001 అక్టోబరులో కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.5 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా విభజించింది. శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ షేరు బీఎస్ఈలో 0.55 శాతం పెరుగుదలతో రూ.6,892 వద్ద ముగిసింది.

క్యూ1 లాభం రూ.1,392 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి డాక్టర్ రెడ్డీస్ రూ.1,392 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి గడించిన రూ.1,403 కోట్ల లాభంతో పోలిస్తే 0.7 శాతం తగ్గినప్పటికీ, మార్కెట్ అంచనాలను మించి నమోదైంది. కంపెనీ ఆదాయం 14 శాతం పెరిగి రూ.7,673 కోట్లకు చేరుకుంది. ఇప్పటివరకు కంపెనీ ఆర్జించిన అత్యధిక త్రైమాసికాదాయం ఇదే. 2023-24లో ఇదే సమయానికి ఆదాయం రూ.6,738 కోట్లుగా ఉంది. పన్ను భారం 24 శాతం నుంచి 26 శాతానికి పెరగడం లాభాలను ప్రభావితం చేసింది. కాగా, ఉత్తర అమెరికాతోపాటు భారత మార్కెట్లో జనరిక్ ఔషధాల విక్రయాలు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడింది.

> కొత్త ఆర్థిక సంవత్సరానికి కంపెనీ శుభారంభం చేసింది. జనరిక్ ఔషధాల వ్యాపారం కంపెనీ వృద్ధి, లాభదాయకతను ముందుకు నడిపించాయి. ఒకవైపు మా కీలక వ్యాపారాలను బలోపేతం చేస్తూనే మరోవైపు వ్యాపార విలువను పెంచేందుకు బయోలాజిక్స్, కన్స్యూమర్ హెల్త్‌కేర్, ఆవిష్కరణల్లో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టాం.
>
> \- జీవీ ప్రసాద్, డాక్టర్ రెడ్డీస్ సహ చైర్మన్, ఎండీ

స్విస్ యూనిట్లోకి 50 కోట్ల పౌండ్లు

స్విట్జర్లాండ్ అనుబంధ విభాగమైన 'డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ'లో 50 కోట్ల పౌండ్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. స్విస్ అనుబంధ విభాగం ఈ నిధులను నికోటినెల్, ఇతర బ్రాండ్ల కొనుగోలుకు ఉపయోగించుకోనుంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- మొత్తం ఆదాయంలో గ్లోబల్ జనరిక్స్ విక్రయాల వాటా 90 శాతంగా నమోదైంది. ఈ క్యూ1లో గ్లోబల్ జనరిక్స్ ద్వారా రాబడి 15 శాతం పెరిగి రూ.6,886 కోట్లకు చేరుకుంది. ఫార్మాస్యూటికల్ సేవలు, యాక్టివ్ ఇంగ్రెడియెంట్స్ ద్వారా రెవెన్యూ 14 శాతం వృద్ధితో రూ.770 కోట్లుగా నమోదైంది.
- గ్లోబల్ జనరిక్స్ ఆదాయాన్ని మార్కెట్ల వారీగా పరిశీలిస్తే, ఉత్తర అమెరికా నుంచి రెవెన్యూ 20 శాతం వృద్ధితో రూ.3,846 కోట్లుగా నమోదైంది. విక్రయాలు పుంజుకోవడం, మూడు కొత్త ఉత్పత్తుల విడుదల ఇందుకు కలిసివచ్చాయి. యూరప్ మార్కెట్ రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.527 కోట్లుగా, భారత మార్కెట్ నుంచి రాబడి 15 శాతం పుంజుకొని రూ.1,325 కోట్లుగా నమోదయ్యాయి. వర్థమాన మార్కెట్ల నుంచి రెవెన్యూ 3 శాతం పెరిగి రూ.1,188 కోట్లకు చేరుకుంది.
- ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ భారత మార్కెట్ నుంచి రెండంకెల స్థాయి ఆదాయ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. బేస్ బిజినెస్ ఇందుకు దోహదపడగలదని భావిస్తోంది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ దేశీయ మార్కెట్లో 13 కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది.

పీఎన్‌బీ రికార్డు లాభం

క్యూ-1లో రూ.3,252 కోట్లు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) జూన్ త్రైమాసికానికి రూ.3,252 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. బ్యాంక్ చరిత్రలో ఇప్పటివరకిదే అత్యధిక త్రైమాసిక లాభం. మొండిబాకీలు మరింత తగ్గడంతోపాటు వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయల్ అన్నా రు. గత ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.1,255 కోట్లుగా నమోదైంది. కాగా, గడిచిన మూడు నెలల్లో పీఎన్‌బీ మొత్తం ఆదాయం రూ.32,166 కోట్లకు పెరిగింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి రాబడి రూ.28,579 కోట్లుగా ఉంది. ఏడాది క్రితంతో పోలిస్తే, బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.21,145 కోట్ల నుంచి రూ.28,556 కోట్లకు ఎగబాకింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.9,504 కోట్ల నుంచి రూ.10,476 కోట్లకు చేరుకుంది. మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) జూన్ చివరి నాటికి 7.73 శాతం నుంచి 4.98 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.98 శాతం నుంచి 0.60 శాతానికి జారుకున్నాయి. దీంతో మొండిబకాయిల కోసం కేటాయింపు సైతం రూ.4,374 కోట్ల స్థాయి నుంచి రూ.792 కోట్లకు తగ్గాయి. కంపెనీల దివాలా పరిష్కార కేసుల ద్వారా రూ.18,000 కోట్ల మేర మొండిబాకీలు వసూలు కావచ్చని బ్యాంక్ భావిస్తోంది. గడిచిన మూడు నెలల్లో రూ.1,755 కోట్ల విలువైన రుణాలు మొండి పద్దులుగా మారాయని బ్యాంక్ వెల్లడించింది. కాగా, రూ.3,249 కోట్ల మొండి బాకీలను వసూలు చేయగలిగినట్లు తెలిపింది. వచ్చే మార్చి నాటికి గ్రాస్ ఎన్‌పీఏలను 4 శాతం దిగువకు, నికర ఎన్‌పీఏలను 0.5 శాతం దిగువకు కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ తెలిపారు. ఈసారి రుణ వృద్ధి 11-12 శాతంగా, డిపాజిట్ల వృద్ధి 9-10 శాతంగా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.9-3 శాతంగా నమోదుకావచ్చన్నారు.

5 కోట్లు దాటిన ఐటీ రిటర్న్‌లు

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖకు చెందిన ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై శనివారం వరకు దాఖలైన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 5 కోట్లు దాటింది. గత ఏడాదితో పోల్చితే దాఖలైన రిటర్న్‌ల సంఖ్య 8 శాతం అధికమని ఐటీ శాఖ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఒక్క శనివారంనాడే 28 లక్షలకు పైగా రిటర్న్‌లు దాఖలయ్యాయి. రిటర్న్‌ల దాఖలు సమయంలో ఎలాంటి అవరోధాలు లేకుండా సేవలందేలా చూడాలని టెక్నాలజీ భాగస్వామి ఇన్ఫోసిస్‌ను తమ శాఖ ఆదేశించగా అందుకు కంపెనీ హామీ ఇచ్చిందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాఖలైన మొత్తం ఐటీఆర్‌ల సంఖ్య 8.61 కోట్లు.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.11,696 కోట్లు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం జూన్ త్రైమాసికానికి వార్షిక ప్రాతిపదికన 9.96 శాతం వృద్ధితో రూ.11,695.84 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.10,636.12 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో బ్యాంక్ స్టాండలోన్ లాభం 14.62 శాతం వృద్ధితో రూ.11,059 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.45,998 కోట్లకు ఎగబాకింది. గత ఏడాది జూన్ త్రైమాసికాదాయం రూ.38,763 కోట్లుగా ఉంది. వ్యయాలు రూ.24,624 కోట్ల నుంచి రూ.29,973 కోట్లకు ఎగబాకాయి. ఈ క్యూ1లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 7.3 శాతం పెరిగి రూ.19,552.9 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.36 శాతానికి తగ్గింది. ఎన్ఐఎం 4.40 శాతంగా ఉండగా.. గత ఏడాది జూన్ త్రైమాసికంలో 4.78 శాతంగా నమోదైంది. మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.15 శాతానికి (రూ.28,718.6) కోట్లకు తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.43 శాతానికి (రూ.5,684.8 కోట్లు) పెరిగాయి. మొండిబకాయిల కోసం బ్యాంక్ రూ.1,332.2 కోట్ల కేటాయింపులు జరిపింది.

కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో విలీనానికి

సువెన్‌కు అనుమతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో విలీనానికి సువెన్ లైఫ్ సైన్సెస్‌కు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల నుంచి అనుమతి లభించింది. శనివారం ఒక ప్రకటనలో సువెన్ లైఫ్ సైన్సెస్ ఈ విషయం వెల్లడించింది. ఇదిలా ఉండగా సువెన్ ఫార్మాస్యూటికల్స్, కోహెన్స్ లైఫ్‌సైన్సెస్ ఉమ్మడిగా ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు అందించాయి. గతంలో ప్రకటించిన ప్రకారం ఈ విలీనం పూర్తి కావడానికి 12 నుంచి 15 నెలల కాలం పడుతుంది. పీఈ సంస్థ యాడ్వెంట్ ప్రస్తుతం సువెన్ ఫార్మాలో 50.1 శాతం, కోహెన్స్‌లో నూరు శాతం వాటాలు కలిగి ఉంది. విలీనం అనంతరం ఉమ్మడి కంపెనీలో యాడ్వెంట్‌కు 66.7 శాతం వాటాలుంటాయి.

వచ్చేనెల 2 నుంచి ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ

ముంబై: విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ వచ్చేనెల 2న ప్రారంభమై 6న ముగియనుంది. ఈ ఐపీఓలో సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను 420-440 కోట్ల డాలర్ల (రూ.35,166-36,840 కోట్లు) స్థాయిలో లెక్కించే అవకాశం ఉంది. అలాగే, ఓలా ఎలక్ట్రిక్ ఈ ఏడాదిలో అతి పెద్ద ఐపీఓల్లో ఒకటి కానుంది. అంతేకాదు, భారత్‌లో ఐపీఓకు వస్తున్న తొలి ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ కూడా ఇదే కానుంది.

వస్తు సేవల పన్ను - బడ్జెట్ ప్రతిపాదనలు

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో వస్తు సేవల పన్ను చట్టానికి పలు సవరణలు ప్రతిపాదించారు. వీటిలో పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన కొన్ని ముఖ్య ప్రతిపాదనలు మీ కోసం...



రాంబాబు గొండాల

మొదటిది ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ గడువుకు సంబంధించినది. ఒక వ్యాపారి తాను పొందిన వస్తు సేవలకు సంబంధించిన క్రెడిట్‌ను నిర్ణీత గడువు లోపు తీసుకోవాలి. నిజానికి ఈ నిర్ణీత గడువుకు సంబంధించిన నిబంధనకు ఇంతకు ముందు కూడా సవరణ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధన ప్రకారం ఇన్‌వాయిస్ ఏ ఆర్థిక సంవత్సరంలో పొందారో దాని తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 లోపు ఆ ఇన్‌వాయిస్‌కు సంబంధించిన ఐటీసీని రిటర్న్ దాఖలు చేయడం ద్వారా పొందాలి. అయితే జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తొలి రోజుల్లో చాలా మంది అవగాహన లేకపోవడం వల్ల అర్హత ఉన్నప్పటికీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను నిర్ణీత గడువు లోగా పొందలేకపోయారు. అందుకే ఆ గడువు ముగిసిన తర్వాత తీసుకున్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లదంటూ పన్ను చెల్లింపుదారులకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది. ఈ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత నిబంధనను ఈ బడ్జెట్లో సవరించారు. దీని ప్రకారం 2017-18 నుంచి 2020-21 సంవత్సరం వరకు అంటే మొదటి నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో పొందిన ఇన్‌వాయిస్‌లపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను 2021 నవంబరు 30 లోపు ఎప్పుడు తీసుకున్నా దానిని నిర్ణీత గడువు లోగా తీసుకున్నట్లుగానే పరిగణిస్తారు.

ఇక రెండోది కూడా ఐటీసీకి సంబంధించినదే. ఒక వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దయి తిరిగి పునరుద్ధరణ జరిగినప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు నాటికి ఉన్న ఇన్‌వాయిస్‌లపై తీసుకోకుండా మిగిలిపోయిన క్రెడిట్ ఏదైనా ఉంటే అలాంటి క్రెడిట్‌ను పునరుద్ధరణ అయిన తర్వాత కూడా పొందవచ్చు. అయితే రిజిస్ట్రేషన్ అమలులో ఉన్న సమయంలో సదరు క్రెడిట్ పొందడానికి గల నిర్ణీత గడువు మించి ఉండకూడదు. అంటే రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ జరిగే సమయానికి సదరు ఇన్‌వాయిస్‌ల మీద క్రెడిట్ పొందడానికి గల నిర్ణీత గడువు దాటినప్పటికీ క్రెడిట్ పొందవచ్చు. అయితే దీనికి కొన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

మరో ముఖ్యమైన సవరణ కూడా ఉంది. మోసపూరిత ఉల్లంఘనలు కాకుండా సాధారణ ఉల్లంఘనలు చోటు చేసుకున్న సమయంలో పన్ను చెల్లింపునకు సంబంధించి ఒక వ్యక్తికి నోటీసు లేదా ఆర్డర్ అందినప్పుడు సదరు వ్యక్తి ఆ పన్ను మొత్తాన్ని నిర్ణీత గడువు లోపు చెల్లించినప్పుడు దానికి సంబంధించిన వడ్డీ, పెనాల్టీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే సంబంధిత నోటీసు లేదా ఆర్డర్‌లో పన్నుతోపాటు వడ్డీ, పెనాల్టీ ఉన్నప్పటికీ పన్ను మాత్రం చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఎంతో మందికి ఊరట కలిగించే అంశం. అయితే ఈ మినహాయింపు 2017 జూలై నుంచి 2020 మార్చి మధ్యలో వచ్చిన డిమాండ్లకు మాత్రమే వర్తిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	104
కర్నూలు	94	నెల్లూరు	104
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY SAM ANTON
PRODUCED BY KE GNANAVELRAJA AADHANA GNANAVELRAJA
IN CINEMAS AUGUST 2ND
Junglee


కనిపించేదంతా ముక్కంటి మర్మమే
1ST AUG IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI APSAR


VIJAYA BHASKAR KRAFT
ఆగస్టు 2 బ్రహ్మాండమైన విడుదల
A VIJAYA BHASKAR FILM
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN
Pre Release Event ON SUNDAY 28.7.2024


INFINITI FILM VENTURES
IN THEATRES AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B PRADEEP | PANKAJ BOHRA
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


DHANUSH
MASSIVE BLOCKBUSTER
KALANITHI MARAN PRESENTS DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL


SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
IN CINEMAS AUG 2ND


AUGUST 2ND IN THEATERS
తిరగబడరసామీ...
MALKAPURAM SHIVAKUMAR A S RAVIKUMAR CHOWDARY

మిమ్మల్ని రాష్ట్రం నుంచే బహిష్కరించారు!

ఆ విషయం గుర్తుందా?

» మీలాంటి వ్యక్తి దేశానికి హోం శాఖ మంత్రా?

» అమిత్ షాపై శరద్ పవార్ మాటకు మాట



న్యూఢిల్లీ, జూలై 27: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, ఎన్సీపీ(ఎస్పీ) నేత, సీనియర్ నాయకుడు శరద్ పవార్‌ల మధ్య రాజకీయం వేడెక్కింది. ఇటీవల మహారాష్ట్రలోని పుణెలో జరిగిన బీజేపీ సదస్సులో శరద్ పవార్‌ను ఉద్దేశించి 'అవినీతి చక్రవర్తి' అని షా వ్యాఖ్యానించారు. "ప్రతిపక్షాలు అవినీతి గురించి మాట్లాడుతున్నాయి. అసలు దేశ రాజకీయాల్లో అతిపెద్ద అవినీతి చక్రవర్తి ఎవరైనా ఉంటే ఆయన శరద్ పవారే" అని విమర్శలు గుప్పించారు. దీనికి కౌంటర్‌గా తాజాగా స్పందించిన పవార్.. "మిమ్మల్ని గుజరాత్ నుంచి బహిష్కరించిన విషయం గుర్తుందా? లేక మరిచిపోయారా? మీలాంటి వ్యక్తి దేశానికి హోం శాఖ మంత్రిగా ఉండడం దురదృష్టకరం" అని నిప్పులు చెరిగారు. "ప్రస్తుతం ఈ దేశానికి హోం మంత్రిగా ఉన్న వ్యక్తి గుజరాత్‌లో చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న కారణంగా సుప్రీంకోర్టు ఆయనకు రాష్ట్ర బహిష్కారం విధించింది. దీనిని బట్టి మనం ఎటు వెళ్తున్నామో, ఈ దేశం ఎవరి చేతుల్లో ఉందో ఆలోచించుకోవాలి" అని పవార్ వ్యాఖ్యానించారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సుప్రీం కోర్టు 2010లో అమిత్‌షాపై రాష్ట్ర బహిష్కరణ విధించింది. కానీ, తర్వాత ఆయన నిర్దోషి అని తేల్చింది.

ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న గగన్‌యాన్ వ్యోమగామి

న్యూఢిల్లీ, జూలై 27: భారత తొలి మానవ సహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్' కోసం శిక్షణ పొందుతున్న నలుగురు వ్యోమగాముల్లో ఒకరు.. త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్)కు వెళ్లనున్నారని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. నాసాకు అనుబంధంగా పని చేస్తున్న ఆక్సియోమ్ స్పేస్ అనే సంస్థతో ఇస్రో ఈ మేరకు ఒప్పందం చేసుకుందని, దాంట్లో భాగంగా ఐఎస్ఎస్ పర్యటన జరగనుందన్నారు. లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు.

హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మొగ్గు

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలో జరగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే విజయావకాశాలున్నాయని పీపుల్స్ పల్స్ మూడ్ సర్వే వెల్లడించింది. మొత్తం 90 స్థానాల్లో.. 44% ఓట్లతో కాంగ్రెస్ 43-48 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆ సర్వే తెలిపింది. బీజేపీ 41శాతం ఓట్లతో 34-39 స్థానాలకే పరిమితమవుతుందని, ఇతరులు 3-8 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే సీఎంగా కాంగ్రెస్ నేత భూపేందర్‌సింగ్ వైపు 40% మంది, సిటింగ్ బీజేపీ సీఎం సైనీ వైపు 30% మంది మద్దతు ఉందని వివరించింది.

ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ సెంటర్‌లోకి వరద

» ఇద్దరు విద్యార్థుల మృతి, ఒకరు గల్లంతు

న్యూఢిల్లీ, జూలై 27: ఢిల్లీలో దారుణం జరిగింది. భారీ వర్షాలకు నగరంలోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్ భవనం సెల్లార్‌ను వరద ముంచెత్తగా ఇద్దరు విద్యార్థులు మరణించారు. మరొకరు గల్లంతయ్యారు. ఢిల్లీ కరోల్ బాగ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. ఆ భవనం సెల్లార్‌లో సదరు కోచింగ్ సెంటర్ గ్రంథాలయం ఉంది. కొందరు విద్యార్థులు అక్కడ చదువుకుంటుండగా హఠాత్తుగా వరద పోటెత్తి సెల్లార్ పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వగా కాసేపటికి ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభించాయి.

రాష్ట్రాల స్థాయిలో నదుల గ్రిడ్

(మొదటి పేజీ తరువాయి)

విధానం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని చెప్పారు. శాంతిభద్రతలు, సుపరిపాలన, మౌలిక సదుపాయాలు దీనికి అత్యంత కీలకమని వివరించారు. దేశంలో పేదరికం నిర్మూలనకు ప్రధాని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి వికసిత్ భారత్ లక్ష్యానికి ఇదే ప్రాతిపదిక కావాలని.. దీనిని ఓ కార్యక్రమంలా కాకుండా వ్యక్తి కేంద్రంగా చేపడదామని రాష్ట్రాలను కోరారు. పేదరికాన్ని తగ్గించడం కాదు, పేదరికమే లేని దేశంగా మారేలా కృషి చేయాలన్నారు. కింది స్థాయిలో పేదరికాన్ని నిర్మూలించినపుడే దేశంలో గొప్ప పరివర్తన జరుగుతుందని వ్యాఖ్యానించారు.



నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ

అవకాశాలకు తగ్గట్లు విధానాలు

వివిధ రంగాల్లో ఏర్పడిన అవకాశాలను ఉపయోగించుకుని వినూత్న విధానాలను రూపొందించాలని మోదీ కోరారు. వాటిని అమలుచేసేలా కూడా చూడాలని అన్నారు. జనాభా నిర్వహణ ప్రణాళికలను రూపొందించాలని కోరారు. వృద్ధుల సంఖ్య పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని జనాభా నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ అధికారుల సామర్థ్యాన్ని పెంచాలని, ఇందుకోసం సామర్థ్య నిర్మాణ కమిషన్‌తో కలిసి పనిచేయాలని రాష్ట్రాలకు నిర్దేశించారు. దేశం నిపుణులైన మానవ వనరుల కోసం ఎదురు చూస్తోందన్నారు. "వ్యవసాయంలో ఉత్పాదకత పెరగాలి. రైతులకు మార్కెట్‌తో అనుసంధానం కల్పించాలి. తక్కువ వ్యయంతో వెంటనే ఫలితాలు సాధించేలా చూడాలి. నేల సారం పెరిగే సహజ పద్ధతులను పాటించాలి. పంట ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లభించేలా చూడాలి" అని కోరారు.

పెట్టుబడుల వాతావరణాన్ని కల్పించాలి

పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని రాష్ట్రాలను కోరిన ప్రధాని.. అవసరమైన విధానాన్ని రూపొందించాలని నీతి ఆయోగ్‌ను ఆదేశించారు. ఇందులో పెట్టుబడులకు అవసరమైన ప్రణాళికలు ఉండాలని నిర్దేశించారు. నీతి ఆయోగ్ రూపొందించిన ఆకాంక్షపూరిత జిల్లాల కార్యక్రమాన్ని మోదీ ప్రశంసించారు. జిల్లాల మధ్య మెరుగైన పనితీరు కోసం పోటీ ఏర్పడేందుకు వీలుగా నిరంతరం ఆన్‌లైన్ పర్యవేక్షణతో ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. గత పదేళ్లుగా భారత దేశం స్థిరంగా అభివృద్ధి చెందుతోందని, పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా పనిచేసి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేలా చేయాలని లక్ష్యం పెట్టుకున్నారని చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశానికి 26 రాష్ట్రాల సీఎంలు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరయ్యారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు కొన్ని రాష్ట్రాలు తమ వ్యూహాలను సమర్పించాయి. బిహార్ సీఎం నితీశ్ కుమార్ అసెంబ్లీ సమావేశాల కారణంగా నీతి ఆయోగ్ భేటీకి హాజరుకాలేదు.

బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో మోదీ భేటీ

న్యూఢిల్లీ, జూలై 27: బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శనివారం భేటీ అయ్యారు. 'ముఖ్యమంత్రి పరిషద్' పేరుతో బీజేపీ నిర్ణీత కాల వ్యవధిలో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తుంటుంది. కీలకమైన పథకాలను సమీక్షించడంతో పాటు, మంచి పాలన విధానాలను పాటించడం, కేంద్ర సంక్షేమ పథకాలను అమలు చేయడం వంటి అంశాలపై చర్చలు జరుపుతారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు బీజేపీ సీఎంల భేటీని ఏర్పాటు చేసింది.

నీతి ఆయోగ్ సమావేశం నుంచి మమత వాకౌట్



న్యూఢిల్లీ, జూలై 27: కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌కు నిధుల కేటాయింపులో వివక్ష, రాష్ట్ర విభజన ప్రయత్నాలపై నిలదీస్తానంటూ నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన ఆ రాష్ట్ర సీఎం మమత మధ్యలోనే వాకౌట్ చేశారు. తాను మాట్లాడుతుండగా మధ్యలోనే మైక్ ఆపివేయడాన్ని నిరసిస్తూ బాయ్‌కాట్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు 20 నిమిషాలు, గోవా, అసోం, ఛత్తీస్‌గఢ్ సీఎంలకు 15 నిమిషాల వరకు కేటాయించారని.. తనకు మాత్రం 5నిమిషాలకే మైక్ బంద్ చేశారని మమత ఆక్షేపించారు. బడ్జెట్‌లో తమ రాష్ట్రానికి నిధుల కేటాయింపు గురించి మాట్లాడడం మొదలుపెట్టగానే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది అవమానకరమని ఇంకెపుడూ నీతి ఆయోగ్ భేటీకి రానని ప్రకటించారు. ఆ వెంటనే కోల్‌కతాకు వెళ్లిపోయారు. ఇతర రాష్ట్రాలకు అధిక నిధులు ఇవ్వడంపై తనకు అభ్యంతరం లేదని.. బెంగాల్ పట్ల వివక్ష చూపడం మాత్రం సహించబోనని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నుంచి నీతి ఆయోగ్‌కు హాజరైన ఏకైక సీఎం తానేనని, కనీసం 30 నిమిషాల సమయం ఇవ్వాల్సిందని అన్నారు. కానీ, పదేపదే బెల్ నొక్కారని, ఇది అవమానించడం కాదా? అని ప్రశ్నించారు. కాగా, ఇకపై అయినా నీతి ఆయోగ్‌కు ఆర్థిక అధికారాలు కల్పించాలని లేదంటే ప్రణాళికా సంఘాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. మమత నిర్ణయాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ సమర్థించారు. కాగా, నీతి ఆయోగ్ సమావేశంలో 5 నిమిషాలే కేటాయించారన్న మమత ఆరోపణలను నిర్మలా సీతారామన్ ఖండించారు. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ కూడా మమత ఆరోపణల్లో నిజం లేదని తెలిపింది. ఆమెకు కేటాయించిన సమయం అయిపోయినట్లు మాత్రమే గడియారం చూపిందని వివరించింది. నీతి ఆయోగ్ సీఈవో సుబ్రమణియన్ స్పందిస్తూ.. ప్రతి సీఎంకు 7 నిమిషాల సమయం ఇచ్చామని చెప్పారు. అక్షర క్రమంలో తొలుత ఏపీకి మాట్లాడే అవకాశం ఇచ్చామన్నారు. ఆ లెక్కన మమత ప్రసంగం భోజన విరామం తర్వాత ఉందని, ఆమె కోల్‌కతా వెళ్లాలని చెప్పడంతో ముందుకు జరిపామన్నారు.

దివ్యాంగులను సమానత్వంతో చూడాలి

» సీజేఐ జస్టిస్ చంద్రచూడ్



బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను సమానత్వంతో చూసేలా సమాజంలో మార్పు రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి అమలు కావడం ముఖ్యమని అన్నారు. బెంగళూరులో రాష్ట్ర ప్రభుత్వం, రామయ్య లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పంక్షన్ ఆఫ్ ఇండియా యాక్సెస్ ఎబిలిటీ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను ఒక న్యాయమూర్తిగా కాకుండా దివ్యాంగ బాలికల తండ్రిగా ఈ కార్యక్రమానికి వచ్చానని అన్నారు. దివ్యాంగుల బాధలు, సవాళ్లు తనకు బాగా తెలుసు అని పేర్కొన్నారు. ప్రజలు దివ్యాంగులను చూసే దృష్టి మారాలని అన్నారు. వారు ఏదైనా సాధించేలా అవకాశాలను మనం కల్పించాలని అన్నారు. తాను తన కుమార్తెలతో ఎంతో నేర్చుకున్నానని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. దివ్యాంగుల విజయగాథలను సినిమాలలో చూపి వారిలో చైతన్యం తీసుకొస్తున్నారని, ఆ ప్రక్రియ కొనసాగాలని అన్నారు. చట్టాలు కూడా వారికి అనుకూలంగా పనిచేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా మాట్లాడుతూ, తమ పరిధిలో 800 మంది దివ్యాంగులు పని చేస్తున్నారని, వారికి పని చేసే విధానంలో శిక్షణలు ఇచ్చామని, సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.



భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవల లావోస్‌లో పర్యటించినప్పుడు అయోధ్యలోని బాలరాముడి స్మారక స్టాంపును అక్కడ ఆవిష్కరించారు. భారత్, లావోస్ ఇరు దేశాలు సంయుక్తంగా ఈ స్టాంపును విడుదల చేశాయి. రామ్‌లల్లా విగ్రహంతో రూపొందించిన మొట్టమొదటి స్టాంపు ఇదే కావడం గమనార్హం.

భారతీయుల పిల్లలకు 'గ్రీన్‌కార్డ్' దెబ్బ!

» యుక్తవయసులోకి వచ్చిన కారణంగా అమెరికాలో బహిష్కరణ ముప్పు

» చిక్కుల్లో లక్షల మంది యువతీ యువకులు



వాషింగ్టన్, జూలై 27: అమెరికాలోని భారత సంతతి యువత దేశ బహిష్కరణ సమస్యలో చిక్కుకున్నారు. గ్రీన్ కార్డుల కోసం దశాబ్దాలుగా వేచి ఉన్న వీరంతా ఇప్పటికీ కార్డులు రాకపోవడంతో ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దీంతో అధ్యక్షుడు జో బైడెన్ ఇప్పుడు చొరవ తీసుకుంటే తప్ప వీరి సమస్య పరిష్కారమయ్యేలా కనిపించడం లేదు. దాదాపు 2,50,000 మందికిపైగా యువతీ యువకులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్టు వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరినె జీన్ పీర్రే తెలిపారు. వీరందరికీ వయో పరిమితి(21 ఏళ్లు) నిండిపోయిందని, అమెరికా రికార్డుల ప్రకారం 'ఆధారపడి జీవించే స్థాయి'ని దాటిపోయారని తెలిపారు. అయినప్పటికీ.. సంబంధిత యువతీ యువకులకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. "చట్టబద్ధంగా వలస వచ్చిన 2.5 లక్షల మంది యువతీ యువకుల్లో ఎక్కువ మంది భారత సంతతి వారే ఉన్నారు. వీరందరికీ 21 ఏళ్ల వయసు నిండింది. వీరిని 'డాక్యుమెంట్ డ్రీమర్స్'గా పేర్కొంటాం. తాత్కాలిక పనివీసాపై తమ తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు చేరుకున్నారు" అని సెక్రటరీ పేర్కొన్నారు. కాగా, వయో పరిమితి మీరిపోయిన భారత సంతతి యువతీ యువకులకు తక్షణమే రక్షణ కల్పించాలని వలస విధానం, పౌరసత్వంపై ఏర్పాటైన జ్యుడీషియరీ ఉపసంఘం చైర్మన్, చట్టసభ సభ్యుడు అలెక్స్ పదిల్లా అధ్యక్షుడు జో బైడెన్‌కు విన్నవించారు. అలెక్స్ నేతృత్వంలో 43 మంది చట్టసభ సభ్యులు జూన్ 13న ఈ సమస్యను అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లారు. "వీరంతా మన దేశంలో పెరిగిన వారే. ఇక్కడే చదువుకున్నారు. గ్రాడ్యుయేషన్ పట్టాలు సైతం అందుకున్నారు. ఇలాంటి వారిని గ్రీన్ కార్డు లేదన్న కారణంగా దేశం నుంచి పంపిచేయడం భావ్యం కాదు. కాబట్టి వారికి రక్షణ కల్పించండి" అని చట్టసభ సభ్యులు అధ్యక్షుడికి రాసిన లేఖలో విన్నవించారు.

పెరుగుతున్న తల, మెడ క్యాన్సర్లు

» భారత్‌లో 26% కేసులు ఇవే: నివేదిక

న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోని కేన్సర్ రోగుల్లో దాదాపు 26% మందికి తల, మెడలో కణితులు ఉన్నాయని, ఇలాంటి కేసుల సంఖ్య పెరుగుతోందని ఒక అధ్యయనం వెల్లడించింది. ఢిల్లీకి చెందిన కేన్సర్ ముక్త్ భారత్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ మార్చి 1 నుంచి జూన్ 30 వరకూ తన హెల్ప్‌లైన్ నంబర్‌కు వచ్చిన కాల్ డేటాను క్రోడీకరించి అధ్యయనం నిర్వహించింది. దేశవ్యాప్తంగా 1,869 మంది రోగులపై నిర్వహించిన ఈ సర్వే ఫలితాలను శనివారం ప్రపంచ తల, మెడ కేన్సర్ దినం సందర్భంగా విడుదల చేసింది. పొగాకు వినియోగంతో పాటు హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ల కారణంగా దేశంలో తల, మెడ కేన్సర్ కేసులు, ప్రత్యేకంగా యువకుల్లో బాగా పెరుగుతున్నాయని కేన్సర్ ముక్త్ భారత్ ప్రచారానికి నేతృత్వం వహిస్తున్న సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ ఆశిశ్ గుప్తా తెలిపారు. కేన్సర్ ముక్త్ భారత్ ప్రచారంలో భాగంగా జాతీయ స్థాయిలో ఉచిత హెల్ప్‌లైన్ 93-555-20202ను ఇటీవలే ప్రారంభించారు. సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకూ పనిచేసే ఈ నంబర్‌కు కేన్సర్ రోగులు కాల్ చేసి ప్రముఖ అంకాలజిస్టులతో నేరుగా మాట్లావచ్చు.

ప్రాణాల మీదకు తెస్తున్న విదేశీ విద్య

ఐదేళ్లలో 633 మంది భారత విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ, జూలై 27: విదేశాల్లో చదువుకొనేందుకు వెళ్లిన భారతీయ విద్యార్థులు దురదృష్టకర పరిస్థితుల్లో మృత్యువాత పడుతున్నారు. గత ఐదేళ్లలో 633 మంది విద్యార్థులు ఇలా 41 దేశాల్లో మరణించారు. ఈమేరకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ కేరళ ఎంపీ కొడికునిల్ సురేశ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభలో సమాచారం ఇచ్చారు. విదేశీ వ్యవహారాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం అత్యధికంగా కెనడాలో 172 మంది చనిపోయారు. తరువాతి స్థానంలో 108 మందితో యూఎస్(అమెరికా) ఉంది. యూకేలో 58, ఆస్ట్రేలియాలో 57, రష్యాలో 37, జర్మనీలో 24 మంది మృత్యువాత పడ్డారు. పాకిస్థాన్‌లో కూడా ఒక భారత విద్యార్థి మరణించారు. ఇలా విద్యార్థుల మరణాలకు కారణాలు పరిశీలిస్తే... సహజ మరణాలు, ప్రమాదాలు, దాడులు కారణాలుగా ఉన్నాయి. 19 మంది విద్యార్థులు హింసాత్మక దాడుల్లో మరణించగా వారిలో అత్యధికంగా కెనడాలో 9 మంది, యూఎస్‌లో ఆరుగురు, ఆస్ట్రేలియా, యూకే, చైనా, కిర్గిజిస్థాన్‌లలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. 2024 లెక్కల ప్రకారం..13.3 లక్షల మంది భారత విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు.

పాక్ 'బ్యాట్' దళం దాడిలో భారత జవాను మృతి

» కెప్టెన్ సహా నలుగురికి గాయాలు.. సరిహద్దుల్లో భద్రత పెంపునకు కేంద్రం నిర్ణయం

శ్రీనగర్, జూలై 27: పాకిస్థాన్ ప్రత్యేక సైన్యంతోపాటు ఉగ్రవాదులతో కూడిన 'బోర్డర్ యాక్షన్ టీమ్' (బ్యాట్ దళం) భారత ఆర్మీ పోస్టుపై చేసిన అకస్మాత్తు దాడిలో ఓ జవాను మృతి చెందగా, కెప్టెన్ సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలోని కామకారి సెక్టర్ వద్ద శనివారం ఈ దాడి జరిగింది. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఆర్మీ పోస్టుపై బ్యాట్ దళం ఒక్కసారిగా గ్రేనేడ్‌తో దాడి చేసి కాల్పులు జరిపింది. ఈ దాడిలో కెప్టెన్ సహా ఐదుగురు జవాన్లు గాయపడగా వారిని ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఓ జవాను ప్రాణాలు విడిచాడని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బ్యాట్ దళం చేసిన దాడికి ప్రతిగా భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఓ పాక్ చొరబాటుదారుడు మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మరోవైపు భారత్-పాక్ సరిహద్దు వెంబడి ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతను పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఒడిసాలోని మల్కాంగిరి నుంచి జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్వార్, కథువా, రియాసీ వెంబడి సరిహద్దుల్లోకి 2వేల మంది సరిహద్దు భద్రతా దళ సిబ్బందిని మోహరిస్తున్నట్లు పేర్కొంది.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ రెడ్డి / 2ND విడో (కుల/మత/ఆస్తి ప్రసక్తి లేదు / Qly: డిగ్రీ / Own House / Business / Land / Well settled గల అందమైన వధువుకి 1 లేదా 2వ వరుడు కావలెను. ఫోన్ : 9573002847 AJH-002444

★ కాపు / విడో Govt. 2nd మ్యారేజ్ (కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు : 45, కలర్ : తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-002444

★ 59y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT. ఫ్యామిలీ పెన్షనర్/ సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / వెల్ సెటిల్డ్ / ఏలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-4207

★ 60y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT.RTD పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / సొంత వ్యవసాయ భూమి / ఏలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 7995376608 AJH-4207

★ OC / కుల పట్టింపు లేదు / 43y/5'5" / సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / బెంగళూరు, మధ్య తరగతి వధువుకి Engineer / Doctor వరుడు కావలెను. డైరెక్ట్ : 9182734077 AJH-4207

★ రెడ్డి /రెండవ పెళ్ళి / 40y / కుల ప్రసక్తి లేదు / డిగ్రీ / Govt. Officer / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8125693527 AJH-4207

★ 2వ పెళ్ళి / విడో, విడోయర్, డైవర్సి (లీగల్ క్లియర్) లేట్ మ్యారేజ్, కుల, ఆస్తి కట్నం ప్రసక్తి లేని సంబంధాలకు సంప్ర : 9666498650 AJH-15767

★ బ్రాహ్మణ /27y/5'3"/ డిగ్రీ / Pvt. జాబ్ / అందమైన వధువుకు తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-15767

★ కుల ఆస్తి పట్టింపు లేదు / చౌదరి / 43y/5'6"/ డైవర్సీ / డాక్టర్ న్యూరాలజిస్ట్ / స్థిరాస్తులు కలిగిన అందమైన వధువుకు డాక్టర్ వరుడు కావలెను. వాట్సాప్ : 9703093607 AJH-002445

★ రెడ్డి / 2ND మ్యారేజ్ / కుల, మత, ఆస్తి పట్టింపు లేదు / Qly: డిగ్రీ / Height:5.4, Colour : Fair / బిజినెస్‌లు కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st or 2nd ఫోన్ : 9063774658 AJH-002444

★ బ్రాహ్మణ / 28y / 5'4" / 1st మ్యారేజ్ Qua:- Inter / Pvt. Job / Father & Mother (Late) 2nd మ్యారేజ్ also OK, పురోహితం also OK. వరుడు కావలెను. ఫోన్ : 7207552927 AJH-002444

★ కమ్మ /కుల ఆస్తి పట్టింపు లేదు/ 29y / 5'5" / 10 ఎకరాల ల్యాండ్ / వెల్ సెటిల్డ్ వధువుకి హిందూ రిలిజియస్ జాబ్ or బిజినెస్ / ఓన్ హౌస్ ఉన్న వరుడు కావలెను. వాట్సాప్ : 7288925874 AJH-002445

★ యాదవ్స్ (పూజ, ఎర్ర, ఆళ్ల) గొల్లలు. మొదటి సంబంధం, రెండవ పెళ్లి, (25 To 40) సం॥ రాలు, రెండవ పెళ్లివారికి పిల్లలు ఉన్నా పర్వాలేదు. సెల్ : 91103 29179 AJL_195763

★ కుల పట్టింపు లేదు/కమ్మ/ 2nd మ్యారేజ్ / 43y/5'6"/ డాక్టర్ కార్డియాలజి / మంచి ఆస్తి గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 8297532992 AJH-002445

★ తొగట వీరక్షత్రియ, రాజులు, వైశ్యాస్ : Age 25 To 45, 10 To డిగ్రీ చదివిన అమ్మాయిలకు సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ విడో / 55 సం./ గవర్నమెంట్ జాబ్ / మంచి జీతం / సొంత ఇల్లు / 40 సం. / డైవర్సీ / మంచి జీతం / SWE సంప్ర. : 8523840236 AJH-15768

★ ఆచారులు (విశ్వబ్రాహ్మణ్స్) : 1st మ్యారేజ్, 5.4., 10 To డిగ్రీ, వయస్సు 26 To 40 సం॥రాలు వారికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ ఉన్నవారు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ కాపు / 34y/ ఫెయిర్ / కుల పట్టింపు లేదు /Govt. ఎంప్లాయి / మంచి జీతం / వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి / 3 సొంత ఇండ్లు & బిజినెస్ కలిగిన వధువుకు వరుడు కావలెను. (1st, 2nd మ్యాచ్) ఫోన్: 9640133485 AJH-15768

★ నాయి(బ్రాహ్మణ్స్), రజక : మొదటి సంబంధం, 25 To 30 సం॥రాల అమ్మాయిలకు సొంత ఇల్లు ఉన్న వారికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ ఆస్తి, కుల పట్టింపు లేదు / రెడ్డి / విడో / 35y/5'3"/ మంచి ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సప్‌లో పంపించండి. ఫోన్ : 9133640971 AJH-15768

★ మున్నూరుకాపు : మొదటి సంబంధం, 25 To 32. సం॥రాలు, అలాగే రెండవపెళ్లి 30 To 50. సం॥రాలు ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ కుల, ఆస్తి పట్టింపు లేదు / విడో / 57 Y / Govt. జాబ్ / ఓన్ బిజినెస్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ, ఏలాంటి బాదరబందీ లేని వధువుకు వరుడు కావలెను. సంప్ర. 81253 36945 AJB-319

★ చౌదరి : మొదటి సంబంధం, 26 To 35 సం॥రాలు, 10 To బి.టెక్ చదివిన అమ్మాయిలకు ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ బలిజ : 27 సం॥రాలు, 1st మ్యారేజ్, 10 To డిగ్రీ, సొంత ఇల్లు, 2 ఎకరాల పొలం, ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ పద్మశాలి : వయస్సు 25 To 30., సం॥రాలు, 1st మ్యారేజ్, రెండవ పెళ్లి, వధువులకు సొంత ఇల్లు, బిజినెస్ ఉన్న వారికి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 91103 29179 AJL_195763

★ వాసవి ఆర్యవైశ్య వధువులకు వరులు కావలెను. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, విదేశాలు. Mob : 86673 25268 AJH-089882

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-4207

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి వైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-4207

★ ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల Govt / SWE / డాక్టర్స్ / NRI / బిజినెస్ / Pvt. / 2nd పెళ్ళి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం. ఫోన్ : 9866775306 AJH-15767

★ పద్మశాలి + అన్ని కులముల ఇంజనీర్లు, డాక్టర్లు, పీజీ, డిగ్రీ, ఇంటర్ ఉద్యోగ వ్యాపార మొదటి, రెండవ వధూవరులకై మీ పూర్తి & నగుము ఫోటో బయోడేటాతో కాకతీయ మ్యారేజెస్ హైదరాబాద్ & వరంగల్ వాట్సాప్‌కు పంపండి, సంప్ర: 9440170497 AJH-429

★ అన్ని కులాల వారికి : డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్స్ / బిజినెస్ / గౌట్ ఎంప్లాయిస్ & హై రిచెస్. 1వ, 2వ లేట్ దేశ /విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును సంప్ర : 9121010959 AJH-002445

★ కుల పట్టింపు లేదు (రెండో పెళ్ళి) 52 సం.లు 5.7/అ.ఉ ఎంప్లాయ్ (Own Business) గల వరునికి 40-60సం.లు గల ఏ బాదరబంది లేని విడో/డైవర్సీ వధువు కావలెను. అర్జంట్ (నో బ్రోకర్స్) డైరెక్ట్ సంప్ర: 89852 65986 AJK-197461

వధువు కావలెను



★ SC మాదిగ /B.Tech/Govt. బ్యాంక్ Asst/ మేనేజర్ / SBI / మంచి జీతం / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-15767

★ CNB / 54 Y / Retired / Fair / Good Salary / Own House / Want Educated Hindu Lady with No Issues. No Time Pass Calls. Direct : 8790357080 AJH-15768

★ వాసవి ఆర్యవైశ్య వధువులకు మొదటి లేదా రెండవ వివాహము (వరకట్నం వద్దు). Inter, Diploma, Degree, Engineer, Doctor, C.A, ఆర్య వైశ్య వరులు కలరు. నెలకి 1 లక్ష నుంచి 6 లక్షల వరకు ఆదాయం, ఆస్తులు కలవు. వధువుకు కొన్ని లక్షల వరకు ఆర్థిక సహాయము చేయబడును. K. Hari, Vasavi Matrimony. Mob: 86673 25268 AJH-089881

కళ్యాణ వేదిక

★ కావ్య మ్యారేజ్ లింక్స్ : 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును (ఫ్రీలకు ఫ్రీ). ఫోన్ : 8074670989 AJH-4207

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704655103 / 9494809254 (Whatsapp) AJH-4207

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com

EXCLUSIVE CHOWDARY COMMUNITY Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 30 Cr B.Tech MS 29 / 50 Cr. B.Tech MS 27 / 15 Cr. B.Tech MS 40 / 100 Cr. USA Doctor 34 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IIT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USA రెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 36 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 70 Cr MBA 29 Business / 50 Cr B.Tech 30 Business / 100 Cr B.Tech MS 29 Business / 50 Cr B.Tech 27 / 20 Cr B.Tech Business వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి 29 B.Tech MS USA / 42 B.Tech MS / 35 B.Tech MS India / 32 B.Tech MS USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA.28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 27 B.Tech Irland / 26 B.Tech MS UK / 27 CA India వధువుకి 25 to 45 USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA డాక్టర్స్ 33 Cardiologist / 29 Neurology / 28 Internal Medicine వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్లి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

అబ్దుల్ కలాంకు సీఎం నివాళి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్థంతి సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా, భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సబ్ కోర్టును ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. పార్టీ నేతలు, న్యాయవాదులతో కలిసి వినతి పత్రం సమర్పించారు.

నిధుల కోసం పోరాడకుండా మాపై విమర్శలా?

- రఘునందన్‌రావుపై మల్లు రవి ధ్వజం

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయకుండా తమపై విమర్శలు చేయడమేంటని బీజేపీ తెలంగాణ ఎంపీలను కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరగలేదంటూ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్రం నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం నుంచి ప్రజల్ని తప్పుదారి పట్టించేలా రఘునందన్‌రావు మాట్లాడుతున్నారని విమర్శించారు.

అక్రమ కేసులు ఎత్తేయండి.. సీపీఎం నేతల వినతి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలపైన, ఆర్టీసీ సమ్మె సందర్భంగా కార్మికులపైనా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసులను రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఎం నేతలు కోరారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

ఉన్నది ఒక్కణ్నే.. లక్షల మందికి ప్రతినిధిని

- అప్పులపై ప్రభుత్వం సమీక్ష చేయాలి: కూనంనేని

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : "నా ఒరిజినాలిటీ మీకు తెలియదు. నేనింకా నా నోరు విప్పలేదు.. నా జోలికి రావొద్దు." అంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసన సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతున్న సమయంలో ఉన్న ఒక్క సభ్యుడికి ఎంత సమయం ఇస్తారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్‌ను అడగ్గా కూనంనేని స్పందించారు. సభలో తాను ఉన్నది ఒక్కడినే అయినా.. తన నియోజకవర్గ ప్రజలతోపాటుగా లక్షల మందికి ప్రతినిధిని అని సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలు కూడా కాకముందే ప్రభుత్వం పని అయిపోయిందని మాట్లాడడం సమంజసం కాదన్నారు.

నేడు కల్వకుర్తిలో జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నాగర్‌కర్నూల్, ఆమనగల్లు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, దివంగత కాంగ్రెస్ నేత సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం కల్వకుర్తిలోని ఆయన కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పాల్గొననున్నారు. దానికి ముందు హెలికాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు కల్వకుర్తికి చేరుకోనున్న రేవంత్‌రెడ్డి బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ సభకు దాదాపు 25 వేల మందిని సమీకరించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. కాగా, ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్‌లోని జైపాల్‌రెడ్డి స్మారక స్థలిలో ఆయనకు నివాళిని అర్పించనున్నారు.

మరో ఐదేళ్లుంటే.. హైటెక్ సిటీనీ అమ్మేసేవారు

ఎన్నికల్లో ఓడతారని తెలిసే.. ఓఆర్ఆర్ ప్రైవేటుకు.. హామీలను గాలికొదిలేసి దోచుకున్నారు: భట్టి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందని, స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును, ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. మరో ఐదేళ్ల అధికారంలో ఉంటే హైటెక్ సిటీని కూడా అమ్మేసేదని అన్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు తర్వాత కూడా ఆ పార్టీకి బుద్ధి రాలేదన్నారు. శనివారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఆవిర్భావం తరువాత మాత్రమే హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని గత ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటు. అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రోరైలు, ఓఆర్ఆర్, హైటెక్ సిటీతో పాటు అనేక కీలక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించినవే. మా పాలనలో రాష్ట్రంలో భారీగా ఆస్తులు కూడబెడితే.. గత ప్రభుత్వం అమ్ముకుంది. ఎన్నికల్లో ఎలాగూ ఓడిపోతామని ఊహించే.. ఖజానాకు కీలకమైన ఓఆర్ఆర్‌ను ప్రైవేటు సంస్థలకు 30 ఏళ్ల లీజుకు కట్టబెట్టింది" అని భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. దీనిపై విచారణ జరిపిస్తామని, అవసరమైతే లీజు రద్దు చేసేందుకూ వెనుకాడబోమని అన్నారు. 2014కి ముందు హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న చెరువులన్నీ గత పదేళ్లలో కబ్జాకు గురయ్యాయన్నారు. ఆక్రమణలపై వివరాలు సేకరిస్తున్నామని, అన్నిటిపైనా విచారణ జరిపిస్తామని, బాధ్యులను వదలబోమని స్పష్టం చేశారు.

పదేళ్లలో వాగ్దానాల అమలు ఎక్కడ..?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంకెల గారడీ భ్రమలు లేవని భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చేందుకు వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని, తెలిపారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా పూర్తి చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. దళితుడికి ముఖ్యమంత్రి పదవి, దళిత కుటుంబానికి మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్యాసంస్థలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేసి ఉంటే ఆ వర్గాల ప్రజల జీవితాలు ఎప్పుడో మారిపోయేవన్నారు. ఇందిరా క్రాంతి పథకాన్ని పట్టించుకోలేదని, మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని అన్నారు. తమ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇప్పించాలని ముందుకెళుతోందని చెప్పారు. నాలుగు నెలల్లోనే 32,410 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని, మరో 35 వేల ఉద్యోగాలకు పోటీ పరీక్షలు నిర్వహించడానికి ప్రక్రియ నడుస్తోందని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని, భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇచ్చేందుకు బడ్జెట్లో ప్రతిపాదించామని పేర్కొన్నారు.

మరో 20 ఏళ్లు అధికారం మాదే..

తాము ఐదేళ్ల ఆషామాషీగా అధికారంలో ఉండడానికి రాలేదని, ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తూ మరో 20 ఏళ్లపాటు అధికారంలో ఉంటామని డిప్యూటీ సీఎం అన్నారు. ఐటీఐలను టాటా సంస్థతో ఒప్పందం చేసుకొని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్‌గా మారుస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలవబోతోందని చెప్పారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ విద్యా వ్యవస్థను తయారు చేస్తున్నామన్నారు. ఒకటి నుంచి మూడు తరగతి వరకు అంగన్వాడీ కేంద్రాలలో, నాలుగు నుంచి ఆ పైస్థాయి తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం బోధనలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలా కాకుండా ఇప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు సచివాలయంలోనే ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు పనిచేస్తున్నారని, ప్రతీ శాఖపై సమీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తయారుచేసి ఇన్‌చార్జి మంత్రులకు అప్పగిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, ఇకపై అలా జరగకూడదనే రైతు భరోసా అంశాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లామని చెప్పారు.



సభా పర్వం

గత బడ్జెట్లన్నీ అంకెల గారడీలే..

బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 నుంచి 2023 వరకు ప్రవేశపెట్టిన బడ్జెట్లన్నీ వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నవేనని భట్టివిక్రమార్క అన్నారు. తాము బీఆర్ఎస్ పెట్టిన బడ్జెట్ కన్నా రూ.600 కోట్లు మాత్రమే అదనంగా పేర్కొన్నామని తెలిపారు. గతంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో కేంద్రం నుంచి సరైన నిధులు రాష్ట్రానికి రాలేదని చెప్పారు. తాము రాష్ట్రం నుంచి ఇవ్వాల్సిన వాటా నిధులు ఇస్తామని, కేంద్రం నుంచి తీసుకురావాల్సిన నిధులు సాధిస్తామని స్పష్టం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ.600 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెడితే తాము చెల్లించామన్నారు. ఆసరా పింఛన్ల నిధులను ప్రతినెలా విడుదల చేస్తున్నామని తెలిపారు. టాక్స్ రెవెన్యూ విషయంలో 35 వేల కోట్లు రాబడులు ఎట్లా తెస్తారన్న ఆందోళన అవసరం లేదని, రాబడులు ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసునని వ్యాఖ్యానించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం పౌరసరఫరాల శాఖలో రూ.500 కోట్ల బకాయిలను వసూలు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతోపాటు ఎఫ్‌సీఐలో పెండింగ్‌లో ఉన్న రూ.3561 కోట్లను రాబట్టుకున్నామని చెప్పారు. 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, దరఖాస్తుదారుల నుంచి అప్లికేషన్ ఫీజు తీసుకుని వాడుకుని.. ఏ నిర్ణయమూ తీసుకోకుండా గాలికి వదిలేశారని ఆరోపించారు.

త్వరలో రేషన్‌కార్డుల పంపిణీ..

మార్గదర్శకాలు తయారు కాగానే త్వరలోనే రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. చార్మినార్ పాదచారుల ప్రాజెక్టును తప్పకుండా పూర్తిచేస్తామని, మూసీ నదిని అభివృద్ధి చేసి హైదరాబాద్ నగరం అంటే ఏంటో ప్రపంచానికి చూపిస్తామని చెప్పారు. మైనారిటీలకు రూ.3 వేల కోట్లు కేటాయించి హిందువులను విస్మరించారంటూ కొందరు నేతలు విధంగా మత వైషమ్యాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేయడం తగదన్నారు. వారిని ఈ ప్రభుత్వం క్షమించదన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.100 కోట్లు, బోనాలకు రూ.25 కోట్ల రూపాయలు ఇచ్చామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని స్పష్టం చేశారు. ఈ సమయంలో.. భట్టివిక్రమార్క ప్రసంగానికి బీఆర్ఎస్ సభ్యులు అడ్డుపడటంతో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారు. "కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై చర్చకు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదని తాము ప్రశ్నిస్తే.. ఆయన సభకు రారు. మేమే వస్తామని హరీశ్‌రావు, కేటీఆర్ బదులిచ్చారు. దీంతో వాళ్లిద్దరు కలిసి తన పదవికి ఎసరు తెస్తారేమోనని కేసీఆర్ ఆందోళన చెందినట్లున్నారు. అందుకే మరుసటి రోజు అందరికంటే ముందే వచ్చి సభలో కూర్చున్నారు" అని సీఎం వ్యాఖ్యానించారు. దీనిపై సభలో దుమారం రేగింది.

లోకం తీరు



పంచాయతీ ఎన్నికలకు

కసరత్తు షురూ..!

- ఆగస్టు 2, 3 తేదీల్లో ఓటరు జాబితాపై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ..

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ప్రాథమిక కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ప్రారంభించింది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేయడంపై ఆగస్టు 2, 3 తేదీల్లో జిల్లాల వారీగా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకుగాను ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్ల పేర్లతో జాబితాను ఈనెల 31వ తేదీ లోపు మెయిల్ ద్వారా పంపాలని కలెక్టర్లకు సూచిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను తీసుకొని.. అందులోని వివరాల ఆధారంగా త్వరలోనే గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని వెల్లడించారు. ఈ జాబితా రూపకల్పనపై ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆగస్టు 2న శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఆపరేటర్లకు మూడో తేదీన శిక్షణ ఉంటుందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

దశ దిశలేని కాంగ్రెస్ పాలన

వాస్తవాల విస్మరణ.. అవాస్తవాల విస్తరణలా బడ్జెట్

- ఆరు గ్యారెంటీలకు కేటాయింపులేవి?
- రుణమాఫీపై పూటకో మాట చెబుతున్నారు
- ఎక్సైజ్ ఆదాయం పెరగడానికి ఏం చేస్తారు?
- భూముల అమ్మకంలో ద్వంద్వ వైఖరి: హరీశ్

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశ దిశ లేని పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా.. ఒక విజన్, విషయం లేకుండాపోయిందని విమర్శించారు. ఎంతసేపూ బీఆర్ఎస్‌ను నిందించడమే పనిగా పెట్టుకున్నారని, తమ పేరు చెప్పుకొని ఎన్ని రోజులు బతుకుతారని మండిపడ్డారు. శనివారం శాసన సభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక ఆదాయ-వ్యయ పట్టికపై సాధారణ చర్చను బీఆర్ఎస్ తరపున హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బీఆర్ఎస్‌ను తిట్టిపోసేలా, రాజకీయ కరపత్రంలా బడ్జెట్ ఉంది. ఫార్ములేషన్ ఆఫ్ పాలసీ కన్నా హ్యూమిలియేషన్ మీదే దృష్టి పెట్టారు" అని విమర్శించారు. 2014లో తలసరి ఆదాయంలో తెలంగాణ 11వ స్థానంలో ఉంటే.. పదేళ్ల పాలన ఫలితంగా అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రూ.4 లక్షలు లేని జీఎస్‌డీపీని రూ.14 లక్షలకు తీసుకెళ్లామని, అన్ని రంగాలకు సరిపడా కరెంట్ ఇచ్చామని తెలిపారు. గతంలో సీఎం, మంత్రుల మీటింగ్ జరుగుతుంటే పోలీసులు రక్షణగా ఉండేవారని, కానీ.. ఇప్పుడు కరెంటు వాళ్లు జనరేటర్లతో కాపలా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక రూ.4 వేల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ నాలుకపై మాత్రమే ఉందని హరీశ్‌రావు అన్నారు. వాస్తవాల విస్మరణ, అవాస్తవాల విస్తరణలా బడ్జెట్ ఉందన్నారు. "2023-24లో కేంద్రం నుంచి రూ.9729 కోట్ల గ్రాంట్లు వస్తే.. ఈ బడ్జెట్‌లో రూ.21,636 కోట్లు పెట్టారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి అదనంగా రూ.12 వేల కోట్లు ఏ విధంగా వస్తాయని పెట్టారు?" అని ప్రశ్నించారు.

రియల్ ఎస్టేట్ రంగం కుదేలు..

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయిందని హరీశ్‌రావు ఆరోపించారు. "రిజిస్ట్రేషన్ల ఆదాయం గతేడాది రూ.14,295 కోట్లు వస్తే.. ఈ ఏడాది రూ.18,225 కోట్లు వస్తుందని పెట్టారు. ఎలా వస్తుంది? ఎక్సైజ్ ఆదాయం 2023-24లో రూ.19,784 కోట్లు వచ్చింది.. 2024-25లో రూ. 24వేల కోట్లు ఎక్సైజ్ ఆదాయం వస్తుందని చూపించారు. ఆ రోజు గ్రామానికో బెల్ట్‌షాపు పెట్టామని మీరే చెప్పారు. ఇప్పుడు గల్లీకో బెల్టు షాపు పెడతారా? రూ.24 వేల కోట్లను భూముల అమ్మకం ద్వారా సాధిస్తామని బడ్జెట్‌లో పెట్టారు. అదనంగా రూ.14 వేల కోట్లను సమీకరిస్తామని చెప్పారు. గతంలో భూముల అమ్మకం వద్దని మీరే చెప్పారు. ఇదేం ద్వంద్వ వైఖరి?" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 6,71,757 కోట్లు అప్పు చేసిందని పదే పదే అంటున్నారని, అయితే.. అప్పులు మాత్రమే కాకుండా తాము సృష్టించిన ఆస్తులు కూడా చూడాలని హరీశ్‌రావు అన్నారు. "ప్రభుత్వం కట్టాల్సిన అవసరం లేని అప్పులు తీసేస్తే.. మిగిలే అప్పు రూ.5,16,881 కోట్లు మాత్రమే. రాష్ట్రం ఏర్పడే నాటికి వారసత్వంగా సంక్రమించిన అప్పు, తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీల ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు.. అన్నీ తీసివేస్తే మేం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమే. పైగా డిస్కమ్‌ల అప్పులు రూ.9 వేల కోట్లు అదనంగా పడ్డాయి. కానీ, తొమ్మిదిన్నరేళ్ల కాలంలో రూ.లక్షల కోట్లు ఆస్తులను కూడా సమకూర్చామనే వాస్తవాలను గుర్తించాలి" అని హరీశ్‌రావు అన్నారు.



కాంగ్రెస్ అంటేనే ధోకా పార్టీ

కాంగ్రెస్ పార్టీ అంటేనే పెద్ద ధోకా పార్టీ అని హరీశ్‌రావు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో పలు ధోకాలు చేసిందని ఆరోపించారు. ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు రూ.53 వేల కోట్లు పెట్టి తాజా బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లకు తగ్గించారన్నారు. మహాలక్ష్మి పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకంలో అనేక ఆంక్షలు పెట్టారని విమర్శించారు. మొదట్లో వరి, పత్తి, పసుపు వంటి పంటలన్నింటికీ రూ.500 చొప్పున బోనస్ ఇస్తామన్నారని, కానీ ఇప్పుడు సన్న వడ్లకే అంటున్నారని తెలిపారు. బీసీలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారని, కానీ.. ఈ బడ్జెట్‌లో రూ.9 వేల కోట్లు మాత్రమే పెట్టారని అన్నారు. రాష్ట్రంలో 14 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఊసే లేదని ధ్వజమెత్తారు. బడే భాయ్ (మోదీ) బాటలోనే.. చోటే భాయ్ (రేవంత్) నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ముస్లింలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లేరని, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏల మాట లేదని విమర్శించారు.

అదనపు వనరుల సమీకరణలో గోప్యమెందుకు?

బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా ప్రభుత్వానికి అదనంగా పన్నేతర ఆదాయం రూ.11,389 కోట్లు ఏ విధంగా సాధ్యమవుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో పూటకో మాట చెప్పారని విమర్శించారు. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామని చెప్పి.. 8 నెలల వడ్డీని రైతులే కట్టుకోవాలని చెప్పడం దుర్మార్గమన్నారు. బతుకమ్మ చీరలను కట్టుకోకుండా పంట పొలాల్లో కడుతున్నారంటూ చేసిన వ్యాఖ్యలపై మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2 వాయిదా వేయాలని కోరిన వారిని సీఎం సన్నాసులు అని అన్నారని, తిరిగి ఎలా వాయిదా వేశారని ప్రశ్నించారు. సీఎం స్థాయిలో బాధ్యతాయుతంగా మాట్లాడాలన్నారు. తాము మాట్లాడేటప్పుడు టీవీ స్క్రీన్‌లో చూపించడం లేదని ఆక్షేపించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోక్యం చేసుకుంటూ.. పదేళ్ల రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, నెలనెలా ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. ఇప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పెట్టామని, బడ్జెట్‌ను ప్రజలంతా హర్షిస్తుంటే హరీశ్‌రావుకు కంటగింపుగా మారిందని అన్నారు. బడ్జెట్ వినడానికి వచ్చిన ప్రతిపక్ష నేత కేసీఆర్.. సభకు వచ్చి మాట్లాడాల్సిందిపోయి రాకుండా బాధ్యత లేకుండా పోయారని విమర్శించారు. ఎక్సైజ్‌లో దొరికినంత దోచుకున్నారని, టానిక్ లాంటి షాపులు పెట్టి, వేలం ద్వారా కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కొద్దిమందికి వచ్చేలా చేశారని ఆరోపించారు.

ఫార్మాసిటీ ఇక నెట్ జీరో సిటీ

- కర్బన ఉద్గార రహిత నగరంగా అభివృద్ధి
- 1న అక్కడే స్కిల్ వర్సిటీ.. నేడు స్థల పరిశీలనకు రేవంత్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ శివారుల్లో అద్భుత నగర నిర్మాణానికి ప్రణాళికలు చేస్తోంది. కాలుష్య రహితం, శత శాతం కర్బన ఉద్గారాల రహితంగా 'నెట్ జీరో సిటీ' నిర్మాణం చేయనుంది. ఫార్మాసిటీ కోసం గతంలో సేకరించిన భూముల్లోనే ఈ నగరాన్ని నిర్మించనుంది. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం దాదాపు 19వేల ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించగా ఇప్పటిదాకా 12వేల ఎకరాలకుపైగా భూమిని సేకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఫార్మాసిటీని ఒకే ప్రాంతంలో కాకుండా నగరం చుట్టూ క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో మల్టీమోడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు సన్నాహకాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే ఈ ప్రాంతంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుంది. ఇప్పుడే ఇదే ప్రాంతాన్ని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేయనుంది. కాగా ఏదైనా ఓ ప్రాంతాన్ని వంద శాతం కాలుష్య కర్బన ఉద్గార రహితంగా తీర్చిదిద్దడాన్ని నెట్ జీరో సిటీ అంటారు. ఆ ప్రాంతంలో వెలువడే కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్ హౌస్ వాయువులను పూర్తిగా పీల్చుకునేలా చుట్టుపక్కల వృక్ష సంపదను పెంచి కాలుష్య రహితంగా మారుస్తారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో న్యూయార్క్ సహా ప్రపంచవ్యాప్తంగా 25 నగరాలు నెట్ జీరో సిటీలుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'తెలంగాణ నైపుణ్య విద్యాలయం' (స్కిల్ యూనివర్సిటీ) ఏర్పాటు పనులు చకచక సాగుతున్నాయి. నగర శివారుల్లో గతంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లోనే ఈ వర్సిటీ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేశారు. అమెజాన్ డేటా సెంటర్ పక్కన ఉన్న దాదాపు వంద ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ స్థల పరిశీలనకు ఆదివారం కందుకూరు వస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆగస్టు 1న స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేయనున్నారని సమాచారం.యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఏటా 20 వేల మందికి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.

వైద్య శాఖ బదిలీలపై

విజిలెన్స్ విచారణ

హెల్త్ సెక్రటరీకి మంత్రి దామోదర ఆదేశాలు

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల బదిలీల్లో భారీ అవినీతి జరిగిందని మీడియాలో కథనాలు రావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడిన వారు ఏ స్థాయి ఉద్యోగైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కాగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారి జాబితాలో 600 మంది స్టాఫ్ నర్సులు ఉండగా వారిలో 250 మందికే అధికారులు స్థాన చలనం కల్పించారు. మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే బదిలీల ప్రక్రియను ముగించారు. దీంతో పెద్ద సంఖ్యలో స్టాఫ్ నర్సులు డీహెచ్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ఈ నెల 30న హెడ్ నర్సుల బదిలీలకు కౌన్సెలింగ్ జరగనుండగా...హెడ్ నర్సుల జాబితాలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు ల్యాబ్ టెక్నిషియన్(ఎల్టీ) గ్రేడ్-2 బదిలీల్లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని ఎల్టీలు ఆరోపిస్తున్నారు. 95 శాతం అభ్యర్థులు వారు ఎంచుకున్న ప్రాంతం కాకుండా సుదూర ప్రాంతాలకు అధికారుల ఇష్టానుసారంగా బదిలీ చేశారని తెలిపారు. ఈ బదిలీలపై రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని లేని పక్షంలో సమ్మెకు దిగుతామని ఎల్టీలు హెచ్చరిస్తున్నారు.

నీతి ఆయోగ్ సమావేశాన్ని

రేవంత్ బహిష్కరించడం సరికాదు

- ఆ నిర్ణయం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే..
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



మాట్లాడుతున్న ప్రహ్లాద్ జోషి, చిత్రంలో ఈటల

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ సమావేశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బహిష్కరించడం సరికాదని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా నీతి ఆయోగ్ పనిచేస్తుందని, ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఏవైనా ప్రస్తావించడానికి ముఖ్య వేదిక నీతి ఆయోగ్ సమావేశమన్నారు. 'ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలయిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు అవసరం లేదు. అభివృద్ధి, ప్రగతి కావాలి. ఇంతకుముందు బీఆర్ఎస్ ఇలాగే రాజకీయాలు చేస్తే రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారు' అని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బిహార్ రాష్ట్రాల పేర్లే ఉన్నాయన్న కాంగ్రెస్ విమర్శపై ఆయన మాట్లాడుతూ.. 2009లో యూపీయే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యూపీ, బిహార్‌ల పేర్లు మాత్రమే ఉన్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో మిగతా రాష్ట్రాల పేర్లు లేనంత మాత్రాన వాటికేమీ చేయడం లేదన్నట్లు కాదన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతానికి పన్నుల బదలాయింపు రూపేణా రూ.18.50లక్షల కోట్లు రాగా 2014 నుంచి 2023 వరకు తెలంగాణకు రూ.69.60లక్షల కోట్లు వచ్చాయని, ఈ లెక్కన 276శాతం పెరుగుదల ఉందని ఆయన వివరించారు. నగరాలకు సమీపంలో కూరగాయల ఉత్పత్తికి ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు.

మేడిగడ్డ బరాజ్‌ను ఒకరిద్దరు మంత్రులు

ఏమైనా చేయగలరు

- వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయో మాకు తెలుసు: కేటీఆర్



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): "మేడిగడ్డ బరాజ్ పిల్లర్ల కుంగుబాటులో కాంగ్రెస్ కుట్ర ఉందనే అనుమానాలున్నాయి. లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా చెక్కుచెదరని బరాజ్‌కు ఎన్నికల ముందే ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇకపై ఆ బరాజ్‌కు ఏం జరిగినా ఈ ప్రభుత్వ కుట్ర ఫలితమేనని భావించాల్సి ఉంటుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ఎల్పీలో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకరిద్దరు మంత్రులకు ఎవరితో సంబంధాలున్నాయో తెలుసునని, వారు బరాజ్‌ను ఏమైనా చేయగలరని ఆరోపించారు. 28 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని కూడా తట్టుకున్న మేడిగడ్డ బరాజ్‌పై తప్పుడు నివేదికలు ఇవ్వడం సరికాదని, అది ఎన్‌డీఎస్ఏ రిపోర్టు కాదని, ఎన్డీయే రిపోర్టని మండిపడ్డారు. కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపించాలనుకుని కాంగ్రెస్ ప్రభుత్వమే విఫలమైందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి ప్రభుత్వం నీటిని ఎత్తిపోయకపోతే బీఆర్ఎస్ తరఫున తామే ఆ పని చేస్తామని ప్రకటించడంపై కేసీఆర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎం సోదరులు కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి ఏం చేస్తున్నారో తమకు తెలుసునని, సమయం వచ్చినప్పుడు అన్నీ బయటపెడతామని హెచ్చరించారు. సీఎం చుట్టూ ఉండే ఉదయసింహ, ఫహీమ్ ఖురేషి, అజిత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి తెలంగాణలో షాడో క్యాబినెట్ నడుపుతున్నారని విమర్శించారు. ఉదయ్ స్కీం పత్రం చూపించి మోటార్లకు మీటర్లకు సంబంధించిన ఒప్పందం అంటూ మభ్యపెడుతున్నారన్నారు. కాళేశ్వరం నిర్మాణం, బతుకమ్మ చీరల పంపిణీలోనూ సీఎం రేవంత్ రెడ్డికి స్కామ్‌లు కనబడుతున్నాయని తప్పుబట్టారు. బతుకమ్మ చీరలే కాదని, తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేటిపైనైనా విచారణ జరుపుకోవచ్చని సవాల్ చేశారు. పేర్లు మార్చడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఎల్అండ్‌టీ గురించి అసెంబ్లీలో సీఎం మాట్లాడిన తీరు బాగోలేదని తప్పుబట్టారు. ధరణి స్థానంలో ఏది వచ్చినా భూమేతే అవుతుందని, ఎక్కడేం జరుగుతుందో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. పలు రాష్ట్రాల్లో మెట్రో నిర్మాణానికి రూ.వేల కోట్ల నిధులిచ్చిన ఎన్డీయే ప్రభుత్వం.. బీజేపీకి 8 ఎంపీ సీట్లిచ్చిన తెలంగాణకు మొండి చేయి చూపిందని విమర్శించారు.

ఉపాధిహామీపై రాష్ట్ర ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది: దుద్దిళ్ల



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఒప్పించి వ్యవసాయానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనుసంధానం చేయిస్తే మంచిదని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మతాలు, కులాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు.

బీఆర్ఎస్ పాలనలో కార్పొరేషన్ చైర్మన్‌కూ ఆసరా పింఛను: సీతక్క



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగిగా పదవీ విరమణ చేసి ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారికీ గత ప్రభుత్వ హయాంలో ఆసరా పింఛను ఇచ్చారని మంత్రి సీతక్క ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ఓ కార్పొరేషన్ చైర్మన్ కూడా ఆసరా పింఛను పొందారని ఆమె చెప్పారు. శనివారం అసెంబ్లీలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పింఛన్ల జాప్యం గురించి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలన జరిపి రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది అనర్హులను గుర్తించిందని తెలిపారు. అనర్హులను గుర్తిస్తున్న నేపథ్యంలోనే కొంత ఆటంకం ఏర్పడిందని ఆమె చెప్పారు.

అసెంబ్లీలో తొడగొట్టిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తొడగొట్టారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీ లో మాట్లాడిన రామ్మోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ప్రభుత్వాన్ని పడగొడతామంటే.. మేం తొడగొడతాం" అంటూ కుడి కాలు లేపి తొడగొట్టారు. ఇదిలా ఉండగా, రామ్మోహన్‌రెడ్డి బడ్జెట్‌పై సుదీర్ఘంగా మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఎంత మొత్తుకున్నా ఆపలేదు. మంత్రి శ్రీధర్‌బాబు.. తన స్థానం నుంచి రెండు సార్లు లేచి రామ్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి ప్రసంగం ముగించాలని చేయి తట్టి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా ప్రసంగాన్ని కొనసాగించటంతో సభలో నవ్వులు విరిశాయి. జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని, ప్రతిపార్లమెంటు స్థానానికి ఒక జిల్లా చొప్పున రాష్ట్రంలో 17 జిల్లాలు ఉంటే సరిపోతాయని రామ్మోహన్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.

వికారాబాద్‌ను రంగారెడ్డిలో కలపాలంటారా?

- స్పీకర్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు స్థానానికొక జిల్లా చొప్పున రాష్ట్రంలో 17 జిల్లాలు ఉంటే చాలన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత స్పందిస్తూ.. "వికారాబాద్ జిల్లా ఏర్పాటు అవసరం లేదన్నట్లుగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. వికారాబాద్ శాసనసభ్యునిగా మీ అభిప్రాయం కూడా అదేనా.. వికారాబాద్‌ను రంగారెడ్డి జిల్లాలో కలపాలంటారా" అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రశ్నించారు. వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు జోక్యంచేసుకొని.. "మీరు స్పీకర్‌ను ఎలా అడుగుతారు? స్పీకర్ చెయిర్‌ను ఉద్దేశించి ఎలా ప్రశ్నిస్తారు? చర్చలోకి స్పీకర్‌ను లాగొద్దు" అని సబితకు సూచించారు.

మంత్రసాని పని కూడా కాంగ్రెస్‌కు చేతకాలేదు

- మీడియాతో చిట్‌చాట్‌లో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఉమ్మడి ఏపీని కాంగ్రెస్ సరిగా విభజన చేయలేకపోవడంతో పదేళ్లు గడచినా ఇప్పటికీ పలు సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. మంత్రిసాని కాన్పు చేస్తే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని, కాంగ్రెస్‌కు అది కూడా సాధ్యం కాలేదన్నారు. రాజకీయాల్లో తనకు సీఎం రేవంత్ రెడ్డి ఆదర్శమని, ఆయన సీఎం కావాలని లక్ష్యం పెట్టుకుని సాధించారన్నారు. తాను ఎమ్మెల్యే కావాలన్న లక్ష్యం సాధించానని, తదుపరి లక్ష్యం హోం మంత్రి కావడమేనన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిజామాబాద్ జిల్లా ఆడపడుచు అని, ఆమె జైలు నుంచి విడుదల కావాలని కోరుకుంటున్నాని ఆయన చెప్పారు.

మీడియా పాయింట్ వద్దకు నేతలకు నో ఎంట్రీ

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శాసన సభ జరుగుతున్న సమయంలో ఏ పార్టీ నాయకులు కూడా మీడియా పాయింట్ వద్దకు వెళ్లి మాట్లాడేందుకు అవకాశంలేదని స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు అమల్లోకి తెచ్చారు. శనివారం మధ్యాహ్నం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య .. సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించేందుకు మీడియా పాయింట్‌కు రాగా అక్కడున్న పోలీసు అధికారులు అనుమతించలేదు. ఆయన అనుచరులు ప్రభుత్వ విప్ అని చెప్పినా.. సమావేశాలు జరిగే సమయంలో ఎవరైనా మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు వీల్లేదంటూ స్పష్టమైన ఆదేశాలున్నాయని అధికారులు చెప్పడంతో ఐలయ్య తిరిగి సభకు వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికే సీపీఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య తదితరులు అసెంబ్లీ ఆవరణలో సీఎంను కలిసి ఆ వివరాలు మీడియాకు వెల్లడించేందుకు మీడియా పాయింట్‌కు వచ్చారు. వారిని కూడా అధికారులు వెనక్కిపంపారు.

అసెంబ్లీలో అధ్వానంగా మరుగుదొడ్లు

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. వాటి నిర్వహణలో లోపంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. వినియోగించేందుకు టాయిలెట్‌కు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉండడంతో పాటు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా మీడియా పాయింట్ పక్కన ఉన్న మరుగుదొడ్డిలో మూత్రం విసర్జించేందుకు మొత్తం మూడు కమోడ్‌లు ఉండగా, వాటిలో ఒకటి పూర్తిగా బ్లాక్ అయింది. దాంతో మూత్రం మొత్తం కమోడ్‌లోనే నిలిచిపోయింది. రెండ్రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని, అధికారులు వాటిని శుభ్రం చేయించడంలేదని అక్కడున్న కొంతమంది సిబ్బంది చర్చించుకుంటున్నారు. మరోవైపు మీడియా గ్యాలరీలోకి వెళ్లే మెట్ల కింద ఉన్న బాత్రూమ్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి ఆ బాత్రూమ్ నుంచి వచ్చే దుర్వాసన ఇబ్బందిగా మారింది.

తెలంగాణకు ఐపీఎస్‌ల పెంపులో జాప్యం

- 29 మందిని పెంచాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్రం
- చర్యలు చేపట్టాలని కేంద్ర హోంమంత్రి చెప్పినా జాప్యం
- నెలలు గడిచినా వెలువడని నిర్ణయం

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఐపీఎస్‌ల పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు ఐపీఎస్‌ల అవసరాన్ని స్వయంగా వివరించారు. రాష్ట్ర అవసరాల నిమిత్తం కొత్తగా 29 మంది ఐపీఎస్‌లను పెంచాలని కోరారు. సీఎం సమక్షంలోనే సంబంధిత అధికారులకు షా ఫోన్ చేసి ఈ విషయంలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా... తెలంగాణకు ఐపీఎస్‌ల కేటాయింపు విషయంలో కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో అందుబాటులో ఉన్న 211 మంది ఐపీఎస్‌లలో తెలంగాణకు 92 మంది, ఆంధ్రప్రదేశ్‌కు 119 మందిని కేంద్రం తాత్కాలికంగా కేటాయించింది. ప్రస్తుతం తెలంగాణ ఐపీఎస్‌ల క్యాడర్ స్ట్రెంత్ 112గా ఉంది. కొత్త జిల్లాల ఏర్పాటు, శాంతి భద్రతల పరిరక్షణ, ఇతర అవసరాల నేపథ్యంలో మరో 29 మంది ఐపీఎస్‌లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తాజాగా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఐపీఎస్ క్యాడర్ పోస్టులు పెంచుతూ కేంద్రం శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో తెలంగాణ ఐపీఎస్‌ల పెంపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏపీలో ప్రస్తుతం 144 మంది ఐపీఎస్ క్యాడర్ పోస్టులు ఉండగా కేంద్రం 174కు పెంచింది. రాజకీయ పరస్పర సహకారం, అవసరాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తమకు అవసరమైన రాష్ట్రాలకు సహాయం చేయడం సరైందే అయినప్పటికీ తెలంగాణ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెలువర్చకపోవడం సహేతుకం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మీటర్లపై మోసం!

(మొదటిపేజీ తరువాయి)

సభలో బుకాయించడం సమంజసం కాదని తప్పుబట్టారు. త్రైపాక్షిక ఒప్పందం వివరాలను సభలో బయటపెట్టారు. "సభను, సభ్యులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాన్ని హరీశ్‌రావు చేస్తున్నారు. మోటార్లకు మీటర్ల విషయంలో వాళ్లేదో కేంద్రంతో నిలబడి కొట్లాడినట్లు మాట్లాడుతున్నారు. ఇది అబద్ధం. ఆరు నెలల్లోగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు బిగిస్తామంటూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర డిస్కంలు 2017 జనవరి 4న త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నాయి. ఉజ్వల్ డిస్కం అస్యూరెన్స్ యోజన (ఉదయ్)లో భాగస్వాములయ్యాయి. మొత్తం 28 పేజీల అగ్రిమెంట్‌లో ఏడో పేజీలో ఈ విషయం స్పష్టంగా ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, సదరన్ డిస్కం తరపున రఘుమా రెడ్డి, నార్త్ డిస్కం తరపున ఎ.గోపాలరావు, కేంద్ర విద్యుత్తు శాఖ తరపున సంయుక్త కార్యదర్శి డాక్టర్ అరుణ్‌కుమార్ వర్మ సంతకాలు పెట్టారు. 2017 జూన్ 30లోపు అన్ని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు; 2018 డిసెంబరు 31లోపు 500 యూనిట్లకుపైగా విద్యుత్తును వినియోగించే వినియోగదారుల ఫీడర్ల వద్ద, 2019 డిసెంబరు 31లోపు 200 యూనిట్లకుపైగా వినియోగించుకునే వారి ఫీడర్ల వద్ద స్మార్ట్ మీటర్లు బిగిస్తామని ఒప్పందంలో రాశారు. అంటే.. గృహ, వ్యవసాయ వినియోగదారులు వినియోగించే విద్యుత్తుకు నూటికి నూరు శాతం మీటర్లు బిగిస్తామని సుస్పష్టంగా ప్రధాని మోదీ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు" అని వెల్లడించారు. ఉదయ్ ఒప్పందం, అందులోని కీలక అంశాలను ప్రస్తావించారు. 2017 జూన్ 30వ తేదీకల్లా అన్ని ఫీడర్లకు మీటర్లు పెట్టాలని, 2018 మార్చి 31వ తేదీలోపు గ్రామీణ ప్రాంతాల్లో 11 కేవీ స్థాయి దాకా విద్యుత్ లెక్కలు తీయాలని అందులో ఉందని తెలిపారు. త్రైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేసింది వాస్తవమా...? కాదా...? అని నిలదీశారు. సభకు వెంటనే హరీశ్ రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కూడా సభలో చెప్పలేదని తప్పుబట్టారు. "ఈ ఒప్పందం అమలు చేయకపోతే, స్మార్ట్ మీటర్లు పెట్టకపోతే కేంద్ర ప్రభుత్వం డిస్కమ్‌లపై చర్యలు తీసుకునే అవకాశాలుంటాయి. ప్రస్తుతం డిస్కమ్‌ల మెడపై కత్తి వేలాడుతోంది. ఇది గత ప్రభుత్వం చేసిన దుర్మార్గం. ఆ ఒప్పందాలు తెలంగాణకు గుదిబండగా మారాయి. వాళ్లు, వీళ్లు ప్రేమించుకున్నప్పుడు సంతకాలు పెట్టుకున్నారు. అప్పుడు తెలంగాణ ప్రయోజనాలు కనిపించలేదు. ఎన్నికలు దగ్గరికి వచ్చినప్పుడు రైతులు ఉరి వేస్తారని వాస్తవాలు దాచిపెట్టారు" అని ఆక్షేపించారు. ఉదయ్ ఒప్పందాన్ని డిస్కమ్‌లు అమలు చేయక తప్పని పరిస్థితిని కల్పించారని మండిపడ్డారు. వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టాల్సిన అనివార్య పరిస్థితి వచ్చిందని, దీనికి బీఆర్ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే, పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చిందని, రేపు పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్లు కూడా కాలేరని వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజానికి ఈరోజు స్పష్టమైన వివరాలు ఇస్తున్నానని, మోదీతో ఆనాటి సీఎం కేసీఆర్ ఒప్పందం చేసుకున్నది వాస్తవమని స్పష్టం చేశారు. అయినా.. హరీశ్ సభలో అబద్ధాలు చెబుతున్నారని, రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. సదరు ఒప్పందం కాపీలను హరీశ్‌కు ఇస్తామని చెబుతూ వాటిని పంపించారు. తలకిందులుగా తపసు చేసినా రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



అమ్ముకున్న లెక్కలూ చెప్పాలి

"అప్పుల లెక్కలే కాదు.. అమ్ముకున్న లెక్కలు కూడా చెప్పాలి. మేం ఇది కట్టినం.. అది కట్టినమని కట్టడాల లెక్కలే కాదు. అమ్ముకున్న లెక్కలూ చెప్పాలి" అంటూ బీఆర్ఎస్ నేతలపై రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్‌లు, గొర్రెల పథకాలపై విచారణకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. 159 కిలో మీటర్ల ఔటర్ రింగు రోడ్డును ఆనాటి కాంగ్రెస్ పార్టీ అద్భుతంగా, ఆదర్శంగా కడితే.. లక్షల కోట్ల ఔటర్ రింగు రోడ్డును పల్లీబఠానీలకు అమ్ముకున్నట్లు రూ.7 వేల కోట్లకు తెగనమ్మారని మండిపడ్డారు. "గొర్రెల పథకంలో రూ.700 కోట్లు దిగమింగారని రిపోర్టులు వచ్చినయ్. కేసీఆర్ కిట్‌లో ఏం అవినీతి జరిగిందో వారు కోరుకుంటే విచారణకు పోదాం. వాళ్ల గొప్ప పథకంగా చెప్పుకునే బతుకమ్మ చీరల అవినీతి మీదా విచారణకు సిద్ధం" అని రేవంత్ సవాల్ చేశారు. బతుకమ్మ చీరలతో చేనేత కార్మికులకు పని కల్పిస్తున్నామని చెప్పారని, సూరత్ వెళ్లి కిలోల లెక్కన చీరలు తీసుకొచ్చి ఆడబిడ్డలను మభ్యపెట్టారని ధ్వజమెత్తారు. అందుకే ఆ ఆడబిడ్డలే బయటికి వచ్చి వాటిని తగలబెట్టారని గుర్తు చేశారు. ఆ చీరలను వ్యవసాయ పొలాల్లో పిట్టలను బెదిరించడానికి కడుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.80 వేల కోట్లే ఖర్చు చేశామని, మరి లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్ ఎలా అంటారని ప్రశ్నించారని, ఆయన లీడర్ కాదు.. రీడర్ అని విమర్శించారని, ఇప్పుడు రూ.94 వేల కోట్లు ఖర్చు చేశామని వాళ్లే చెబుతున్నారని ధ్వజమెత్తారు. "నిన్నటికి నిన్న పోయి చూసిన్రు. ఎట్లా కూలిందో ఏమైనా మిగిలిందా లేదా అని చూడటానికి వెళ్లారు" అని ఎద్దేవా చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలోనూ జరగనంత అన్యాయం

ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు జిల్లాకు ఏ అన్యాయం జరిగిందో.. ఏ నిర్లక్ష్యానికి గురైందో బీఆర్ఎస్ పాలనలో అంతకంటే దారుణంగా తయారైందని సీఎం మండిపడ్డారు. "పాలమూరు ప్రజలు ఏం అన్యాయం చేసిన్రు. కేసీఆర్‌కు ఏం అన్యాయం చేసినం. కరీంనగర్ జిల్లాలో ఓడిస్తారని 2009లో పాలమూరుకు వలస వస్తే.. గుండెల్లో పెట్టుకొని.. భుజాన మోసి పార్లమెంట్‌కు పంపారు. రాష్ట్రం వచ్చిన తర్వాత మొట్టమొదట పాలమూరు జిల్లాకే మోసం చేశారు" అని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, అవి పూర్తి కాకపోవడానికి వీరి దుర్మార్గమే కారణమని విమర్శించారు. "మొన్న జరిగిన ఎన్నికల్లో తెలంగాణ సమాజం కాళ్లూ చేతులూ విరిచేసింది. అయినా, మారకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఉరి తీసి.. గుండు సున్నా ఇచ్చింది. అయినా, ఆలోచన మారలేదు. బుద్ధి మారకుండా ఇట్లా మాట్లాడుడు కరెక్ట్ కాదు. విద్యుత్తు విషయంలో కేంద్రంతో పోరాడామని అబద్ధాలు చెప్పారు" అని విమర్శించారు.

మోటార్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నారు: హరీశ్



వ్యవసాయ బోరు బావులకు కాకుండా ఇతర వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని మాత్రమే ఉదయ్ ఒప్పందంలో ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి కూడా సీనియర్ సభ్యుడే. ఎవరైనా సభ్యుడు కాగితం తీసుకొచ్చి ఇస్తే అదే మాట్లాడతారని అనుకోలేదు. ఉదయ్ ఒప్పందంతో కేంద్రం బలవంతంగా రూ.9వేల కోట్లు అప్పును రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దింది. విద్యుత్తు సంస్కరణలు అమలు చేస్తే.. 2021-22 నుంచి 2024-25 దాకా ఎఫ్‌ఆర్‌బీఎంలో 0.5శాతం వెసులుబాటు ఇస్తామని కేంద్రం చెప్పినా ఒప్పుకోలేదు. దానికి అంగీకరించి ఉంటే రూ.30 వేల కోట్లు వచ్చేవి"అని గుర్తు చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ మీడియా పాయింట్లో కూడా ఆయన మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడుతున్నట్లు సంతకాలు పెట్టామని సభలో చెప్పి.. ఆ వెంటనే సీఎం మాట మార్చారని, 2017 జనవరి 4నాటి పత్రాన్ని చూపించి అందరినీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మసిపూసి మారేడుకాయ చేసినట్లు.. తమపై బురద జల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే మోటార్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నారన్న అనుమానం కలుగుతోందన్నారు.



సభా పర్వం

ఉదయ్ ఒప్పందంలో ఏముంది?

ఒక్క తెలంగాణ మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న డిస్కమ్‌లు నష్టాల్లో కూరుకుపోయాయి. వాటి నష్టాలను శూన్యస్థాయికి తీసుకెళ్లి, ఆర్థిక సాధికారత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉదయ్ ఒప్పందాన్ని తెచ్చింది. దీని ప్రకారం.. డిస్కమ్‌లకు ఉన్న 75 శాతం అప్పులను రాష్ట్రప్రభుత్వం తనమీదికి బదలాయించుకోవాలి. మిగిలిన 25 శాతం అప్పులను తీర్చుకోవడానికి పూచీకత్తు ఇవ్వాలి. దీనికి అంగీకరిస్తే దేశీయంగా జెన్‌కోలకు బొగ్గును సరఫరా చేయడమే కాకుండా కోల్ లింకేజీలు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ ఒప్పందంలో చేరాలని కేంద్ర ప్రభుత్వం రెండున్నరేళ్లపాటు ఒత్తిడి చేసిన తర్వాత 2017 జనవరి 4వ తేదీన తెలంగాణ ప్రభుత్వం చేరింది.

అందుకు తెలంగాణ చేయాల్సిన పనులివీ

- 2017 మార్చి 31నాటికి డిస్కమ్‌లకు చెందిన అప్పు (రూ.8,923కోట్లు) 75శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం తనమీదికి మళ్లించుకోవాలి. మిగిలిన 25 శాతాన్ని ఈక్విటీగా మళ్లించుకోవాలి.
- డిస్కమ్‌ల నష్టాలను కూడా భరించాలి. 2015-16లో డిస్కమ్‌లు చవిచూసిన నష్టాల్లో 5 శాతాన్ని, 2016-17; 2017-18, 2018-19ల్లో నష్టాల్లో 25 శాతం చొప్పున; 2019-20లో 50 శాతాన్ని 2020-21లో భరించాలి.
- నగరపాలక సంస్థలు, స్థానిక సంస్థల్లో వీధి దీపాలన్నీ ఎల్‌ఈడీలుగా మార్చాలి.
- 2018-19కల్లా వార్షిక ఆదాయానికి, అవసరాలకు మధ్య అంతరం పూర్తిగా తగ్గాలి.
- 2017 జూన్ 30వ తేదీకల్లా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్)కు మీటర్లు పెట్టాలి.
- 2018 మార్చి 31వ తేదీకల్లా గ్రామీణ ప్రాంతాల్లో 11 కేవీ దాకా ఎనర్జీ ఆడిట్ చేయాలి.
- 2018 మార్చికల్లా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక ఫీడర్లను వేరు చేయాలి.
- 500 యూనిట్లపైన విద్యుత్ వాడేవారికి 2018 డిసెంబరు 31కల్లా స్మార్ట్‌మీటర్లు బిగించాలి.
- 2019 డిసెంబరు 31 కల్లా 200 యూనిట్ల పైన వాడేవారికి స్మార్ట్‌మీటర్లు పెట్టాలి.
- 2019 మార్చికల్లా సాధారణ మోటార్ల స్థానంలో 10 శాతం విద్యుత్తును పొదుపు చేసే మోటార్లు బిగించాలి.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పథకాలా?

- గణాంకాల్లో తేడాలు సభకే అగౌరవం
- ఒకప్పుడు నేనూ, రేవంత్ స్నేహితులం
- సభలో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ నుంచి ప్రతీ సంక్షేమ పథకం లబ్ధిదారుల ఎంపికకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చెయ్యకుండా పథకాలు అమలు చేయడమేంటనీ ఎంఐఎం ఎల్పీ నేత అక్బరుద్దీన్ అసెంబ్లీలో ప్రశ్నించారు. రేషన్ కార్డుల కోసమే ప్రజాపాలనకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే కొత్త కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం ముందుండి పోరాడతానని అసెంబ్లీ వేదికగా ప్రకటించిన అక్బరుద్దీన్.. బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే, ప్రభుత్వం బడ్జెట్‌లో చెప్పే గణాంకాలకు, వివిధ సర్వేలు, కాగ్ తదితర నివేదికల్లో ఉండే లెక్కలకు పొంతన ఉండడం లేదని విమర్శించారు. బడ్జెట్ గణాంకాల్లో తేడాలు శాసనసభకే అగౌరవమని వ్యాఖ్యానించారు. బడ్జెట్ రూపకల్పనలో నిర్లక్ష్యం తగదని, గణాంకాల్లో తేడాలకు బ్యూరోక్రాట్లను బాధ్యులను చేసి అవసరమైతే వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని ప్రభుత్వం పదేపదే చెబితే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోతే 2014లో రూ.1.12 లక్షలున్న తలసరి ఆదాయం 2023 నాటికి 3.47 లక్షలకు ఎలా పెరిగిందని నిలదీశారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు తగ్గాయని, దీనిపై అన్ని వర్గాలతో కలిసి పోరాడతానని ప్రకటించారు. పాతబస్తీ అభివృద్ధిని ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూలు బాధ్యతను పైలట్ ప్రాజెక్టు పేరిట అదానీ సంస్థకు అప్పగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ నియోజకవర్గాల్లో ఈ పని ఎందుకు చేయడం లేదని అడిగారు. ఇక, టెండర్లు పిలవకుండా, ఎవరు పనులు చేపడతారో చెప్పకుండా సీఎం రేవంత్ పాతబస్తీలో మెట్రో రైలు పనులకు శంకుస్థాపన చేశారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించడం మంచి విషయమన్నారు. ముస్లింలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలనిడిమాండ్ చేశారు. వక్ఫ్‌భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో పోలీసుల సహకారంతోనే విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ సరఫరా జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని, అక్షరాస్యతలో రాష్ట్రం జాతీయ సగటు కంటే దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి తాను మంచి స్నేహితులమని తెలిపారు. తమ స్నేహం 20 ఏళ్ల నాటిదని పేర్కొన్నారు. తన స్నేహితుడైన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో ఉండడం సంతోషంగా ఉందన్నారు.

పాతబస్తీలో మెట్రోను ప్రారంభిస్తాం

కేంద్రం నిధులివ్వకపోయినా ప్రాజెక్టు నిర్మిస్తాం.. 2029 ఎన్నికల నాటికి అందుబాటులోకి తెస్తాం

- అక్బర్ వస్తే.. కొడంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెడతాం
- డిప్యూటీ సీఎం పదవి ఇస్తాం: రేవంత్




హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): "మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకపోయినా పాతబస్తీలో మెట్రో నిర్మాణాన్ని చేపడతాం. 2029 ఎన్నికల నాటికి అందుబాటులోకి తీసుకొస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి అనేక సంస్థలు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, అదే సమయంలో ఇన్వెస్టర్లు కూడా చాలామంది సుముఖంగా ఉన్నారని చెప్పారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఎంఐఎం ఎల్పీ నేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. పాతబస్తీకి మెట్రోలైన్‌తో పాటు పలు అంశాలను లేవనెత్తారు. ఎన్నికల సమయంలో తనతో సహా పలువురు ముస్లింలపైనా కేసులు పెట్టారని ఆయన అన్నారు. తన తప్పు లేదని తెలిసినా తనపై కేసును ఉపసంహరించేది లేదని పోలీసు కమిషనర్ అన్నారని తెలిపారు. కానీ ఎన్నికల ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘించిన అమిత్‌షా, కిషన్ రెడ్డిపై నమోదు చేసిన కేసును మాత్రం ఉపసంహరించుకున్నారని చెప్పారు. రేవంత్.. పెద్దన్న అని అంటోన్న మోదీకి సోదరుడు, మిత్రుడనే అమిత్ షాపై పెట్టిన కేసును పోలీసులు ఉపసంహరించారా అని ప్రశ్నించారు. తాను సీఎం రేవంత్‌కు పేద సన్నిహితుడిని కాబట్టే తనపై కేసును కొనసాగిస్తున్నారా అని అక్బర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాతబస్తీకి మెట్రో విస్తరణ వ్యవహారంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంతానికి మెట్రోరైల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చాంద్రాయణగుట్ట దగ్గర శంకుస్థాపన చేశామని చెప్పారు. రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా 78 కిలోమీటర్ల మేర ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రానికి నివేదిక కూడా ఇచ్చామని వెల్లడించారు. మెట్రో రెండో దశపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీతోనూ చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో లైన్‌ను ఏర్పాటు చేస్తుందని, పాతబస్తీ, చాంద్రాయణగుట్ట ప్రాంతాల మీదుగా నిర్మాణం ఉంటుందని, ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను కూడా చేపట్టామని చెప్పారు. అయితే పాతబస్తీలో మెట్రోప్రాజెక్టును నిర్మించలేమని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ చేతులెత్తేసిందని, నిర్మించలేకపోతే చంచల్‌గూడ జైలో, చర్లపల్లి జైలో తేల్చుకోవాలన్న విషయాన్ని వారికే వదిలేశానని స్పష్టంచేశారు. పాతబస్తీని ఓల్డ్‌సిటీ అంటున్నారని, కానీ నిజానికి అదే ఒరిజినల్ సిటీ అని అన్నారు. పాతబస్తీని ఇస్తాంబుల్‌లా చేస్తామని, వరంగల్‌ను లండన్‌లా, కరీంనగర్‌ను న్యూయార్క్‌లా తయారు చేస్తామని చెప్పి తాము కాలం వెళ్లదీయమని, చెప్పింది చేసి తీరుతామని రేవంత్ అన్నారు.

షా, కిషన్‌రెడ్డిలపై ఫిర్యాదు చేసింది కాంగ్రెస్సే

లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా పాతబస్తీలో చిన్న పిల్లలతో ప్రచారం చేయిస్తున్నారని అమిత్ షా, కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని, ఆ ఉద్దేశంతోనే మోదీని 'పెద్దన్న' అని సంబోధించానని తప్పితే.. రాజకీయ ప్రయోజనాలేమీ లేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, సభలో చర్చ సందర్భంగా సీఎం రేవంత్, ఎంఐఎం ఎల్పీ నేత అక్బరుద్దీన్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఓబీసీలపై తమకు ప్రేమ ఉందని, అందుకే చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలిపితే.. ఓడిపోయారని రేవంత్ అన్నారు. అయితే ఓల్డ్‌సిటీకి మెట్రోరైల్‌ను తీసుకువస్తున్నందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసే ఓబీసీ అభ్యర్థిని గెలిపించేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అక్బర్ స్పందిస్తూ.. తాను కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానన్నారు. దీనికి స్పందించిన రేవంత్.. అక్బర్ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వస్తే.. కాంగ్రెస్ తరఫున కొడంగల్‌లో పోటీ చేసేందుకు బీ-ఫారమ్ ఇచ్చే బాధ్యత తనదేనని, గెలిపించే బాధ్యతను కూడా తానే తీసుకుంటానని చెప్పారు. గెలిచిన తరువాత డిప్యూటీ సీఎంతో పాటు ఆర్థిక మంత్రి పదవి ఇచ్చి అసెంబ్లీలో తనపక్కనే కూర్చోబెట్టుకుంటానని రేవంత్ అన్నారు. స్పందించిన అక్బర్.. తన చివరిశ్వాస వరకు మజ్లిస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

హాఫ్ నాలెడ్జ్.. ఫుల్ నాలెడ్జ్!

- మంత్రి కోమటిరెడ్డిపై హరీశ్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్



హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌పై చర్చలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య వాడివేడి చర్చ జరిగింది. హరీశ్.. కోమటిరెడ్డిని 'హాఫ్ నాలెడ్జ్' అని విమర్శించారు. కోమటిరెడ్డి స్పందిస్తూ హరీశ్‌కు ఆకారం పెరిగింది కానీ.. నాలెడ్జ్ పెరగలేదని, ఆయనదే హాఫ్ నాలెడ్జ్ అని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని హరీశ్‌కు హాఫ్ నాలెడ్జ్.. పెద్దాయనకేమో (కేసీఆర్‌కు) ఫుల్ నాలెడ్జ్ (ఫుల్ బాటిల్ అర్థం వచ్చేలా మోచేయి పైకెత్తి) అని వ్యాఖ్యానించారు. తొలుత హరీశ్ మాట్లాడుతుండగా కోమటిరెడ్డి జోక్యం చేసుకుని, హరీశ్ వైఖరి సభను తప్పుదోవ పట్టించేలా ఉందని అభ్యంతరం తెలిపారు. గంటన్నర మాట్లాడినా బడ్జెట్ గురించి ప్రస్తావన లేదని విమర్శించారు. '2001లో టీఆర్ఎస్ పెట్టినప్పుడు తెలంగాణ ఏర్పడితే తొలి ముఖ్యమంత్రి దళితుడు అవుతాడు అన్నారు. దళితుడిని సీఎం చేయకపోతే మెడ మీద తల తీసుకుంటామన్నారు. ఆ రోజు మొదలయ్యాయి.. అబద్ధాలంటే వీళ్లవి. గ్యారెంటీలంటే వీళ్లవి. ఇయ్యాల హరీశ్‌రావు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. హరీశ్‌రావు గారూ.. నీ దగ్గర సబ్జెక్టు లేదు. నిన్న కేసీఆర్ గారు ప్రెస్‌మీట్‌లో రేపు కాంగ్రెస్ బడ్జెట్ మీద చీల్చి చెండాడతానంటే నేను ఉదయం 9.30 గంటలకు వచ్చి సభలో కూర్చున్నాను. వచ్చే ముఖం లేక ఈయనను (హరీశ్‌ను) పంపించిన్రు. మా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.70 వేల కోట్లు, ఇరిగేషన్‌కు రూ.20 వేల కోట్లు పెట్టాం. చీల్చిచెండాడే మొనగాడు.. కేంద్రం చేసిన అన్యాయంపై ఒక్కమాట కూడా మాట్లాడలేదని కోమటిరెడ్డి విమర్శించారు. హరీశ్ బదులిస్తూ 'కోమటిరెడ్డికి మాటలు సమాధానం చెప్పలేనుగానీ.. నా బాధేంటి అంటే.. ఆయనకేమో హాఫ్ నాలెడ్జ్ అని వ్యాఖ్యానించారు. 'యస్.. యూఆర్ హాఫ్ నాలెడ్జ్ ఫెలో' అని కోమటిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఆ మాటను ఉపసంహరించుకోవాలని స్పీకర్ సూచించారు. 'మీకు ఇబ్బంది ఉంటే తొలగించుకోండి. నాలెడ్జ్ లేదని హరీశ్ చెప్పారు. దాంతో ఆ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. కోమటిరెడ్డి మైక్ అందుకొని 'హరీశ్‌రావుకు ఆకారం పెరిగింది కానీ నాలెడ్జ్ లేదు. ఆయనదే హాఫ్ నాలెడ్జ్. ఆకారం పెరిగితే సరిపోదు బుద్ధుండాలి. ఆయనొక డమ్మీ మినిస్టర్, డమ్మీ అల్లుడు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మీ మామ అన్నడా లేదా చెప్పు' అని మండిపడ్డారు. హరీశ్ బదులిస్తూ 'ఇదే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50 కోట్లకు రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కున్నాడని ఆరోపించార'న్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని 'వెంకట్ రెడ్డిగారు ఒకమాట చెప్పారు.. ఆయనకేమో (హరీశ్‌కు) హాఫ్ నాలెడ్జ్... పెద్దాయనకేమో (కేసీఆర్‌కు) ఫుల్ నాలెడ్జ్ (ఫుల్ బాటిల్ అర్థం వచ్చేలా మోచేయి పైకి ఎత్తుతూ) అని వ్యాఖ్యానించారు. ఇక తామేం చేస్తాం అధ్యక్షా అని ప్రశ్నించారు.



'సామాజిక చలనం-ప్రజాస్వామిక ప్రతిస్పందన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి.. చిత్రంలో హరగోపాల్ దంపతులు తదితరులు

గొప్ప మానవతావాది హరగోపాల్

సుప్రీంకోర్టు విశ్రాంత జస్టిస్ సుదర్శన్ రెడ్డి

సామాజిక చలనం-ప్రజాస్వామిక ప్రతిస్పందన పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ హరగోపాల్ గొప్ప మానవతావాది, ప్రతీ సమస్యను మానవీయ కోణంలో చూడగలిగిన ప్రజా మేధావి అని సుప్రీంకోర్టు విశ్రాంత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభివర్ణించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకాలం నుంచి దేశ, రాష్ట్ర పరిస్థితులపై ప్రొఫెసర్ హరగోపాల్ రాసిన వ్యాసాలతో పాటు పలు పుస్తకాలకు ఆయన రాసిన ముందు మాటలు కలిపి విడుదల చేసిన ఆరు పుస్తకాలపై వెలువడిన సమీక్షను 'సామాజిక చలనం- ప్రజాస్వామిక ప్రతిస్పందన' సంపుటిగా పాలమూరు అధ్యయన వేదిక ప్రచురించింది. దీన్ని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక మార్పు కోసం ఉద్యమిస్తున్నవారంతా తప్పనిసరిగా రాజ్యాంగాన్ని ఆసరాగా తీసుకోవాలని సూచించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన ప్రజాస్వామిక ఆలోచనలు, ఆచరణతో ఎంతోమందిని ప్రభావితం చేసిన మానవతావాది హరగోపాల్ అని కొనియాడారు. "ఆపరేషన్ కగార్ వంటి అమానుష ఘటనల మీద నిరసన గళాన్ని వినిపిస్తున్న అతి కొద్దిమందిలో హరగోపాల్ నాయకత్వ స్థానంలో ఉన్నారు" అని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ప్రశంసించారు. కార్యక్రమంలో అర్విణి రాజేంద్రబాబు, రాఘవాచారి, ప్రొఫెసర్ హరగోపాల్ జీవిత సహచరి డా.వనమాల తదితరులు పాల్గొన్నారు.

31న డీఏవో పరీక్షల ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్(డీఏవో) పోస్టులకు సంబంధించిన పరీక్షల ప్రాథమిక 'కీ'ని ఈనెల 31న విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. అభ్యర్థుల రెస్పాన్స్ షీట్స్‌తో పాటు ప్రిలిమినరీ కీని ఈనెల 31 నుంచి వచ్చే నెల 30 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, కీపై అభ్యంతరాలను ఆగస్టు 1 నుంచి 5 లోపు తెలియజేయాలని అధికారులు సూచించారు. కాగా,వచ్చే నెల 8 నుంచి ఎడ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈనెల 31న అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. వచ్చేనెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు, 22, 23 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పిస్తారు. ఆగస్టు 30న సీట్లను కేటాయిస్తారు. మరోవైపు పీజీఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆగస్టు 7 నుంచి చేపట్టనున్నారు.

రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వర్తించారు. కాగా, తెలంగాణతో పాటు దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మరో మూడు రాష్ట్రాల గవర్నర్లను వేరే రాష్ట్రాలకు బదిలీ చేశారు. హరిబాబు కిషన్‌రావ్ బాగ్డే (రాజస్థాన్), ఓం ప్రకాశ్ మాథుర్ (సిక్కిం), సంతోష్ కుమార్ గాంగ్వార్ (జార్ఖండ్), రమెన్ దేఖా (ఛత్తీస్‌గఢ్), సీహెచ్ విజయశంకర్ (మేఘాలయ)లను గవర్నర్లుగా నియమించింది. కాగా, ప్రస్తుతం జార్ఖండ్ గవర్నర్‌గా తెలంగాణ అదనపు బాధ్యతలతో ఉన్న సీపీ రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా పంపారు. అసోం గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను పంజాబ్ గవర్నర్‌గా, కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు. సిక్కిం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను అసోం గవర్నర్‌గా పంపుతూ.. మణిపూర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

శంషాబాద్‌లో అతిపెద్ద ఈవీ చార్జింగ్ హబ్

- ఏ సమయంలోనైనా 102 కార్లకు చార్జింగ్..
- ప్రారంభించిన ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

శంషాబాద్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనని ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం రహదారి పక్కన గ్లిడా కంపెనీ ఏర్పాటు చేసిన 102 ఈవీ చార్జింగ్ పాయింట్ల అతిపెద్ద ఈవీ చార్జింగ్ హబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే రెండో అతిపెద్ద ఈవీ చార్జింగ్ హబ్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏ సమయంలోనైనా ఇక్కడ 102 కార్లను చార్జ్ చేసుకోవచ్చన్నారు. చార్జింగ్ హబ్‌ను ఏర్పాటు చేసిన గ్లిడా కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. దీని ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు కూడా పెరుగుతాయన్నారు. ముఖ్యంగా విమానాశ్రయ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇక్కడ చార్జింగ్ హబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. గ్లిడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవేశ్ కె ఝా మాట్లాడుతూ.. తెలంగాణలో ఇదే అతి పెద్ద ఈవీ చార్జింగ్ హబ్ అని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 16 రాష్ట్రాలు, 30 నగరాలు, 16 హైవేల పక్కన గ్లిడా 730కు పైగా చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిందని వెల్లడించారు.



ఈవీ చార్జింగ్ హబ్‌లోని చార్జింగ్ పాయింట్లు..

జలదిగ్బంధంలో భద్రాద్రి ఏజెన్సీ

34 గ్రామాలకు నిలిచిన రాకపోకలు.. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక

53.4 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవాహం

శ్రీశైలానికి 4.12 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో

రెండు రోజుల్లో నిండనున్న జలాశయం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గోదావరికి వరద పోటెత్తడంతో భద్రాచలం ఏజెన్సీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం సాయంత్రం 4.16 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరుకోవడంతో ఆర్డీవో దామోదర్‌రావు మూడో(తుది) ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆరు గంటలకు గోదావరి నీటి మట్టం 53.4 అడుగులకు చేరింది. దీంతో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక మండలాల్లోని 34 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలం-వాజేడు, భద్రాచలం-కూనవరం, భద్రాచలం-చర్ల మార్గంలో పలు ప్రాంతాల్లో రహదారులపై గోదావరి వరద ప్రవహిస్తోంది. దీంతో భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలంలోని అశోక నగర్ కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీలు నీట మునిగాయి. మొత్తం 94 కుటుంబాలకు చెందిన 306 మందిని పునరావాస కేంద్రాలకు చేర్చారు. భద్రాద్రి సరిహద్దున ఉన్న ఏపీలోని ఎటపాక పెద్దవాగు పొంగి ప్రవహిస్తుండడంతో ఆ నీరు ఈ కాలనీల్లోకి వచ్చింది. రెండు రోజులుగా చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో మండలం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గోదావరి వరద రోడ్లపైకి చేరడంతో భద్రాచలం, వెంకటాపురం, చర్ల మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అటవీ ప్రాంతాల్లో వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, గోదావరి నీటిమట్టం 75 అడుగులకు చేరినా.. భద్రాచలంలోకి చుక్క నీరు రానివ్వకుండా చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. నూతనంగా చేపట్టిన 700 మీటర్ల కరకట్ట నిర్మాణాన్ని వచ్చే జూన్ నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. శనివారం భద్రాచలంలోని ముంపు ప్రాంతాలను, నూతనంగా నిర్మిస్తున్న కరకట్టను ఆయన పరిశీలించారు.



వరద నీటిలో మునిగిపోయిన భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ



పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు..

ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ మండలాల్లో వాగులు ఉప్పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో పర్యటించి డీఆర్ఎస్ బృందాలను సిద్ధం చేశారు. జిల్లాలో 4.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. వెంకటాపురంలో6.3 సెం.మీ.. తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట మండలాల్లో 5సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం మహోగ్ర రూపం దాల్చింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ముసురు వాన పడుతోంది.

శ్రీశైలానికి భారీ వరద..

కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు రెండు రోజుల్లో నిండే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం జలాశయానికి 4.12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. జలవిద్యుత్ ఉత్పాదన చేసి 74,258 క్యూసెక్కులను వదిలిపెట్టారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 127.6 టీఎంసీల నీరు ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు పంపింగ్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మిడ్‌మానేరు జలాశయానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శనివారం ఉదయం నుంచి వరద పెరుగుతూ వచ్చి సాయంత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు నీటిమట్టం 17.3 టీఎంసీలకు చేరుకోవడంతో ఎల్లంపల్లి హెడ్ రెగ్యులేటరీ గేట్లు ఎత్తి.. నీటిని పెద్దపల్లి జిల్లా నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లోకి వదిలారు. మొదట ఒక మోటారును ఆన్ చేసిన అధికారులు సాయంత్రం ఐదు గంటల వరకు నాలుగు మోటార్లు ఆన్ చేశారు. 12,600 క్యూసెక్కుల నీటిని నంది మేడారం రిజర్వాయర్‌లో ఎత్తిపోసి అక్కడి నుంచి టన్నెల్ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ మోటార్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు నీటిని పంపిస్తున్నారు. ఎల్లంపల్లికి 12,931 క్యూసెక్కుల వరద వస్తోంది.



గాయత్రి పంప్‌హౌస్ నుంచి దుంకుతున్న గోదావరి నీరు

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)
ఆల్మట్టి	129.72	77.05	238000	300000
నారాయణపూర్	37.64	29.20	300000	300064
తుంగభద్ర	100.86	99.66	121456	158457
జూరాల	9.66	7.74	302000	316308
శ్రీశైలం	215.81	127.60	412280	74258
నాగార్జునసాగర్	312.05	127.97	52559	6253
సింగూరు	29.91	14.16	2497	391
శ్రీరాంసాగర్	80.5	31.26	30554	605
కడెం	7.6	6.14	5086	7120
ఎల్లంపల్లి	20.18	17.40	12931	13076
మేడిగడ్డ	16.17	6.07	539200	539200
సమ్మక్క	6.94	6.94	975910	975910
సీతమ్మ	36.57	0.2	1395637	1395637

కేంద్రాన్ని బద్నాం చేసే ప్రయత్నం

రాష్ట్ర బడ్జెట్‌లో 1.09 లక్షల కోట్ల నిధులు కేంద్రానివే.. పైసా ఇవ్వలేదంటూ అసెంబ్లీ తీర్మానమేంటి?: సంజయ్

- నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం వెళ్లకపోవడం దుర్మార్గమని ఫైర్

కరీంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్రంలోని మోదీ సర్కారును బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటున్నారని, కానీ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం నుంచి వచ్చే నిధులు రూ.లక్షా తొమ్మిది వేల కోట్లు ఉన్నాయని తెలిపారు. కేంద్ర పన్నుల్లో వాటా, వివిధ పథకాలకు ఇచ్చే నిధులు, అప్పుల రూపేణా కేంద్రం ఈ మొత్తం ఇస్తుందని పేర్కొన్నారు. అయినా.. తెలంగాణకు కేంద్రం పైసా ఇవ్వలేదంటూ అసెంబ్లీలో తీర్మానం ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీల పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేంద్రంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం కరీంనగర్‌లో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని తెలిపారు. విభజన చట్టం హామీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో మరో మూడు యూనిట్ల కోసం పీపీపీ చేసుకోవాలని కేంద్రం కోరుతున్నా నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి ప్రైవేట్ సంస్థల నుంచి కరెంట్ కొనుగోలు చేయడం సిగ్గుచేటన్నారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసినప్పుడు సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని కేటీఆర్ ఎందుకు ప్రతిపాదించలేదన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అసాధ్యమని, క్వాలిటీ ఐరన్ ఓర్ లేదని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలే చెప్పాయని గుర్తు చేశారు. నీతి ఆయోగ్ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకాకపోవడం దుర్మార్గమని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాళేశ్వరం ఆలయ సంప్రదాయాలు పాటించకుండా గర్భగుడిలోకి వెళ్లారని, హిందూ ధర్మాన్ని అవమానించినందుకు ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తల్లీ పనికి పోతున్నవు.. కాలేజీకి పోవడం లేదా?

కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా చర్లపల్లి (ఆర్) గ్రామ శివారులో వర్షంలోనే వ్యవసాయ పనులు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి మాట్లాడారు. వారిలో ఓ బాలిక ఉండడాన్ని చూసి, 'ఏం తల్లీ.. పని చేస్తున్నావు? చదువుకోవడం లేదా?' అని అడిగారు. తన పేరు బొల్ల అక్షయ అని, పదో తరగతి పాసైనప్పటికీ.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కూలి పనులు చేసుకుంటున్నానని బాలిక బదులిచ్చింది. తనకు చదువుకోవాలని ఉందని తెలపడంతో కేంద్ర మంత్రి వెంటనే.. బాలిక వివరాలు తీసుకుని కాలేజీలో చేర్పించాల్సిందిగా స్థానిక బీజేపీ నేతలకు సూచించారు.



నేవీ రేడార్ స్టేషన్ శంకుస్థాపన వాయిదా

వికారాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ రేడార్ స్టేషన్ శంకుస్థాపన వాయిదా పడింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి దీని నిర్మాణానికి శంకుస్థాపన చేయాల్సి ఉంది. అయితే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల వల్ల ఈ కార్యక్రమం వాయిదా పడింది. ఆగస్టు 15 తర్వాత శంకుస్థాపన జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దామగుండం అటవీ ప్రాంతాన్ని శనివారం నేవీ రేర్ అడ్మిరల్ రాహుల్‌శర్మ సందర్శించారు. కాగా, రేడార్ స్టేషన్ కోసం అటవీ ప్రాంతాన్ని భారత నౌకాదళానికి అప్పగించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

ఆంధ్రజ్యోతి

జర్నలిజం కళాశాల



రేపటి జర్నలిస్టులకు ఆహ్వానం

అర్హతలు

- ఇంగ్లీషుబాషలో వ్యవహారజ్ఞానం, తెలుగులోకి అనువాదం చేయగలిగిన నేర్పు
- వర్తమాన వ్యవహారాలపై ఆసక్తి, అవగాహన
- సరళమైన తెలుగులో రాయగలగడం
- చక్కటి భావవ్యక్తీకరణ, డిగ్రీ ఉత్తీర్ణత
- 35 సంవత్సరాలకు మించని వయసు

దరఖాస్తు విధానం

- మీలో పై అర్హతలన్నీ ఉంటే పూర్తి పేరు, వయసు, విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు, ఉద్యోగానుభవం, ఆసక్తులు వగైరా వివరాలన్నిటితో దరఖాస్తు చేయాలి.
- దరఖాస్తుకు సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఇటీవల తీసుకున్న రెండు ఫొటోలు జతపరచాలి.
- దరఖాస్తులోను, కవరుపైన మీ పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్, పరీక్ష రాయదలచుకున్న కేంద్రం స్పష్టంగా రాయాలి.
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ వివరాలు ఫోన్ ద్వారా మాత్రమే తెలియపరుస్తాం. అందువల్ల మీరు ఎప్పుడూ అందుబాటులో ఉండే మొబైల్ నెంబర్‌నే దరఖాస్తులో ఇవ్వాలి.

★ **సోషల్ మీడియా మితిమీరి వ్యవహరిస్తోందా?** – ఈ అంశంపై సొంతంగా రాసిన వ్యాసాన్ని దరఖాస్తుకు తప్పనిసరిగా జతచేయాలి. వ్యాసం లేని దరఖాస్తులను పరిశీలించం.

ఎంపిక

- అభ్యర్థుల ఎంపిక రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుంది.
- రాతపరీక్షలో వర్తమాన వ్యవహారాలు, తెలుగుభాష, సాహిత్యం, అనువాద సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థుల ఎంపికలో ఆంధ్రజ్యోతి యాజమాన్యానిదే తుది నిర్ణయం.
- శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు కనీసం మూడు సంవత్సరాలు పని చేస్తామని హామీపత్రం ఇవ్వాలి.

శిక్షణ

- ఎంపిక చేసిన అభ్యర్థులకు ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాలలో కనీసం ఆరునెలల శిక్షణ ఉంటుంది.
- బాష, బావవ్యక్తీకరణ, వర్తమాన వ్యవహారాలపై అవగాహన, అనువాదం, ఎడిటింగ్‌లలో శిక్షణ ఉంటుంది.
- శిక్షణ ముగించుకున్నాక ట్రైనీ ఉద్యోగులుగా అవకాశం లభిస్తుంది.
- వారు ఆంధ్రజ్యోతి యూనిట్లలో ఎక్కడైనా పని చేయడానికి సిద్ధంగా ఉండాలి.

వేతనం

శిక్షణకాలంలో నెలకు రూ. 12,000

శిక్షణానంతరం ముఖ్యవిభాగాల్లో పని చేయడానికి అర్హులైన వారికి పనితీరును బట్టి రూ. 18,000 నుంచి 20,000

జిల్లావిభాగాల్లో పని చేయడానికి ఎంపికైన వారికి రూ. 16,000 నుంచి 18,000

పరీక్షాకేంద్రాలు

హైదరాబాద్, వరంగల్ విజయవాడ, విశాఖపట్నం తిరుపతి

దరఖాస్తులు చేరాల్సిన ఆఖరి తేదీ: 2024, ఆగస్టు 1

దరఖాస్తులు పంపవలసిన చిరునామా

ప్రిన్సిపాల్, ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాల, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, జూబ్లీహిల్స్ రోడ్డు నం. 70, హైదరాబాద్ - 500 033

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 28 జూలై 2024

జేఎన్ఏఎఫ్ఏయూలో బీఆర్క్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- నాటా 2024 స్కోర్ ద్వారా బీఆర్క్ రెగ్యులర్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/మైనారిటీ/అన్ ఎయిడెడ్ ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 765 సీట్లు ఉన్నాయి. వీటిలో 550 కన్వీనర్ కోటా సీట్లు, 204 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు, 5 జీఓఐ నామినీ సీట్లు, 6 ఐఆర్‌సీ సీట్లు ఉన్నాయి. స్థానికులకు 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఆర్క్ డిగ్రీ వ్యవధి అయిదేళ్లు.



కళాశాలలు-సీట్లు

- జేఎన్ఏఎఫ్ఏయూ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 45(రెగ్యులర్)+40(సెల్ఫ్ ఫైనాన్సింగ్)
- సీఎస్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, సికింద్రాబాద్- 120
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 120
- వైష్ణవీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, హైదరాబాద్- 80
- దక్కన్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 40
- జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సికింద్రాబాద్- 60
- జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్, మొయినాబాద్-80
- అరోరా-ఎస్ డిజైన్ అకాడమీ, హైదరాబాద్- 60
- అరోరా-ఎస్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్- 40
- అశోకా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 80

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తి చేసినవారు కూడా అర్హులే. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్ తేదీలు:** ఆగస్టు 17, 18
- **ఫస్ట్ ఫేజ్‌లో ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 21
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** ఆగస్టు 24
- **సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్స్ తేదీలు:** ఆగస్టు 25, 26
- **సెకండ్ ఫేజ్‌లో ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 29
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in, http://barchadm.tsche.ac.in

జయశంకర్ వర్సిటీలో
డిప్లొమా సెకండ్ కౌన్సెలింగ్

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్; మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. సీట్ల వివరాలను కౌన్సెలింగ్ నాటికి వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. తెలంగాణ పాలిసెట్ 2024 అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్లు అలాట్ చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

అర్హత:
- మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సబ్మిట్ చేసి ఉండాలి.
- మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనని అభ్యర్థులు, మొదటి ఫేజ్‌లో సీటు రానివారు, సీటు వచ్చినా కాలేజీ మారాలనుకునేవారు/కాలేజీలో రిపోర్ట్ చేయనివారు/అడ్మిషన్ క్యాన్సిల్ చేసుకున్నవారు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024 అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో 447-27836 మధ్య ర్యాంక్‌లు వచ్చినవారు ఆగస్టు 2న; 28093-68151 మధ్య ర్యాంక్‌లు వచ్చినవారు ఆగస్టు 3న ఉదయం పది గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. జనరల్, ఫార్మర్, నాన్ ఫార్మర్ సహా ఈడబ్ల్యూఎస్, రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభ్యర్థులందరికీ ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ; పదోతరగతి/తత్సమాన కోర్సు సర్టిఫికెట్, తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు; నాన్ మున్సిపల్ ఏరియా స్టడీ సర్టిఫికెట్; టీసీ; రెసిడెన్షియల్ సర్టిఫికెట్(తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు మినహా); కుల ధ్రువీకరణ పత్రం; ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్.
- **వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in



ఐఎన్‌సీలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సహకారంతో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్వహిస్తున్న నేషనల్ కన్సార్షియం- పార్ట్ టైమ్ పీహెచ్‌డీ ఇన్ నర్సింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ చేసుకొన్న అయిదేళ్లలోపు ప్రోగ్రామ్ పూర్తిచేసుకోవచ్చు. థీసెస్ సబ్మిట్ చేయడానికి గరిష్ఠ వ్యవధి ఏడేళ్లు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు-సీట్లు: కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ 7, మెడికల్ సర్జికల్ నర్సింగ్ 9, ఓబీజీ నర్సింగ్ 4, పీడియాట్రిక్ నర్సింగ్ 4, సైకియాట్రిక్ నర్సింగ్ 6 సీట్లు చొప్పున మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

స్టడీ సెంటర్లు: ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్-ఢిల్లీ, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సీఎంసీ-లూథియానా, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సీఎంసీ-వెల్లూరు, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-హైదరాబాద్, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-తిరువనంతపురం, కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఎస్ఎస్‌కేఎం కోల్‌కతా, ఐఎన్ఈ-ముంబై, సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-బెంగళూరు.

అర్హత: ఐఎన్‌సీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నర్సింగ్ విభాగంలో ఎంఫిల్/ఎమ్మెస్సీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు బోధన/క్లినికల్ రంగాల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. ఎమ్మెస్సీ(నర్సింగ్)లో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది 90 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే 54 మార్కులు రావాలి. ఎంఫిల్ అభ్యర్థులకు 5 మార్కులు, ప్రచురితమైన జర్నల్స్‌కు ఒక్కోదానికి 1 మార్కు చొప్పున గరిష్ఠంగా 5 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్: పీహెచ్‌డీకి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ చేసుకొన్న అభ్యర్థులకు ఏడాది తరవాత ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే అభ్యర్థి పీహెచ్‌డీని ధ్రువీకరిస్తారు. ఈ పరీక్షలో రెండు పేపర్లు, సెమినార్/ రీసెర్చ్ టర్మ్ పేపర్(ఇంటర్నల్ అసెస్‌మెంట్), వైవా ఓస్ ఉంటాయి. ఒక్కోదానికి 100 మార్కులు కేటాయించారు. మొదటి రెండు పేపర్లను రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తుంది. ఒక్కో పేపర్‌కు పరీక్ష వ్యవధి 3 గంటలు. మొదటి పేపర్లో రీసెర్చ్ మెథడాలజీ, అప్లయిడ్ స్టాటిస్టిక్స్ అంశాల నుంచి; రెండో పేపర్లో నర్సింగ్ సైన్స్, థియరీ డెవలప్‌మెంట్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్దేశించిన సిలబస్ మేరకు ప్రశ్నలు ఉంటాయి. సెమినార్, వైవాలను నేషనల్ కన్సార్షియం నిర్వహిస్తుంది. పరీక్ష మొత్తమ్మీద 60 శాతం మార్కులు వస్తేనే అర్హత పొందినట్లు పరిగణిస్తారు. మొదటి ఏడాది 70 శాతం అటెండెన్స్ ఉంటేనే ఈ పరీక్షని రాయనిస్తారు. మొదటి ప్రయత్నంలో విఫలమైనవారికి రెండో అవకాశం ఇస్తారు. ఇందులో కూడా విఫలమైతే అభ్యర్థి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌ను క్యాన్సిల్ చేస్తారు.

థీసెస్ సబ్మిషన్: అభ్యర్థులకు రీసెర్చ్ గైడ్‌ను ఎంచుకొనే సౌకర్యం ఉంది. పీహెచ్‌డీ కన్సార్షియం గుర్తించిన గైడ్‌ల లిస్టునుంచి వారి అర్హత, అనుభవం ఆధారంగా సెలెక్ట్ చేసుకోవచ్చు. ఈ సందర్భంలో అభ్యర్థులు తమ పరిశోధనాంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ తేదీ నుంచి కనీసం మూడేళ్ల తరవాత, కేటాయించిన గరిష్ఠ కాల వ్యవధికి మూడు నెలల లోపు అభ్యర్థులు థీసెస్ సబ్మిట్ చేయాలి. తరవాత పీహెచ్‌డీ ఎగ్జామినేషన్, వైవా ఉంటాయి. ఇవి పూర్తయిన వెంటనే అర్హులకు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.3000
- **ఐఎన్‌సీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ:** ఆగస్టు 16
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు సబ్మిషన్ సెంటర్:** సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్- బెంగళూరు
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 22
- **పరీక్ష కేంద్రం:** ఐఎన్‌సీ-న్యూఢిల్లీ, ఆర్‌జీయూహెచ్ఎస్-బెంగళూరు
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 7
- **ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్స్:** నవంబరు 14
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** నవంబరు 28
- **వెబ్‌సైట్:** www.indiannursingcouncil.org



భారతీయ రైల్వే భారీ పోస్టులతో నోటిఫికేషన్ (సీఈఎన్ నెం. 03/2024) విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా 7,951 జూనియర్ ఇంజనీర్, కెమికల్ సూపర్‌వైజర్ ఖాళీలు భర్తీ చేస్తారు. రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగిరి, తిరువనంతపురం

పోస్టుల వివరాలు

1. కెమికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్ అండ్ మెటలర్జికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్: 17 పోస్టులు(ఆర్ఆర్‌బీ గోరఖ్‌పూర్ మాత్రమే)
2. జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్: 7,934 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఇంజనీరింగ్), బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ), బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18-36 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల వయో సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం(నెలకు)

- జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్: రూ.35,400
- కెమికల్ సూపర్ వైజర్/రీసెర్చ్ అండ్ మెటలర్జికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్: రూ.44,900

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2 కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లు(సీబీటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

స్టేజ్-1 పరీక్ష విధానం: ప్రశ్న పత్రంలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కును కేటాయించారు. మేథ్స్ నుంచి 30 ప్రశ్నలు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ నుంచి 25, జనరల్ అవేర్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు వస్తాయి. జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్-40, ఓబీసీ-30, ఎస్సీ-30, ఎస్టీ అభ్యర్థులు 25 శాతం కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను స్టేజ్-2 పరీక్షకు షార్ట్‌లిస్ట్ చేస్తారు.

స్టేజ్-2 పరీక్ష విధానం: పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 15 ప్రశ్నలు, ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ నుంచి 15, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ నుంచి 10, బేసిక్స్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ నుంచి 10, టెక్నికల్ ఎబిలిటీస్ నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు.జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్-40, ఓబీసీ-30, ఎస్సీ-30, ఎస్టీ అభ్యర్థులు 25 శాతం కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ/ఎస్టీ/ఈఎస్ఎం/ మహిళలు/ట్రాన్స్‌జెండర్లకు రూ.250.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం:** 2024 జూలై 30
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** 2024 ఆగస్టు 29
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 2024 ఆగస్టు 30 నుంచి 2024 సెప్టెంబరు 8 వరకు
- **వెబ్‌సైట్:** rrbsecunderabad.gov.in/

సిలబస్

స్టేజ్-1 పరీక్ష

మేథమెటిక్స్: నంబర్ సిస్టమ్స్, బోడమస్, డెసిమల్స్ ఫ్రాక్షన్స్ ఎల్‌సీఎం అండ్ హెచ్‌సీఎం, రేషియో అండ్ ప్రొపర్షన్, పర్సంటేజెస్, మెన్సురేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, సింపుల్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగొనామెట్రీ, ఎలిమెంటరీ స్టాటిస్టిక్స్, స్క్వేర్ రూట్, ఏజ్ క్యాలిక్యులేషన్స్, క్యాలెండర్ అండ్ క్లాక్, పైప్స్ అండ్ సిస్టర్న్

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్: అనలాజీస్, ఆల్ఫాబెటికల్ అండ్ నంబర్ సిరీస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, మేథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, సిల్లాగిజమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ సఫిషియెన్సీ, కన్‌క్లూజన్స్ అండ్ డెసిషన్ మేకింగ్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్- ఆర్గ్యుమెంట్స్ అండ్ అసంప్షన్స్

జనరల్ అవేర్‌నెస్: నాలెడ్జ్ ఆఫ్ కరెంట్ అఫైర్స్, ఇండియన్ జాగ్రఫీ, కల్చర్ అండ్ హిస్టరీ ఆఫ్ ఇండియా ఇన్‌క్లూడింగ్ ఫ్రీడమ్ స్ట్రగుల్, ఇండియన్ పాలిటీ అండ్ కాన్‌స్టిట్యూషన్, ఇండియన్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్ కన్సర్నింగ్ ఇండియా అండ్ ద వరల్డ్, స్పోర్ట్స్, జనరల్ సైంటిఫిక్ అండ్ టెక్నలాజికల్ డెవలప్‌మెంట్స్.

జనరల్ సైన్స్: ఫిజిక్స్, కెమిస్ట్రీ అండ్ లైఫ్ సైన్సెస్(సీబీఎస్ఈ సిలబస్ పదో తరగతి వరకు)

లిటిల్స్



మీకు తెలుసా?

ఈ రోడ్డు ప్రపంచానికి డెడ్ ఎండ్ ఉత్తర ధ్రువం దగ్గర ఉన్న ఒక రహదారి. ప్రపంచంలోనే అత్యంత అందమైన, అద్భుతమైన రోడ్డు. దీని మీద ప్రయాణం చేస్తున్నంత సేపూ ఆకాశంలోకి, చందమామ దగ్గరికి వెళుతున్నట్టే ఉంటుంది. ఈ రోడ్డు నార్వేలోఉంది.ఇక్కడికి వస్తే, ప్రపంచయాత్ర ముగిసినట్టే. ఈ ఈ రోడ్డు పేరు 69 హైవేప్రపంచానికి డెడ్ ఎండ్‌చెప్పే రహదారిగా ఇది ఎంతో ప్రసిద్ధి చెందినది. భూమిపై ఇంత చివరి వరకూ వెళ్లే ఈ రోడ్డు ఇదొక్కటే. మంచుతో గడ్డ కట్టిన ఉత్తర ధ్రువప్రాంతంలో ఒక హైవే నిర్మించాలని 1909లో అనుకున్నారు. కానీ, దీని నిర్మాణం పూర్తి అయింది మాత్రం 1999లో. ధ్రువ ప్రాంతాల్లో ఈ రోడ్డు వేయడం అంత సులువైన పని ఏమీ కాదు.అందుకే ఈ రహదారిని ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా భావిస్తారు. ఇది నార్వేలోని ఓల్డర్ ఫోర్డ్‌ని, నార్త్ కాప్ ప్రాంతంతో కలుపుతుంది. శతబ్దాలనుండి ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా ఉన్న ప్రాంతాలను ఈ రోడ్డు యూరప్‌తో కలుపుతుంది.

ఈ హైవేపై ప్రయాణిస్తే, మంచి ప్రకృతి సౌందర్యాన్ని చూడవచ్చు. దారి పొడవునా, మంచు కొండలు, గుట్టలు. లోతైన లోయలు ఎత్తైన దేవదారు వృక్షాలు, రెయిన్ డీర్స్ ఇక్కడ కనువిందు చేస్తాయి. ఈ రోడ్డుపై కొన్ని చోట్ల ఒంటరిగా ప్రయాణించడానికి అనుమతి లేదు గుంపుగా ఉంటేనే అక్కడినుండి వెళ్లడానికి అనుమతి ఉంటుంది. వందల కిలో మీటర్ల పాటు, సముద్ర తీరంపైన ఈ రోడ్డుపై వెళుతుంటే, పక్కనే ఉన్న చిన్నచిన్న గ్రామాలు తీరం వెంట కట్టిన చిన్న పిచ్చుక గూళ్లలాగా కనిపిస్తాయి. ఈ డెడ్ ఎండ్ వద్ద ఒక సొరంగాన్ని నిర్మించారు. ఇది మెగెరొయాఅనే మరో ద్వీపాన్ని, కలుపుతుంది. ఈ హైవే అంతమయే ప్రాంతాన్ని నార్డికాప్ అంటారు. చలికాలంలో ఐతే ఇక్కడి వాతావరణం సంగతి చెప్పనవసరంలేదు ఎలాగూ ఉత్తర ధ్రువమంతా మంచుతో కప్పబడి పోతుంది. వేసవిలో సూర్యుడు అస్తమించడు, ఇక చలికాలం అంతా చీకటే ఉంటుంది. ఇక్కడ నివసించే వారికి మిగతా ప్రపంచంతో సంబంధం ఉండదు. వందల యేళ్లనుండి వారు అలాగే జీవిస్తున్నారు. వారంతా సముద్రంలోని చేపలు పీతలను పడుతూ జీవిస్తుంటారు. ఈ ప్రాంతం చేపలకు చాలా ప్రసిద్ధి. వందల యేళ్లనుండి అనేకులుచేపల వేటకు ఈ ప్రాంతానికి వచ్చేవారు. అట్లాంటిక్ సముద్రం ప్రశాంతంతగా ఉన్నపుడు, ఈ రోడ్డు మీద ప్రయాణం అందమైన అనుభూతిని కలిగిస్తుంది. నేరుగా సముద్రంలోకే వెళ్లిపోతున్నామా అనిపించి కొంచెం భయం కూడా వేస్తుంది.


10 తేడాలను గుర్తించండి?



దారి కనుక్కోండి



గాడిదలు ఎన్ని? కోళ్లు ఎని?



సరైన నీడలతో జత పరచండి



డైలీ సుడోకు - 369

		1	2	6	
4					
	5	3			
			6	5	
					6
	2	6	1		

సుడోకు - 368 సమాధానం

8	9	1	7	5	6	3	4	2
5	7	3	2	4	1	9	6	8
2	4	6	3	8	9	1	7	5
7	2	8	9	6	3	5	1	4
9	3	5	1	7	4	2	8	6
6	1	4	5	2	8	7	9	3
3	8	7	4	9	5	6	2	1
1	6	9	8	3	2	4	5	7
4	5	2	6	1	7	8	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.